తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


### ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ తదితరుల బృందం ఎఐసిసి నాయకులతో న్యూఢిల్లీలో శుక్రవారం ఉదయం 11గంటలకు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా కులగణన సర్వే నివేదిక, ఎస్‌సి వర్గీకరణ అంశాలను ఎఐసిసి నాయకులకు వివరించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈనెలలో కుల గణనపై సూర్యాపేటలో, ఎస్‌సి వర్గీకరణపై మెదక్‌లో నిర్వహించే రెండు బహిరంగ సభలకు ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్‌గాంధీలను వారు ఆహ్వానించనున్నారు.


సంపుటి 27, సంచిక: 229 | శుక్రవారం | 07-02-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## సగౌరవంగా వెనక్కు తీసుకురావాలి

- సిపిఐ డిమాండ్
- అమెరికా అమానవీయ ప్రవర్తనకు ఖండన



**న్యూఢిల్లీ :** నివాస అర్హతపత్రాలు లేవనే పేరుతో భారతీయులను స్వదేశానికి తరలించడంలో అమెరికా అమానవీయంగా ప్రవర్తించిందనీ, దీనిపై కేంద్ర ప్రభుత్వం సకాలంలో తగిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. దేశంలో అసాధారణంగా పెరిగిపోయిన నిరుద్యోగ పరిస్థితుల నుండి బయటపడాలని కోరుకునే భారత పౌరులను విదేశాలకు తీసుకెళతామని మభ్యపెట్టి మోసం చేస్తున్న ఏజెంట్లకు తగిన గుణపాఠం నేర్పేవిధంగా గట్టి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఈ మేరకు గురువారంనాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ''అమెరికా ప్రభుత్వ యంత్రాంగం చాలా అమానవీయ, అగౌరవకరమైన పద్ధతులలో భారత పౌరులను స్వదేశానికి తరలించడాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. మన పౌరుల మౌలికమైన తరువాయి 2లో





సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో నిర్వహించిన బహిరంగసభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ ప్రసంగించారు.

## ధియరీ పరీక్షల్లోనూ కెమెరాలు

- ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం
- 117 కళాశాలల్లో అద్దెకు సిసి కెమెరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల హడావుడి ప్రారంభమయింది. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రాక్టికల్స్ జరుగుతున్న తరువాయి 2లో

## భారతీయుల తరలింపుపై పార్లమెంట్‌లో దుమారం

- ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల ఆందోళన
- కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్
- కొనసాగిన వాయిదాల పర్వం



**న్యూఢిల్లీ :** అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలిపు ప్రక్రియపై పార్లమెంట్‌లో దుమారం చెలరేగింది. ఉభయసభల్లోనూ గురువారం ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. అమెరికా 104 మందిని స్వదేశానికి పంపించడంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభలో వాయిదాల పర్వం కొనసాగింది. కాగా, ఉదయం లోక్‌సభ ప్రారంభంకాగనే భారతీయుల తరలింపుపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. సభ్యులను శాంతింపజేసేందుకు స్పీకర్ ఓమ్ బిర్లా తీవ్రంగా ప్రయత్నించారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనను ప్రభుత్వం తీవ్రంగా తీసుకుంటుందని చెప్పారు. ఈ అంశం చాలా సున్నితమైనదని, పైగా విదేశీ విధానానికి సంబంధించినదని, అందువల్ల ప్రభుత్వం చాలా తీవ్రంగా సీరియస్‌గా తీసుకుంటుందని చెప్పారు. విదేశానికి కూడా సొంతంగా నియమ, నిబంధనలు ఉన్నాయన్నారు. తమ సమస్యలను మధ్యాహ్నం 12 గంటల తరువాత లేవెత్తవచ్చని, ముందుగా ప్రశ్నోత్తరాలను సజావుగా తరువాయి 2లో



## ఇంత అమానుషమా!

- భారతీయులను గౌరవించరా?
- పార్లమెంట్ కాంప్లెక్స్ ఆవరణలో ఎల్‌డిఎఫ్ ఎంపిలుసహా ప్రతిపక్ష సభ్యుల ఆందోళన

**న్యూఢిల్లీ :** అమెరికా నుంచి భారతీయులను తరలించడంపై వామపక్ష పార్టీల ఎంపిలు సహా ఇతర ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేశారు. వారి పట్ల అమానుషంగా ప్రవర్తించారని మండిపడ్డారు. అమెరికా తొలి విడతలో 104 మంది భారత అక్రమ వలదారులను బుధవారం స్వదేశానికి తరలించిన విషయం తెలిసిందే. అయితే విమానంలో ఉన్నంత వరకు తమ చేతులు, కాళ్లకు సంకెళ్లు వేశారని, అమృత్‌సర్ విమానాశ్రయంలో దిగేముందు మాత్రమే వాటిని తొలగించారని స్వదేశానికి చేరుకున్న భారతీయులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కేంద్రంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. విదేశాంగశాఖమంత్రి జైశంకర్ పార్లమెంట్ ఉభయసభల్లోనూ ప్రకటన చేశారు. ఆ తరువాత పార్లమెంట్ కాంప్లెక్స్ వద్ద లెఫ్ట్ డెమాక్రటిక్ (ఎల్‌డిఎఫ్) ఫ్రంట్ ఎంపిలు ఆందోళనకు దిగారు. ట్రంప్ అధికార యంత్రాంగం ప్రదర్శిస్తున్న అమానుష వైఖరికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం నిరసన తెలపలేకపోవడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. మంత్రి అమెరికా ప్రభుత్వ ప్రతినిధిలా మాట్లాడుతున్నారని సిపిఐ రాజ్యసభ సభ్యుడు పి. సందోష్ కుమార్ ఆరోపించారు. 'మంత్రి అమెరికా పరిపాలన ప్రతినిధిలా మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వానికి ట్రంప్ ఫోబియా అనే అమెరికా ఫోబియా ఉంది. వారు మన కోసం కాదు, అమెరికా తరపున మాట్లాడుతున్నారు. ఇది చాలా తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతుంది' అని ఆయన అన్నారు భారతీయుల ఆత్మగౌరవాన్ని తరువాయి 2లో

## ప్రజల్లోకి మరింత విస్తృతంగా పథకాలు, కార్యక్రమాలు

- స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యం
- సిఎల్‌పి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- కులగణనపై సూర్యాపేటలో, ఎస్‌సి వర్గీకరణపై మెదక్‌లో నెలాఖరులోగా భారీ బహిరంగ సభలు
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని కాంగ్రెస్ శాసనసభా పక్షం( సిఎల్‌పి) సమావేశం నిర్ణయించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు, నేతలకు సిఎల్‌పి దిశా నిర్దేశం చేసింది. నేతలందరూ పార్టీ విధానాలకు కట్టుబడి ఉండాలని, సమస్యలేమైనా ఉంటే పార్టీ వేదికలపై మాట్లాడాలని, ప్రభుత్వ పథకాలపై, కాంగ్రెస్ పార్టీ విధానాలు, అంతర్గత విషయాలపై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బహిరంగంగా మాట్లాడడం తగదని సిఎల్‌పి హెచ్చరించింది. పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించే వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు సిఎల్‌పి నిర్ణయించింది. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సిఎల్‌పి) సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో గురువారం జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. దాదాపు ఐదు గంటల పాటు జరిగిన తరువాయి 2లో

## వలసదారుల బహిష్కరణ కొత్తదేమీ కాదు

- రాజ్యసభలో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ వివరణ
- వారిపట్ల ఉదారంగా వ్యవహరించాలని కోరుకున్నామని వెల్లడి
- విదేశాలకు వెళ్లేందుకు వీసా విధానాలను సరళతరం చేయనున్నామని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** వలసదారులను స్వదేశాలకు పంపించేటపుడు వారిపట్ల అమర్యాదగా ప్రవర్తించవద్దని కోరనున్నట్టు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న భారతీయ వలసదారులు తమపట్ల అమెరికా అధికారులు అమర్యాదగా ప్రవర్తించారని చెప్పడంతో ఈ విషయమై రాజ్యసభలో విపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో జైశంకర్ మాట్లాడుతూ వలసదారులపట్ల ఉదారంగా వ్యవహరించాలని కోరనున్నట్టు తెలిపారు. అంతేగాక చట్టబద్ధంగా విదేశాలకు వెళ్లేందుకు వీసా విధానాలను సరళతరం చేయనున్నామన్నారు. విదేశాలలో చట్ట విరుద్ధంగా నివసించే తమ పౌరులను స్వదేశాలకు రప్పించే బాధ్యతను ఆయా దేశాలు చేపట్టాలని జైశంకర్ సూచించారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని వారి దేశాలకు పంపించే విధానం కొత్తదేమీ కాదని, 2012నుంచి అమెరికా ఈ విధానాన్ని పాటిస్తున్నదన్నారు. అయితే మహిళలు, బాలలకు కొంత వెసులుబాటు కల్పిస్తున్నదన్నారు. ఇపుడు కూడా అదే పద్ధతిలో భారతీయులను తమ విమానంలోనే అమృత్‌సర్‌కు పంపిందని వివరించారు. అమెరికాలో స్థిరాస్తులను కలిగి ఉన్న వారి విషయమై అక్కడి అధికారులతో సంప్రదిస్తున్నట్టు తెలిపారు. దీనిపై త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. వలసదారుల సంఖ్యపై వివరణ ఇస్తూ 2009లో భారతీయ వలసదారుల తరువాయి 2లో

### దేశ భద్రతకే తొలి ప్రాధాన్యం


యుఎస్ ఎంబసీ స్పందన

వలస విధానాన్ని కట్టదిట్టంగా అమలు చేయడం, దేశ భద్రత తమ తొలి ప్రాధాన్యమని అమెరికా దౌత్య కార్యాలయం వెల్లడించింది. అమెరికానుంచి భారతీయ అక్రమ వలసదారులను స్వదేశానికి పంపిన నేపథ్యంలో వెల్లువెత్తిన నిరసనలపై దేశ రాజధానిలోని అమెరికా దౌత్య కార్యాలయం స్పందిస్తూ తమ దేశ వలస విధానాలను కట్టుదిట్టంగా అమలు చేయడమే తమకు ముఖ్యమని, ఇందులో దేశ భద్రతకు సంబంధించిన అంశం ముడిపడి ఉందని తెలిపింది. డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టిన తరువాయి 2లో

## వర్గీకరణ అడ్డుకునే కుట్రలు సాగవు

ఎవరికీ భయపడను

మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా



ప్రజాపక్షం / హైదరాబాద్

ఎస్‌సి వర్గీకరణను అడ్డుకునే కుట్రలు సాగబోవని, తాను ఎవరికీ భయపడేద లేదని, బట్టేబాజ్ మాటలతో జాతిని మోసం చేసేటోన్నికాదని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. న్యాయపరమైన సమస్యలు రాకుండా వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నామని, వివాదాలు సృష్టించి అడ్డుకునే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వారిని తరువాయి 2లో



## 2వ ఏఎన్ఎంల పోస్టులు పెంచాలి

రూ.10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్, 100శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలి

రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

09

## ట్రంప్ గుబులు



- పిల్లల భవిష్యత్తుపై తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- వారిలో అత్యధికులు ఖమ్మం వారే

ప్రజాపక్షం/ఖమ్మం

ఒకప్పుడు మా పిల్లలు అమెరికాలో ఉన్నారంటూ తల్లిదండ్రులు, వారి బంధువులు గర్వంగా చెప్పుకునే వారు. అమెరికా వెళ్లిన వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన వృద్ధి రావడం, ఆస్తుల కొనుగోళ్లు చేయడంతో ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విదేశాలకు పంపి అక్కడే స్థిరపడేలా చేయాలన్న వాంఛ దిన దిన ప్రవర్ధమానమైంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీ దేశాలకు పెద్ద ఎత్తున విద్యార్థులను పంపి చదువు అక్కడే పూర్తి చేసేలా తగు ఏర్పాట్లు చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి అమెరికాకు చదువుల కోసం వెళ్లి స్థిరపడిన వారిలో తరువాయి 12లో

## ప్రశ్నార్థకంగా సింగరేణి మనుగడ

- బొగ్గు ఉత్పత్తిని విస్మరిస్తున్న యాజమాన్యం
- లాభాల కోసం ఇతర వ్యాపారాలవైపు
- మితిమీరిన రాజకీయ జోక్యం
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/భద్రాచలం

సిరులు మాగాణిగా ఉన్న సింగరేణి సంస్థ మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారిందని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండల సిపిఐ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, రాష్ట్రానికే తలమానికమైన సింగరేణి సంస్థ అసలు అశయమైన బొగ్గు ఉత్పత్తిని విస్మరించి లాభాల కోసం తరువాయి 12లో

# గాజాపై ప్లేటు ఫిరాయించిన వైట్‌హౌస్!




**వాషింగ్టన్ :** గాజాలో ప్రజలను పొరుగుదేశాలకు శాశ్వతంగా తరలించాలన్న ప్రతిపాదన లేదనీ, ఈ తరలింపు తాత్కాలికమే ననీ అమెరికా అధ్యక్ష భవనం వివరణ ఇచ్చింది. పాలస్తీనియన్లను పొరుగుదేశాలకు శరణార్థులుగా తరలిస్తామని, గాజాను ఖాళీచేశాక అభివృద్ధి చేస్తామని ట్రంప్ చేసిన సంచలన ప్రకటనకు తీవ్ర వ్యతిరేకత రావడంతో వైట్‌హౌస్ అధికారులు ప్లేటు ఫిరాయించారు. ట్రంప్ మాటలకు తప్పుడు అర్థాలు తీయవద్దని కోరింది. విదేశాంగమంత్రి మార్క్ రుబియో స్పందిస్తూ, ట్రంప్ తాత్కాలిక ప్రణాళిక గురించి మాత్రమే మాట్లాడారని, శాశ్వత తరలింపు కాదన్నారు. గాజా ప్రజలు స్వేచ్ఛగా తమ మాతృదేశంలో ఉండేందుకు పూర్తి అనుమతి ఉంటుందన్నదే ట్రంప్ ఉద్దేశమన్నారు. గడచిన మంగళవారంనాడు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూతో మొదటిసారి సమావేశమైన తర్వాత ట్రంప్ పత్రికాగోష్ఠిలో వ్యక్తం చేసిన అభిప్రాయాలపై వైట్‌హౌస్ అధికార ప్రతినిధి, ప్రెస్ సెక్రటరీ కారోలైన్ లావెట్టి కూడా గురువారంనాడు వివరణ ఇచ్చారు. జనవరి 26న ట్రంప్ విమాన ప్రయాణం చేస్తూ పాత్రికేయులతో మాట్లాడినప్పుడు గాజాను క్లీన్ చేయాలని, పాలస్తీనియన్లను పూర్తిగా బయటకు పంపేయాలని, పశ్చిమ ఆసియాలో గాజా కీలకమైన ప్రాంతమని వ్యాఖ్యానించారు. బ్రిటన్ సహా పలు అమెరికా మిత్ర దేశాలు ట్రంప్ మాటలను తప్పుపట్టాయి. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంస్థ ప్రధానాధిపతి ఓల్కర్ టర్క్ కూడా, ఇది అంతర్జాతీయ చట్టాలకు పూర్తి విరుద్ధమని, నేరం అవుతుందని స్పష్టం చేశారు. ''గాజాలో యుద్ధ విరమణ తర్వాత లక్షలమంది ప్రజలు తండోపతండాలుగా తమ ఇళ్ళకు తరలి వచ్చారు. కానీ ఇప్పుడు గాజా ఏ మాత్రం నివాసయోగ్యం కాదు, అతి కేవలం ఒక శిథిలాలతో నిండిన ప్రదేశం, అక్కడ పునర్నిర్మాణం చేయాల్సి ఉంది, దీనికి కొన్ని సంవత్సరాలు సమయం పడుతుంది, అప్పటివరకూ పాలస్తీనియన్లు ఎక్కడ ఉంటారు? వారికి ఈజిప్టు, జోర్డాన్ వంటి ప్రభుత్వాలు తాత్కాలిక నివాసం ఏర్పాటు చేస్తే పునర్నిర్మాణం తర్వాత ఎంచక్కా పాలస్తీనియన్లు గాజాకు తిరిగి వెళ్ళవచ్చు, అప్పుడు గాజాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు మెరుగుపడతాయి, ట్రంప్ ఈ దిశగా అన్ని దేశాలను భాగస్వామ్యంచేసి ఈ పునర్నిర్మాణం చేపడతారు, ఆయన మాటల్లోని అంతరార్థం ఇదే, తప్పుడు అర్థాలు తీయవద్దు'' అని కారోలైన్ లావెట్టి వివరణ ఇచ్చారు.

**ఇక్కడే ఛస్తాం,ఎక్కడికీ వెళ్ళం**

''మేం ఇక్కడే పుట్టాం, ఇక్కడే చచ్చిపోతాం, మా ఇళ్ళు వదలి వెళ్ళేదిలేదు'' అని పాలస్తినా ప్రజలు శపథం చేశారు. గాజా నుండి పాలస్తీనియన్లను తరలించి శిథిలాలు తొలగించి ఇళ్ళు నిర్మించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ట్రంప్ చెప్పిన తర్వాత పాలస్తీనియన్లలో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. 20 లక్షలమంది ప్రజలు పొరుగు దేశాల నుండి గడచిన 15 రోజుల్లో గాజాకు తిరిగి వచ్చి శిథిలమైన తమ ఇళ్ళను చూసుకుని భోరున విలపిస్తున్నారు. శిథిలాలు శుభ్రం చేసుకుని విరిగిపోయిన ఆ గోడలమధ్యలోనే తాత్కాలికంగా కాలక్షేపం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గాజా లో ప్రతిచోటా ప్రతి వీథిలో ఇవే దృ శ్యాలు కనిపిస్తున్నాయి.

ప్రపంచం

# యూరప్‌లో జనవరిలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు



**లండన్ :** యూరప్‌లో గతనెలలో ఉష్ణోగ్రతలు గతం కంటే రికార్డుస్థాయిలో భారీగా పెరిగాయని వాతావరణ శాస్త్రవేత్తలు గురువారంనాడు వెల్లడించారు. 2025 జనవరిలో యూరప్‌లో ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగం నాటికంటే ఎక్కువగా 1.75 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో భూతాపం పెరుగుదలపై వాతావరణ శాస్త్రవేత్తలు చర్చ జరుపుతున్నారు. ఉష్ణోగ్రతల విషయంలో ఈ ఏడాది జనవరి నెల యూరప్‌లో రికార్డు సృష్టించిందని కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీసెస్ (కెసిఎస్) ప్రకటించింది. ఇది మానవ తప్పిదమేనని, వాతావరణంలోకి కాలుష్య కారకవాయువులను విడుదల చేయడం గణనీయంగా పెరిగిపోవడంవల్ల భూతాపం పెరిగిందని కెసిసిఎస్ పేర్కొంది.1940 లో 0.5 డిగ్రీల సెంటీగ్రేడ్స్ ఉష్ణోగ్రత నమోదుకాగా, 2000 నాటికి క్రమంగా ఒక డిగ్రీ సెంటీగ్రేడ్‌కు, 2020 నాటికి 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌కు ఉష్ణోగ్రత పెరిగిందని, గతనెలలో ఈ ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో 1.75 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌కు పెరిగిందని శాస్త్రజ్ఞులు ప్రకటించారు.

# ఫిలిప్పైన్స్ ఉపాధ్యక్షురాలిపై విచారణ



**మనీలా :** ఫిలిప్పైన్స్ దేశ వివాదాస్పద ఉపాధ్యక్షురాలు సారా దుతెర్తెపై జూన్‌లో విచారణ ప్రారంభం అవుతుందని ఆ దేశాధ్యక్షుడు బాంగ్ బాంగ్ మార్కోస్ చెప్పారు. దాదాపు నాలుగు నెలల్లో ఫిలిప్పైన్స్ పార్లమెంటు ఎగువసభ సెనేట్, దిగువసభ ప్రజాప్రతినిధుల సభ సమావేశాలు జరుగనున్నాయని ఈ సమావేశాలలో చర్చించిన తర్వాత జూన్‌లో దుతెర్తెపై చట్టపరంగా కేసులు నమోదు చేసి న్యాయ విచారణ ప్రారంభం అవుతుందని మార్కోస్ చెప్పారు. ఇప్పటికే దిగువసభలో 215 మంది ఆమెకు వ్యతిరేకంగా సంతకాలు చేసి నేరస్థురాలుగా పరిగణించి దానిని సెనేట్‌కు కూడా పంపారు. ఉపాధ్యక్షురాలు సారా దుతెర్తె బాహాటంగానే దేశాధ్యక్షుడు మార్కోస్‌ను హత్య చేయిస్తానని, అందుకు కిరాయి గూండాలను నియమించానని, సుపారీ ఇచ్చానని గత ఏడాది నవంబరులో ఆమె ప్రకటించి సవాలు చేశారు. అధ్యక్షుడు, ఆయన భార్య, సోదరి, హౌస్ స్పీకర్‌పై కూడా అవినీతి ఆరోపణలు చేశారు. అదేవిధంగా ఆమె తీవ్రమైన అవినీతికి పాల్పడ్డారని, దక్షిణ చైనా సముద్రంలో చైనా మితిమీరిన ఆగడాలు చేస్తున్నప్పటికీ ఉపాధ్యక్షురాలు హోదాలో వాటిని ఖండించి వ్యతిరేకించడంలో ఆమె విఫలమయ్యారనీ బుధవారం నాడు ఆమెపై ఆరోపణలు నమోదయ్యాయి. దేశావ్యాప్తంగా ఆమెకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయి.

# నేటి నుండి వేలాదిమంది యుఎస్‌ఎయిడ్ ఉద్యోగుల 'ఆన్ లీవ్'




**వాషింగ్టన్ :** ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు సహాయం చేస్తున్న ''యుఎస్‌ఎయిడ్''ను విదేశాంగశాఖలో విలీనం చేస్తామని, ఇక సహాయం నిలిపేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ యుఎస్ ఎయిడ్ (యుస్ ఏజన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డవలప్‌మెంట్)లో పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగులు శుక్రవారం రాత్రి నుండీ సెలవులపై వెళుతున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థ నిర్వహిస్తున్న సేవలు నిలిచిపోతాయి. ఈ విధంగా మానవతా సహాయ చర్యలను, సేవలను ట్రంప్ నిలిపివేయడంపట్ల ఐక్యరాజ్యసమితి తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పునరాలోచన చేయాలని కోరింది. కానీ ట్రంప్ మాత్రం ఈ నిధులు దుర్వినియోగం అవుతున్నాయనీ, వీటికి లెక్కాపత్రం లేకుండాపోయాయనీ, ఈ నిధులు తప్పుతోవపట్టి అనర్హుల చేతుల్లోకి వెళ్ళాయని ఆరోపిస్తున్నారు. ట్రంప్‌కు ఎలాన్ మస్క్ తోడుగా ఉండి ఈ వాదనను సమర్థిస్తున్నారు.

# కాంగోలో ఆగని హింస

## గోమా వీధుల్లో 2900 మృతదేహాలు




**గోమా :** రువాండా సరిహద్దుల్లో ఉన్న డి.ఆర్. కాంగో ప్రధాన నగరం గోమాలో 'ఎం–23 తిరుగుబాటుదారులు' మళ్ళీ దాడులు కొనసాగిస్తున్నారు. తిరుగుబాటుదారులకు, కాంగో ప్రభుత్వ సైన్యానికి మధ్య పరస్పర దాడుల్లో ఇప్పటికే రమారమి 2,900 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. అంతర్జాతీయ నేరాల విచారణ న్యాయస్థానం (ఐసిసి) కూడా కాంగో తూర్పుప్రాంతంలో ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నది. గోమాలో మానవతా సంక్షోభం పరాకాష్టకు చేరుకుందని ఐసిసి వ్యాఖ్యానించింది. సంక్షోభ పరిష్కారానికి కృషి చేయాలని అందరికీ ఐసిసి విజ్ఞప్తి చేసింది. రెండు వారాల క్రితం గోమాలో యుద్ధం మొదలైంది. దీంతో అంతర్జాతీయ సంస్థలతోపాటు వేలాదిమంది ఆ నగరాన్ని వదలి పారిపోయారు. కాగా గోమాను పూర్తిగా స్వాధీనం చేసుకున్నామని తిరుగుబాటుదారులు ప్రకటించారు. అనంతరం ఉత్తర కివూ ప్రాంతానికి ఒక గవర్నర్‌ను, ఇద్దరు వైస్–గవర్నర్లను నియమించినట్లు ఎక్స్ వేదికగా ఎం–23 గ్రూపు ప్రకటించింది. గోమాలో మానవతా దృక్పథంతో కాల్పుల విరమణ అమలు చేసినట్లు ఎం–23 స్వచ్ఛంధ ప్రకటన చేసినప్పటికీ తిరిగి విజృంభించారు. ఈసారి రువాండా సైన్యంతో కలిసి వారు హింస సృష్టిస్తున్నారు. ఎం–23 తిరుగుబాటుదారులకు ఇప్పటివరకూ తెరవెనుక నుండి మద్దతు ఇస్తూ వచ్చిన రువాండా ప్రభుత్వ దళాలు కూడా రంగంలోకి దిగాయి. రక్తపాతంవల్ల ఇప్పటికే గోమా వీధుల్లోంచి సేకరించిన 900 మృతదేహాలను ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు కాంగోలో ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షణ డిప్యూటీ చీఫ్ వివియన్ వాన్ డి పెర్రే ప్రకటించారు. ఆ తర్వాత జరిగిన హింసలో మరో 2000 మంది మృతదేహాలు వీధుల్లోంచి సేకరించినట్లు ఆయన చెప్పారు. ఒకప్పుడు రువాండాలో మూడు జాతులమధ్య జరిగిన అంతర్గత సంఘర్షణలో దేశం వదలి చెల్లాచెదరై పారిపోయినవారిలో ఎక్కువభాగం టుట్సీ తెగవారు అనేక పరిణామాల తర్వాత 'ఎం–23' తిరుగుబాటు దళంగా ఏర్పడ్డారు. కాంగోలో ప్రాంతాలను ఆక్రమించుకోవడం ప్రారంభించారు. తాము తమ జాతిఇ అస్తిత్వ పోరాటం చేస్తున్నామని తిరుగుబాటు దారులు చెప్పుకుంటున్నారు. వీరికి రువాండా ప్రభుత్వం సైన్యం అండగా ఉందని ఐక్యరాజ్యసమితి కూడా సాక్ష్యాలు చూపించింది. ఐతే రువాండా అధ్యక్షుడు మాత్రం తమ సైన్యాలు గోమాలో ఉన్నట్లు తనకు తెలియనే తెలియదని బుకాయించారు.

## తొలి ప్రాధాన్యం (మొదటి పేజీ తరువాయి)

తరువాత అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకున్న నేపథ్యంలో బుధవారం 104మంది భారతీయ అక్రమ వలసదారులతో కూడిన అమెరికా సైనిక విమానం బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రయాణ సమయంలోతమ చేతులు, కాళ్ళు సంకెళ్లతో బంధించారని వలసదారులు ఆరోపించిన నేపథ్యంలో వలస చట్టాలను కఠినంగా అమలు చేయడమే తమకు ముఖ్యమని, అక్రమంగా తమ దేశంలో నివసించే వారిని బహిష్కరించడమే తమ విధానమని అమెరికా దౌత్యాధికారులు వెల్లడించారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తమ చట్టాలను కఠినంగా అమలు చేయడంతోపాటు, అక్రమ వలసదారులను బహిష్కరించి దేశ భద్రతను కాపాడడమే తమకు ముఖ్యమన్నారు. కాగా స్వదేశానికి చేరుకున్న భారతీయ వలసదారులను వివిధ ప్రభుత్వ నిఘా సంస్థలు కూలంకషంగా ప్రశ్నించి నేర చరిత్ర కలిగిన వారెవరైనా ఉన్నారో పరిశీలించాయి.

## వెనక్కు తీసుకురావాలి (మొదటి పేజీ తరువాయి)

మానవహక్కులను, మర్యాదను నిర్లక్ష్యం చేసింది. వృద్ధులు,రోగుల క్షేమాన్ని పట్టించుకోకుండా, సంబంధిత చట్టాలను కూడా అగౌరవించి ఎంతమాత్రం సమర్థించడానికి వీలులేని విధంగా వారిపట్ల అమానవీయంగా ప్రవర్తించారని స్పష్టంగా తెలుస్తున్నది. భారత ప్రభుత్వం చాలా గట్టిగా నిలబడి తక్షణమే ఈ సమస్యను ఉన్నతస్థాయి అమెరికా అధికారుల వద్ద ప్రస్తావించాలి, మళ్ళీ ఇంకెప్పుడు ఈ విధమైన ఉల్లంఘనలు జరగకుండా ఈ సమస్యను పరిష్కరించాలి. డోనాల్డ్ ట్రంప్ విదేశీ విముఖతకు, వలస వ్యతిరేక విధానాలకు బలైపోయి ఇంకా అమెరికాలో ఉండిపోయిన భారతీయులను వెనక్కు తీసుకువచ్చేందుకు మన దేశీయ వనరులను, దేశీయ మౌలిక రవాణాసదుపాయాలను, ఎయిర్‌క్రాఫ్టులను ఉపయోగించాలి. భారతీయుల గౌరవ మర్యాదలను కాపాడేవిధంగా అమెరికాలో మిగిలి ఉన్న మన వారిని వెనక్కు తీసుకురావాలి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో కోరింది.

## కొత్తదేమీ కాదు(మొదటి పేజీ తరువాయి)

సంఖ్య 734 కాగా, 2019లో అది అత్యధికంగా 2,042గా ఉందన్నారు. గత యేడాది 1,368 మందిని, ఈ యేడాది 104మందిని అమెరికా భారతీయ వలసదారులను తిరిగి పంపించినట్టు వెల్లడించారు. మొత్తంగా 2009నుంచి 15,756మంది భారతీయ వలసదారులను తిరిగి పంపించినట్టు జై శంకర్ వెల్లడించారు. వలసదారులను బహిష్కరించే బాధ్యతను అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కష్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసిఇ) అధికారులు నిర్వహిస్తారని, అందుకోసం 2012 నుంచి ఒక నిర్దిష్టమైన పద్ధతిని అవలంభిస్తున్నట్టు జై శంకర్ తెలిపారు. అమెరికాతో సంబంధాలు దృఢతరం అయ్యేందుకు వలస విధానంకూడా ఉపయోగపడుతుందన్నారు. అక్రమ పద్ధతిలో వలసవెళ్లే వారి చర్యలుకూడా అనుచితంగానే ఉంటాయన్నారు. అక్రమ వలసదారులు అమానవీయ స్థితిలో మనుగడ సాగించవలసివస్తుందన్నారు. ఈ విషయాన్ని కొత్త సమస్యగా పరిగణించనవసరం లేదని, ఎప్పటినుంచో కొనసాగుతున్న విధానమేనన్నారు. వలసదారులను పరిశీలించిన తరువాతే అమెరికా విమానానికి క్లియరెన్స్ ఇచ్చినట్టు జైశంకర్ తెలిపారు. కాగా పలువురు వలసదారులు తమను సంకెళ్లతో నిర్బంధించారని, తమపట్ల అనుచితంగా ప్రవర్తించారని తెలిపారు. అమృతసర్‌కు చేరుకున్న తరువాత తమ సంకెళ్లను విడదీశారని తెలిపారు.

తిరిగి వచ్చిన వలసదారులు భారతీయులే అని ధృవీకరించుకునేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశామని, వారు అమెరికా ఎలా వెళ్లారు, ఏజెంట్ ఎవరు అనే అంశాలను పరిశీలిస్తున్నట్టు జై శంకర్ తెలిపారు. అక్రమ వలసలను నిరోధించేందుకు ఇకపై ముందు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. స్వదేశం చేరుకున్న వలసదారులను వారి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విషయమై పార్లమెంట్ సభ్యులుగాని, ప్రజలుకానీ ఆందోళన చెందనవసరం లేదన్నారు. కాగా అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న వారి సమాచారం ప్రస్తుతం ఏమీ లేదని, స్టూడెంట్ వీసా జారీ ఈ అంశం కిందకు రాదని జై శంకర్ సభకు స్పష్టం చేశారు.

## పథకాలు, కార్యక్రమాలు
(మొదటి పేజీ తరువాయి)

సిఎల్‌పి సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ వ్యూహం, ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళడం, కుల గణన సర్వే, ఎస్‌సి వర్గీకరణ, పార్టీ విధానాలను సొంత పార్టీ నేతలే తప్పుపడుతుండటం తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, పార్టీ విధానాలపై సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శలు చేస్తుంటే ప్రజల్లోకి చెడు సంకేతాలు వెళ్తాయని, ఏవైనా విభేదాలుంటే అంతర్గతంగా చర్చించుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. పార్టీ విధానాలను సొంత పార్టీ నేతలే తప్పుపడుతుండడం పట్ల సిఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించే వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. పార్టీ ఎంఎల్‌ఎల తీరుపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సీరియస్ అయ్యారు. సిఎం రేవంత్రెడ్డి అధ్యక్షతన ఐదున్నర గంటల పాటు జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని కులగణన, ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో చేసినా, అనుకున్న స్థాయిలో ప్రచారం చేయడం లేదని దీపాదాస్ మున్షీ అన్నారు. పార్టీ అంతర్గత విషయాలు బహిరంగ వేదికలపై మాట్లాడితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించినట్లు సమాచారం.

**రెండు భారీ బహిరంగ సమావేశాలు : మహేష్‌కుమార్ గౌడ్**

రాష్ట్రంలో స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఫిబ్రవరి నెలలో రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. సిఎల్‌పి సమావేశం అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేటలో కులగణనపై ఎఐసిసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎస్‌సి వర్గీకరణపై మెదక్‌లో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గేతో మరో బహిరంగ నిర్వహింఒచాలని పార్టీ నిర్ణయించిందని, ఈ సభల కోసం అగ్ర నాయకులను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వెళుతున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించామని, సమావేశంలో ఎమ్మెల్యేలు తమకున్న అభిప్రాయాలను తెలియజేశారని, ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు , ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశామన్నారు. కుల గణన అధికారిక డాక్యుమెంట్ ను అసెంబ్లీలో ఉంచామని, బిసి సంఘాలను తప్పుదోవ పట్టించే విధంగా బిఆర్‌ఎస్, బిజెపి వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. మంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక పరిస్థితులపై ఎస్‌సి వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని, వర్గీకరణ, కుల గణనను విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంఎల్‌ఎలకు, డిసిసిలకు దిశా నిర్దేశం చేశామన్నారు. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించామని, రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించామని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. రెండు మూడు రోజుల్లో టిపిసిసి కార్యవర్గంపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. బిజెపితో లోపాయకారి ఒప్పందం కోసం కెటిఆర్ ఢిల్లీకి వెళ్ళారని ఆయనారోపించారు.

## కెమెరాలు (మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. 417 కళాశాలల్లో అద్దెకు సిసి కెమెరాలు తీసుకోనున్నారు. కొన్ని కార్పొరేట్ కళాశాలల్లో ఇప్పటికే కెమెరాలు ఉన్నాయి. సిసి కెమెరాల ఏర్పాటును వ్యతిరేకిస్తున్న కళాశాలకు పరీక్ష కేంద్రాలు ఇవ్వడం లేదు. 90 శాతం కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. థియరీ ఎగ్జామ్స్‌లో కూడా సిసి కెమెరాలు ఉంటాయని తెలిపారు. థియరీ ఎగ్జామ్స్ సమయంలో పేపర్ ఓపెన్ చేసే రూమ్‌లో, కేంద్రం ప్రవేశంలో, కారిడార్‌లో, గ్రౌండ్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## ఇంత అమానుషమా!(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలని సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ పార్లమెంట్ వెలుపల మీడియాకు తెలిపారు. భారతీయుల చేతులకు బేడీలు వేసి గౌరవించలేదని, సభ్యులు అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి సమాధానం ఇవ్వలేదన్నారు. చిన్న దేశాలు కూడా ట్రంప్ ప్రభుత్వాన్ని ఎదిరించే ధైర్యం ఉన్నా కానీ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం ఒత్తిడికి లోనవుతోందని చెప్పారు. ఎల్‌డిఎఫ్ ఎంపిలు 'డౌన్ డౌన్ ట్రంప్' అనే నినాదంతో నిరసన తెలిపారు. అంతకు ముందు ఇదే అంశంపై పార్లమెంట్ కాంప్లెక్స్ వద్ద పలు ప్రతిపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఎస్‌పి నాయకుడు అఖిలేష్ యాదవ్ సహా ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు పార్లమెంట్ ఆవరణలో అమెరికా అధికారులు భారతీయుల పట్ల వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు చేతికి సంకెళ్లు ధరించి నిరసన తెలిపారు. 'మానవులు. ఖైదీలు కాదు' వంటి ప్లకార్డులు పట్టుకుని, భారతదేశానికి జరిగిన అవమానాన్ని తాము సహించబోమని ప్రతిపక్ష నాయకులు చెప్పారు, 'భారతీయులను అవమానించారు. భారత దేశం మౌనంగా ఉండదు' అనే నినాదాలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'భారతీయులమైన మేము భారతీయులకు జరిగన అవమానాన్ని సహించం. మోదీ ప్రభుత్వం భారతీయుల తరలింపుపై వివరణాత్మక ప్రకటన విడుదల చేయాలి. మన గడ్డపై సైనిక విమానం దిగడానికి బదులుగా గౌరవంగా భారతీయులను తిరిగి తీసుకురావడానికి మన సొంత విమానాలను ఎందుకు పంపలేదు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో పోస్ట్‌లో అన్నారు. తన కష్టాలను వివరిస్తున్న ఒక బాధితుడి వీడియోను పంచుకుంటూ 'ప్రధానమంత్రి, ఈ వ్యక్తి బాధను వినండి. భారతీయులు గౌరవం, మానవత్వానికి అర్హులు, చేతికి సంకెళ్లు కాదు' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో అన్నారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా విలేకరులతో మాట్లాడుతూ స్వదేశానికి తరలించిన భారతీయులకు ఎందుకు అలాంటి చికిత్స ఇచ్చారో ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని అన్నారు. ప్రధాని మోడీ (డొనాల్డ్ ట్రంప్ స్నేహం గురించి) చాలా చర్చించారని నేను చెబుతారు, వారందరినీ తిరిగి తీసుకురావడానికి మనం మన విమానాన్ని పంపలేమా? ప్రధాని సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు.

## పార్లమెంట్‌లో దుమారం
(మొదటి పేజీ తరువాయి)

జరుపుకుందామని స్పీకర్ బిర్లా విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాలు చాలా ముఖ్యమైనవని, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు సభ్యులను ఎన్నుకున్నారని, కానీ, మీరు ఆందోళనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి కీర్తి ఆజాద్ మొదటి ప్రశ్నను అడగగా, బిర్లా మాట్లాడుతూ, 'మీరు మీ సహచర పార్టీ సభ్యుడు తన సమస్యలను లేవనెత్తడానికి అనుమతించడం లేదు. క్రమ పద్ధతిలో సభను అంతరాయం కలిగిస్తున్నారు. ఇది మంచిది కాదు' అని స్పీకర్ పేర్కొన్నారు. అయితే స్పీకర్ విజ్ఞప్తిని ఏ మాత్రం లెక్క చేయకుండా సభ్యులు ఆందోళనను కొనసాగిస్తుండగా, తొలుత సభను బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. ఆ తరువాత సభ తిరిగి ప్రారంభమైన పరిస్థితిలో మార్పు లేకపోవడంతో రెండవసారి సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. ఆ తరువాత కూడా ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. సభ్యుల నినాదాల మధ్యే పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ జోక్యం చేసుకుని విదేశాంగ మంత్రి జయ శంకర్ మధ్యాహ్నం 3.30 తరువాత సభలో ప్రకటన చేస్తారని సమాచారమిచ్చారు. స్పీకర్ స్థానంలో ఉన్న దిలీప్ సైకియ సభను వాయిదా వేశారు. తిరిగి 3.30 గంటలకు సభ ప్రారంభం కాగానే విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికా నుంచి భారతీయల తరలింపు అంశంపై ప్రకటన చేశారు. ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులు తమ నిరసనను కొనసాగించడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. అయితే జైశంకర్ ప్రకటన చేస్తున్నప్పుడు కూడా, విపక్ష సభ్యులు ఈ విషయంపై నినాదాలు చేస్తూ నిలబడ్డారు. ఈ నినాదాల మధ్య, విదేశాంగ మంత్రి మాట్లాడుతూ, 'తిరిగి వస్తున్న అక్రమవలసదారుల పట్ల విమానంలో ఏ విధంగానూ దురుసుగా ప్రవర్తించకుండా చూసుకోవడానికి తాము అమెరికా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాము' అని అన్నారు. 'అదే సమయంలో, చట్టబద్ధమైన ప్రయాణికులకు వీసాలను సులభతరం చేయడానికి చర్యలు తీసుకుంటూనే అక్రమ వలస పరిశ్రమపై బలమైన అణిచివేతపై దృష్టి సారించాలన్నారు. అయితే తరలింపు ప్రక్రియ కొత్తది కాదని, గతంలో కూడా ఇలాగే జరిగిందని జైశంకర్ అన్నారు. అంతకు ముందు ఈ అంశంపై రాజ్యసభలో కూడా ఆయన ప్రకటన చేశారు.

**రాజ్యసభలోనూ అదే తీరు**

యుఎస్ నుంచి భారతీయుల తరలింపు అంశంపై రాజ్యసభలోనూ ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సభ పలుమార్లు వాయిదా పడింది. అయితే చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ స్పందిస్తూ మధ్యాహ్నం 2 గంటల తరువాత విదేశాంగమంత్రి జైశంకర్ సభలో ప్రకటన చేస్తారని చెప్పారు. సభ వాయిదా పడడానికి ముందు ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. కాగా, సభా కార్యక్రమాలను రద్దు చేసి భారతీయుల తరలింపు అంశంపై చర్చ జరపాలని కాంగ్రెస్, సిపిఐ,టిఎంసి, ఆప్, సిపిఐ(ఎం) 267 నిబంధన కింద వాయిదా తీర్మానాలు ఇవ్వగా, చైర్మన్ వాటిని తిరస్కరించారు. సిపిఐ సభ్యుడు పి. సందోశ్ కుమార్, టిఎంసి సభ్యుడు సాకెత్ గోఖలే, సిపిఐ(ఎం) ఎంపి వి. శివదాసన్, కాంగ్రెస్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, శక్తిసిన్హ గోహిల్, ప్రమోద్ తివారి, రేణుకా చౌదరి, అశోక్ సింగ్ ఉన్నారు.

## కుట్రలు సాగవు
(మొదటి పేజీ తరువాయి)

చట్టపరంగా ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసని, ఇప్పటికే ఆలస్యమైందని, ఇంకా సాగదీసి ఎస్‌సిలకు అన్యాయం జరగనివ్వబోనని చెప్పారు. శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తరువాతే కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందని, ఆ నివేదిక ప్రకారం ముందుకెళ్తామన్నారు. ఎస్‌సి వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో మంత్రి దామోదర రాజనర్సింహాను హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో గురువారం నాడు మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, ప్రజలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు సుమారు 9.8 శాతం రిజర్వేషన్లు సాధించాయని, గ్రూప్ వన్‌లో 0.77 శాతం, గ్రూప్ 2లో 9 శాతం తమకే వచ్చిందని తెలిపారు. వర్గీకరణ జరగడం ఇష్టంలేని వ్యక్తులు, వర్గీకరణ పేరిట మనుగడ సాగించాలనుకునే వ్యక్తులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారని,వ్యక్తిగత విమర్శలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని పరోక్షంగా మందకృష్ణ మాదిగ విమర్శలపై స్పందించారు. అన్నదమ్ముల్లా ఉండాల్సిన మాల, మాదిగల నడుమ వివాదాలు, న్యాయపరమైన చిక్కులు సృష్టించి వర్గీకరణను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. మాదిగలు ఇంకా డప్పులు కొట్టే దగ్గరనే ఆగిపోవద్దని, కంప్యూటర్లు పట్టి కోడింగ్ కొట్టాలని, అమెరికా పోవాలని, ఆఫీసర్లు కావాలని, వ్యాపారాలు చేయాలని, ఆత్మగౌరవంతో బతకాలని దామోదర రాజనర్సింహా అన్నారు. మాదిగల సమిష్టి కృషి, సమాజంలో అందరికీ సమాన హక్కులు కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, సిఎం రేవంత్ రెడ్డి నిబద్ధత కారణంగానే వర్గీకరణ సాధ్యమవుతోందన్నారు. వర్గీకరణ కేసు సుప్రీంకోర్టులో 14 ఏళ్ళు పెండింగ్‌లో ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని ఎన్నికలకు ముందే చెప్పామని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే స్వయంగా చేవెళ్ల డిక్లరేషన్‌లో వర్గీకరణపై ప్రకటన చేశారని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చిన వెంటనే సుప్రీంకోర్టులో పేరుగాంచిన న్యాయవాదులను ప్రభుత్వం తరపున నియమించి, వర్గీకరణకు అనుకూలంగా వాదింపజేశామని, సిఎం సూచనల మేరకు మాదిగ నాయకులు, మేధావుల బృందాన్ని తీసుకుని తానే పలుమార్లు ఢిల్లీకి వెళ్లి, విచారణ జరుగుతున్న తీరును పర్యవేక్షించానని దామోదర రాజనర్సింహా వివరించారు. దశాబ్ద కాలానికిపైగా పెండింగ్‌లో ఉన్న కేసులో 6 నెలల్లో తీర్పు వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. తీర్పు వచ్చిన గంటలోపలే వర్గీకరణకు అనుకూలంగా ముఖ్యమంత్రి తో అసెంబ్లీలో ప్రకటన చేయించామని, కోర్టు తీర్పు ప్రకారం వర్గీకరణ చేసేందుకు కేబినేట్ సబ్ కమిటీని నియమించి, వర్గీకరణపై చర్చించి చట్టపరమైన సమస్యలు రాకుండా, వన్ మెంబర్ కమిషన్ నియమించి ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. సుమారు 8 వేలకుపైగా వినతులను పరిశీలించి, క్రోడీకరించి కమిషన్ తన నివేదిక తయారు చేసిందని, ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకుండా, కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన రోజే కేబినేట్ సబ్ కమిటీ ఆమోదించేలా చర్యలు తీసుకున్నామని, ఆలస్యం కావొద్దు, ఇంకా అన్యాయం జరగొద్దు అని మరునాడే కేబినేట్‌లో కమిషన్ రిపోర్ట్‌ను ఆమోదింపజేసుకున్నామన్నారు. క్రీమీలేయర్ పెట్టాలన్న కమిషన్ సిఫార్సును తిరస్కరించామని గుర్తు చేశారు. జనాభా, డాటా ఆధారంగా మూడు గ్రూపులుగా మొత్తం 59 కులాలను కమిషన్ వర్గీకరించిందని, కమిషన్ సిఫార్సులకు మరునాడే కేబినేట్ ఆమోదం తీసుకుని, అదేనాడు అసెంబ్లీలో సీఎం గారితో తీర్మానం చేయించుకున్నామని తెలిపారు.



## ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

హిందుత్వ ఎజెండాతో ప్రజలను రెచ్చగొడుతున్న మోదీ

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రూ.1.94లక్షల కోట్ల అప్పులతో దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కొనసాగుతుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం పూర్తిగా కార్పొరేట్ కంపెనీల కనుసన్నల్లో నడుస్తుందని, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుండడంతో దేశంలో దారిద్ర్య రేఖకు దిగువ ప్రజలు నిరంతరం పెరుగుతున్నారని అన్నారు. ప్రధాని మోదీ హిందుత్వ ఎజెండాతో ప్రజల మధ్య రెచ్చగొట్టే విధానాల వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చైతన్యంతో కదిలి రావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. బిసి జనాభా జన గణన విడుదల చేసిన ప్రజల్లో నెలకొన్న సందేహాలు అపోహలను దూరం చేయాలన్నారు. ఇటీవల కొత్తకొండ దేవాస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా తల్లి మరణించగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెనోటీసిచ్చినా స్పందన ఏదీ!

ఆర్టీసీ యాజమాన్యం చర్యలు శూన్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన కార్మికుల న్యాయమైన హామీలను అమలు చేయాలని డిమాండ్‌తో ఇచ్చిన సమ్మె నోటీసుకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమని టిజిఎస్ ఆర్టీసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి అన్నారు. మహాత్మగాంధీ బస్ స్టేషన్‌లో గురువారం సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి మాట్లాడుతూ గతనెల 27న సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. ఇప్పటివరకు యాజమాన్యం నుండి ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. లేబర్ కమిషనర్ కూడా ఈ సమ్మెపై వెంటనే స్పందించి, కార్మిక సంఘాలను ఆహ్వానించి, యాజమాన్యంతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాల్సి పోయింది, 10 రోజులు దాటినా చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం గత సంఘాలను నియంత్రిత విధానాలే అమలు చేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ప్రజాపాలన పేరుతో పెట్టారని అనుమానం కలుగుతుందన్నారు.

**సమ్మె నివారణకు ప్రభుత్వం, యజమాన్యం చర్యలు తీసుకోవాలి..**

భారత రాజ్యాంగంలో కల్పించిన సమ్మెకు హక్కు ప్రకారమే ముందుగా ప్రభుత్వ హామీలు అమలు చేయాలన్నారు. ఆర్టిసి ఉనికికే పెనుప్రమాదకరంగా మారిన ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టిసికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కొనుగోలు చేసి, ఆర్టిసికి ఇవ్వాలని, దీర్ఘ కాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం స్వార్థంతో ఇచ్చిన నోటీసు కాదని ప్రభుత్వం, యాజమాన్యం అర్థం చేసుకొని సమ్మె నోటీసులో పొందుపరిచిన అంశాలను చర్చల ద్వారా పరిష్కరించి, సమ్మె నివారణకు ప్రయత్నం చేయాలని ప్రభుత్వం, యాజమాన్యాలకు ఈదురు వెంకన్న, థామస్ రెడ్డి సూచించారు.

**సమ్మె విజయవంతానికి జిల్లాల్లో పర్యటిస్తాం..**

టిజిఎస్ ఆర్టిసి జెఎసి నాయకత్వం మూడు బృందాలుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోని డిపోలలో పర్యటిస్తుందని ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి చెప్పారు. సమ్మె కరపత్రాలు ఇస్తూ కార్మిక వర్గాన్ని చైతన్యపరిచి, సమ్మెకు సన్నద్ధం చేస్తామన్నారు. అన్ని జాతీయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమకారులతో రౌండ్ టేబుల్ సమావేశాలు రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల స్థాయిలో ఏర్పాటు చేసి, ప్రజా మద్దతును కూడగడతామని చెప్పారు.

**సమస్యలు పరిష్కరించి, కార్మికుల ముందుకు రండి ఎం.డికి జెఏసి సూచన..**

యాజమాన్యం డిపోలలో ప్రతిరోజు గేటు మీటింగ్‌ల ద్వారా కార్మికులకు కట్టుకథలు చెప్పుతూ, వారిని బయపెట్టే ప్రయత్నాలను యాజమాన్యం మానుకోవాలన్నారు. వైస్ చైర్మన్, ఎం.డి. శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహణ ద్వారా కార్మికులను సమ్మెకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా తమకు సమాచారం అందిందని, ఒకటే తాము ఎండికి విన్నవించుకుంటున్నామని, సమ్మె నోటీసులో పేర్కొన్న డిమాండ్లను న్యాయబద్ధమైనవేనని భావిస్తే వాటిని ముందుగా పరిష్కరించిన తర్వాత కార్మికుల ముందుకు వస్తే బాగుంటుందన్నారు.

**నివురుగప్పిన నిప్పులా కార్మికులు..**

అధికారుల నిత్య వేధింపుల వల్లే కార్మికులంతా నివురు గప్పిన నిప్పులా ఉన్నారని విషయం తెలుసుకోవాలన్నారు. గతంలో యాజమాన్యం చేపట్టిన కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టినట్లుగానే ఇప్పుడు కూడా తిప్పి కొట్టడానికి కార్మిక వర్గం మొత్తం సిద్ధంగా ఉందన్నారు. టిజిఎంయు యూనియన్ సమ్మె నోటీస్ ఇస్తున్నందుకు వారికి జెఎసి పక్షాన అభినందలు తెలుపుతున్నామన్నారు. మిగిలిన సంఘాలు కూడా సమ్మె నోటీస్ ఇచ్చి కార్మిక ఐక్యతను చాటుతారని ఆశిస్తున్నామన్నారు. జెఎసి కోశాధికారి బి.యాదయ్య, శ్రీనివాస్, జి.రాములు, బయ్యన్న, జిపిఆర్ రెడ్డి, ఆర్.ఎన్. రెడ్డి, ముత్యాలు, సునీత, మానస, రవీందర్, సాయిలు, కిరణ్, భిక్షపతి, సురేష్ పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్

ప్రజాపక్షం / హైదరాబాద్

ఎంఎల్‌సి చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ నోటీసులు జారీ చేసింది. ఇటీవల పార్టీ వ్యతిరేక విధానాలు, నాయకత్వంపై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి గురువారం నోటీసులు జారీ చేశారు. తీన్మార్ మల్లన్న ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ పార్టీపైన, ప్రభుత్వ నిర్వహించిన కులగణన సర్వేపై విమర్శలు చేశారు. దీంతో పాటు కాంగ్రెస్ బిసి ఎమ్మెల్యేలపై కూడా పలు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో మల్లన్న చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 12వ తేదీలోగా సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ శారు. మల్లన్నకు అధికారికంగా నోటీసులు జారీ చేయకముందే కాంగ్రెస్ పార్టీ నోటీసుల గురించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

బిసి కులగణ, ఎస్‌సి వర్గీకరణపై అసెంబ్లీ ఆమోదాన్ని స్వాగతిస్తున్నాం : జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బరిలో నిలిచేందుకు సిద్ధంకావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక మగ్దూమ్‌భవనంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో పల్లా వెంకటరెడ్డి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానలలో పోటీచేసి ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ సర్వే బిసి కులగణనతోపాటు 30ఏండ్ల సుదీర్ఘపోరాటమైన ఎస్‌సి వర్గీకరణను ఆమోదిస్తూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన ఆమోదాన్ని స్వాగతిస్తున్నామని, అట్టి ఆమోదాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో చట్టం చేసి ఈవర్గాలకు నాయ్యం చేయాలన్నారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీరు అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఏ ఒక్క అంశాన్ని కూడా నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజలకు ఎంత మాత్రం ప్రయోజనం జరగలేదన్నారు. పార్లమెంట్‌లో పదేండ్ల కాలంలో సాధించిన పురోగతి గురించి చెప్పిందే గాని దాని ద్వారా ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం జరిగిందో చెప్పలేదన్నారు. క్రమంగా వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరగడం, పండించిన పంటలకు మద్దతు ధరలు రాకపోవడంతో తీవ్ర సంక్షోభంలోకి మెట్టబడిన తప్ప కనీసం మద్దతు ధర కల్పించలేకపోయిందన్నారు. జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే ప్రక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. సమావేశానికి జిల్లా కార్యవర్గసభ్యులు టి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకరావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జని యాదగిరిరావు, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్.అంజయ్యచారి, బొల్గూరి నరసింహ, బంటు వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య తదితరులు ఉన్నారు.






## జీవిత చిత్రీకరణ ఉన్నదే అసలైన సాహిత్యం

పుస్తకాల ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** వాస్తవ జీవిత చిత్రీకరణ ఉన్నదే అసలైన సాహిత్యమని,అది ప్రజలను ఆలోచింపచేసి మార్పును వేగవంతం చేయగలదని మంగళవారం రాత్రి గోదావరి ఖని ప్రెస్ క్లబ్‌లో అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ అధ్యక్షతన జరిగిన బుద్ధుడి నుండి గద్దర్ వరకు,అస్పృశ్య యోధుడు పుస్తకావిష్కరణల సభలో పలువురు వక్తలు అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం, బివివి ట్రస్టు సంయుక్త ఆధవర్యంలో జరిగిన ఈ సభలో ప్రముఖ రచయిత కాలువ మల్లయ్య, బిక్షమయ్య, అస్పృశ్యత జీవితంపై రాసిన అస్పృశ్య యోధుడు పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఆవిష్కరించగా,బొజ్జ బిక్షమయ్య లాల్ నీల్ ఐక్యతను కోరుతూ తన టీవీ ఇంటర్వ్యూల ద్వారా పులవురితో చేసిన అంశాలతో ప్రచురించిన బుద్ధుడు నుండి గద్దర్ వరకు అనే పుస్తకాన్ని రాష్ట్ర కనీస వేతన కమిటి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆవిష్కరించగా మొదటి పుస్తకాన్ని జర్నలిస్టు ఎం.రాంమూర్తి, రెండవ పుస్తకాన్ని అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి సమీక్షించారు. ఈ సమావేశంలో రచయితలతో పాటు అరసం రాష్ట్ర కార్యదర్శి ఏలేశ్వరం వెంకటేశ్,ప్రజానాట్యమండలి నాయకులు కె.స్వామి,బివివి నిర్వాహకులు వై.యాకయ్య,బొజ్జ రవికుమార్ లు,మిరయాల రాజిరెడ్డి,మాదన కుమారస్వామి,ఐ కృష్ణ,జగదీశ్, సంకె రవి తదితరులు మాట్లాడారు. అస్పృశ్యతపై కె.స్వామి,కాసర్ల మల్లేశ్‌లు పాడిన పాటలు అందరిని ఆలోచింప చేశాయి.



## తాగు నీటిని అందించేందుకు.. కట్టుదిట్టమైన చర్యలు

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజక వర్గం బండ్లగూడ జాగిర్‌లో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని, తాగునీటి శుద్ధి కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు హిమాయత్ సాగర్ జలాశయం నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 6 కోట్ల వ్యయంతో 35 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి పారిశుద్ధ్య ప్లాంటును వినియోగంలోకి తెచ్చినట్లు మంత్రి వివరించారు. కాలనీలో కనీస సౌకర్యాల కల్పన కోసం 215 కోట్లు కేటాయించి సిసి రోడ్లు, బిటి రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు,వీధి దీపాలు సమకూర్చుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒఆర్ఆర్ అవతల పరిసరాల గ్రామాల్లో 780 కోట్లతో నీటి ఎద్దడి నివారణ కొరకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 7 టిఎంసిల గోదావరి నీటిని హైదరాబాద్ నగరానికి తెచ్చేందుకు కావలసిన టెండర్ల ప్రక్రియను పూర్తిచేసినట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేదలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. ప్రస్తుతం 9.50 లక్షల వ్యయంతో అన్ని హంగులు కలిగిన నూతన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ భవన సముదాయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, మాజీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొట్లపహాడ్‌కు తరలి వచ్చిన రైతు కమిషన్

‘ప్రజాపక్షం’ కథనాలకు స్పందన

పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించిన సభ్యులు

తమ గోడును రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ముందు ఏకరువు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి :** అమాయక రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి నట్టేట ముంచిన గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలోని విత్తన కంపెనీల యజమానులపై ప్రజాపక్షం గత నాలుగు రోజులుగా రాస్తున్న వరుస కథనాలకు రాష్ట్ర రైతు కమిషన్ స్పందించింది. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మణికంఠ భవానీ రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, మేక సునీల్‌లు విత్తన కంపెనీల యజమానుల మోసాలకు నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించేందుకు గురువారం హైదరాబాద్ నుండి పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన బాధిత రైతుల వద్దకు తరలి వచ్చారు. కమిషన్ సభ్యులకు బాధిత రైతులు బోరున విలపిస్తూ తమ గోడును వినిపించుకున్నారు. 90రోజులకు ఈనాల్సిన వరి పైరు నాటు వేసిన 15రోజులకే ఈనడాన్ని వారికి చూపించారు. నకిలీ విత్తనాలు కట్టబెట్టి తమను నష్టపరిచిన గడ్డిపల్లిలోని చరణ్, ఎంఎస్ వెంకటసాయి విత్తన కంపెనీల యజమానులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కమిషన్‌ను వేడుకున్నారు. తమకు ఎకరానికి రూ.20వేల నష్టం జరిగిందని చెప్పారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులకు విన్నవించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. విత్తన కంపెనీల ఎదుట ఆందోళన చేసినా ఫలితం లేదని కంటతడి పెట్టారు. గత కొన్నేళ్లుగా గడ్డిపల్లి గ్రామంలోని విత్తన కంపెనీల యజమానులందరూ సిండికేట్‌గా మారి బ్రీజర్ సీడ్స్ కాకుండా, రైతుల నుండి నేరుగా కొనుగోలు చేసి తాలు, పెల్లను తొలగించి తమకు నాణ్యమైన విత్తనాలంటూ కట్టబెట్టి కోట్లు గడిస్తున్నారంటూ వాపోయారు. గత పాలకులు ఈ విత్తన కంపెనీల యజమానులకు అండగా నిలవడంతో తాము ఏమీ చేయలేక నష్టపోయామని చెప్పారు. ఇదిలా ఉండగా పెన్‌పహాడ్ మండలంలోని న్యూబంజారాహిల్స్ తండాకు చెందిన ధరావత్ అంజినాయక్, మాచారం గ్రామానికి చెందిన బొల్క చౌదయ్య, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్య ఆగ్రో కంపెనీలో విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేయగా నష్టపోయామని తెలిపారు. తిప్పర్తి మండలానికి చెందిన శ్రీనివాస్ తాను గడ్డిపల్లిలోని చరణ్ సిడ్స్‌లో విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయినట్లు కొనుగోలు చేసిన బిల్లులను కమిటీ సభ్యులకు చూపించారు.

**సీడ్స్ కంపెనీ యజమానులపై చర్యలు తీసుకుంటాం : రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**

రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి నష్టపరిచిన గడ్డిపల్లి గ్రామంలోని చరణ్, ఎంఎస్ వెంకటసాయి సీడ్స్ కంపెనీల యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రైతు పంట పొలాలను పరిశీలించి రైతుల పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసమే రైతు కమిషన్ ఏర్పడిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా రైతు బిడ్డ అని రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని చెప్పారు. రైతుల ఆరోపణలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా పట్టించుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాలో రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతున్నారని తమ దృష్టికి పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, మోసం చేసిన సీడ్స్ కంపెనీల యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, పెన్‌పహాడ్ తహసీల్దార్ లాలు నాయక్, ఎఒ అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సచివాలయంలో మరోసారి.. భద్రతా లోపం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సచివాలయంలో నకిలీ ఉద్యోగుల భాగోతం మరొకటి బయటపడింది. ఫేక్ ఐడెంటిటీ కార్డులతో సచివాలయంలోకి చొరబడుతున్న నకిలీ ఉద్యోగులు ఉద్యోగాల పేరుతో పలువురిని మోసగిస్తున్నారు. సచివాలయ భద్రతా సిబ్బంది రోజుకో నకిలీ ఉద్యోగిని పట్టుకుంటున్నా పుట్టగొడుగుల్లా వీళ్లు పుట్టుకొస్తుండడం గమనార్హం. తాజాగా గురువారం మరో ఫేక్ ఉద్యోగిని సెక్రటేరియట్ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఏకంగా తహసీల్దార్ పేరిట సచివాలయంలోకి వచ్చిన కొంపల్లి అంజయ్య అనే వ్యక్తి , తహసీల్దార్ అనే స్టిక్కర్ వాహనంలో గత కొద్దిరోజులుగా సచివాలయంలోకి వస్తు, వెళ్తున్నాడు. అక్కడి సెక్యూరిటీ సిబ్బందికి అనుమానం రావడంతో అంజయ్యను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. పోలీసులు అతనివద్ద నుంచి ఫేక్ ఐడి స్వాధీనం చేసుకున్నారు. ఒక జిరాక్స్ సెంటర్‌లో ఫేక్ ఐడి కార్డ్ తయారు చేయించినట్లు పోలీస్ విచారణలో వెల్లడైంది. ఫేక్ ఉద్యోగి దందాలపై విచారణ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు.

## బిసి కులగణన సర్వే చరిత్రాత్మకం

కాంగ్రెస్ హైకమాండ్‌కు మంత్రి కొండా సురేఖ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిన బిసి కులగణన సర్వే చారిత్రాత్మకం అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఒక బిసిగా తాను ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆమె గురువారం కాంగ్రెస్ హైకమాండుకు లేఖలు రాశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఎల్ఒపి రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కెసి వేణుగోపాల్, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీలకు వేర్వేరుగా లేఖలు రాశారు. సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రాష్ట్రంలో బిసి కులగణన కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకి కులాల లెక్కకు ఒక రూపం దొరికిందని అభిప్రాయపడ్డారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
చందానగర్ సర్కిల్-21 ఎస్ఎల్‌పి జోన్
NIT No. 27/EE/GHMC/DIV-21/2024-25 టెండర్ నోటీస్ (‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా) తేదీ: 05.02.2025
నెం. 27/EE/GHMC/DIV-21/2024-25 (ఐటెమ్ నం. 01 నుండి 04 వరకు) తేదీ: 05.02.2025 ప్రకారం (04) పనులకు ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించడమైనది. **అంచనా వ్యయం:** రూ.4.51 లక్షలు. తేది: 06.02.2025 సాయంత్రం 4.00 గంటల నుండి ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల అమ్మకం తెరిచి ఉంటుంది. బిడ్లు సమర్పించడానికి చివరి తేదీ : 10.02.2025 సాయంత్రం 4.00 గంటలు. బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి
DIPR R.O. No. : 10029-PP/CL/ADVT/1/2024-25, Date: 06-02-2025

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

G2/1724/2024
Gaz. No.79/2024 Dt: 19.12.2024

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

ఫారం. 6, ప్రాథమిక ప్రకటన

నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూరు గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన ఎ. **3.28 గుంటలు** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ - 82 మేజర్ 34 టేల్ చివర నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టరు, నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 3.28 గు॥** భూమి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ - 82 మేజర్ 34 నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: చెర్కురు మండలం: వెల్దండ జిల్లా: నాగర్ కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | భూవర్గీకరణ మెట్ట/తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం ఎ.సెంట్లు/గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 455 | పట్టా | మెట్ట | 1.07 | కె. తిరుపతయ్య తండ్రి ఎల్లయ్య(1.03) అంజయ్య తండ్రి లాలయ్య (0.04) కొడేల తిరుపతమ్మ భర్త తిరుపతయ్య రెపని తిరుపతయ్య తండ్రి లాలయ్య రెపని పొందు తండ్రి చిన్న జంగయ్య రెపని యాదయ్య తండ్రి బొజ్జయ్య దాసర్ల లక్ష్మి భర్త రాములు రెపని రాములు తండ్రి చిన్న జంగయ్య | 454 | 456 | 435 | 473 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 473 | లావణి పట్టా | మెట్ట | 0.02 | చిన్న లాలయ్య తండ్రి బొజ్జయ్య (0.02) గౌడుగు శింగోటం తండ్రి వెంకటయ్య జి. రాములు తండ్రి వెంకటయ్య యం. శోభ భర్త కిషన్ యం. హరిబాయి భర్త యాదోజి మల్లెకేడి పున్నోజి తండ్రి సర్వోజి శిరమోని లక్ష్మయ్య తండ్రి రామయ్య రెపని పెద్దమ్మ భర్త కొండయ్య రెపని మల్లమ్మ భర్త లాలయ్య కె. వెంకటమ్మ భర్త యదయ్య రెపని పెద్ద వెంకటేష్ తండ్రి దాసయ్య కె. సత్తయ్య తండ్రి బాలయ్య ఆర్. జమిలి భర్త రాములు ఆర్. రాంజా తండ్రి చంద్రియా ఆర్. అంజయ్య తండ్రి నారాయ్య ఆర్. దేవుడు తండ్రి చంద్రియా కె. అయ్యన్న తండ్రి వెంకటరాములు జె. జంగయ్య తండ్రి పెద్దయ్య జక్కుల దాసు తండ్రి పెద్దయ్య ఎల్. రాంచంద్రయ్య తండ్రి జంగయ్య సామ నర్సింహ్మా తండ్రి చిన్న బాలయ్య సామ కిష్టమ్మ భర్త పెద్ద బాలయ్య సోమ బాల్ రాం తండ్రి పెద్ద బాలయ్య సామ లక్ష్మమ్మ భర్త కిష్టయ్య కె. అబ్రహాం ఎస్తేరమ్మ భర్త అబ్రహామ్ పి. రాములమ్మ భర్త చిన్న లక్ష్మయ్య పి. లింగమయ్య తండ్రి లక్ష్మయ్య పి. జంగయ్య తండ్రి లక్ష్మయ్య పి. యాదయ్య తండ్రి పెద్ద లక్ష్మయ్య జి. రాములమ్మ భర్త ముత్యాలు పి. శంకర్ తండ్రి తుల్చ్య ఆర్. కేళి భర్త ఆర్.మోత్య | 453 | 472 | 455 | 487 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 456 | పట్టా | మెట్ట | 1.16 | కె. నర్సింహ్మా తండ్రి వెంకటయ్య (0.14) కె. తిరుపయ్య తండ్రి ఎల్లయ్య (0.19) బర్లు రాములు తండ్రి పోషయ్య(0.05) వసంత భర్త నర్సింహ్మా (0.18) కోడేల శ్రీశైలం తండ్రి కోడేల తిరుపతయ్య సాటు పవన్ తండ్రి సాటు రాములు కోడేల మహేష్ తండ్రి కోడేల తిరుపతయ్య | 455 | 470 | 435 | 470 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 470 | పట్టా | మెట్ట | 0.01 | కె. నర్సింహ్మా తండ్రి వెంకటయ్య (0.01) కె. శ్రీశైలం తండ్రి నర్సింహ్మా కె. అంజయ్య తండ్రి చిన్న నర్సింహ్మా వి. వెంకటమ్మ భర్త కొమురయ్య వి. నర్సింహ్మా తండ్రి కొమురయ్య | 454 | 473 | 456 | 473 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 457 | పట్టా | మెట్ట | 1.02 | వెంకటయ్య తండ్రి పెద్దయ్య (0.18) వసంత భర్త నర్సింహ్మా (0.13) అంజయ్య తండ్రి నర్సింహ్మా (0.10) రామకృష్ణ తండ్రి తిరుపతయ్య (0.01) కె. నర్సింహ్మా తండ్రి వెంకటయ్య కె. శ్రీశైలం తండ్రి నర్సింహ్మా కె. అంజయ్య తండ్రి చిన్న నర్సింహ్మా కోడెల వెంకటయ్య తండ్రి జంగయ్య కోడెల యాదమ్మ భర్త తిరుపతయ్య కె. వసంత భర్త నడిపి నర్సింహ్మా కోడెల ఎల్లయ్య తండ్రి లచ్చయ్య | 455 | 452 | 435 | 469 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | మొత్తం: 3.28 | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వ నైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్
DIPR RO NO. 652/LA/PP/Advt/Pub/2024-25

ప్రజాపక్షం
శుక్రవారం, ఫిబ్రవరి 07

## గాజాపై ట్రంప్ సామ్రాజ్యకాంక్ష

రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావటంతో ప్రపంచాధిపత్యం సాధించినట్లుగా రోజుకో బాధ్యతారహిత ప్రకటనతో ప్రపంచ దేశాలకు దడపుట్టిస్తున్న డోనాల్డ్ ట్రంప్ గాజాను స్వాధీనం చేసుకొని సొంతం చేసుకుంటామని గురువారంనాడు పత్రికా గోష్ఠిలో చేసిన ఆకస్మిక ప్రకటన పశ్చిమాసియా దేశాలనుండేగాక తమ యూరప్ మిత్ర రాజ్యాల నుంచీ ఖండనకు గురైంది. ఇజ్రాయెల్-పాలస్తీనా రెండు రాజ్యాల స్థాపన ఒప్పందంతో ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలన్న అమెరికా దీర్ఘకాల విధానానికి కూడా ట్రంప్ ప్రకటన విరుద్ధం. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమిన్ నెతన్యాహుతో కలిసి పత్రికా గోష్ఠిలో పాల్గొన్న ట్రంప్ అందరినీ ఆశ్చర్యపరుస్తూ గాజా స్వాధీన ఆలోచన ప్రకటించారు. ఆయనలోని రియల్ ఎస్టేట్ వ్యాపారి బయటకు వచ్చారు. తన ఆదేశం మీదనే హమాస్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని స్వోత్కర్షకు పోతున్న ట్రంప్ అసలు వ్యాపార ఉద్దేశం ఇప్పుడు బయటపడింది. నెతన్యాహుతో ముందుగానే ఇటువంటి లోపాయికారి అవగాహన ఉండి ఉంటుంది, అందువల్లనే అతడు హమాస్‌తో ఒప్పందానికి అంగీకరించాడని ఇప్పుడు సందేహించాల్సి వస్తోంది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతల్లోకి వచ్చాక ఆయనను కలుసుకునే అవకాశం లభించిన విదేశీనేత నెతన్యాహు.

ఇజ్రాయెల్‌తో స్నేహం పెరిగినప్పటికీ రెండు రాజ్యాల వాదాన్ని మోదీ ప్రభుత్వం బలపరుస్తున్నది. అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రభావవంతమైన స్థానాన్ని కోరుకుంటున్న మోదీ ప్రభుత్వం ట్రంప్ దుర్మార్గపు ప్రకటనపై స్పందించాలి.

అతని సమక్షంలో ట్రంప్ ఈ ప్రకటన చేశారంటే వారి చర్చల్లో ఈ అంశంపై ఏకీభావం కుదిరిఉంటుంది. ఎందుకంటే ట్రంప్ ఆదినుంచీ యూదుల పక్షపాతి; ఆయన తొలి అధ్యక్ష పదవీ కాలంలో పాలస్తీనియన్లు – ఇజ్రాయెలీల మధ్య వివాదాస్పదమైన జెరూసలెంలో అమెరికా రాయబార కార్యాలయం ఏర్పాటుచేసి తానేమిటో చెప్పకనే చెప్పాడు.

ట్రంప్ కొద్దిరోజుల క్రితం యుద్ధంలో చాలా మేరకు ధ్వంసమైన గాజా ప్రాంత ప్రజలపట్ల ఒక సానుభూతి ప్రకటన చేశారు. 'ధ్వంసమైన గాజా ప్రాంతాలు జనావాసానికి అనువుగా లేవు. అందువల్ల పాలస్తీనియన్లు తమ నివాస ప్రాంతాలకు వచ్చే ప్రయత్నం మానుకోవాలి. దాదాపు 20లక్షలమంది పాలస్తీనియులకు ఈజిప్టు, జోర్డాన్లు స్థిరనివాసం కల్పించాలి' అన్నారు. యుద్ధ విధ్వంస ప్రాంతంలో భవనాల పునర్నిర్మాణం, మందుగుండు నుంచి శుద్ధి, వసతుల పునరుద్ధరణ చేసి పాలస్తీనియన్లకు తిరిగి అప్పగించటం ఆ ప్రకటన ఉద్దేశంగా కనిపించినప్పటికీ, తమను స్వస్థలాలనుంచి శాశ్వతంగా వెళ్లగొట్టే అమెరికా, ఇజ్రాయెల్ కుట్రను పసిగట్టిన పాలస్తీనియన్లు, ఈజిప్టు, జోర్డాన్ తదితర అరబ్ దేశాల నేతలు ట్రంప్ ప్రకటనను ఖండించారు. రెండ్రోజులు తిరగకుండానే ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి తమ మనసులో మాట బయటపెట్టారు. మరుభూమిగా మారిన ప్రాంతాన్ని స్వాధీనం చేసి నదీతీర సుందర భవనాలతో ప్రపంచ పర్యాటక విహార యాత్రా స్థలంగా తయారు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. అందులో ఎవరుంటారని ప్రశ్నించగా 'ప్రపంచ ప్రజలు' అని సమాధానమిచ్చారు. ప్రపంచ కుబేరులని మనం అర్థం చేసుకోవాలి. 'ఆ భూ ఖండాన్ని సొంతం చేసుకుంటాం – అభివృద్ధి చేస్తాం – వేలకొలది ఉపాధులు కల్పించబడతాయి. యావత్ మధ్య ప్రాచ్యం గర్వపడేలా నిర్మాణాలు చేస్తాం' అన్నారు. ట్రంప్ ఆలోచనను ఇజ్రాయెల్ ప్రధాని హర్షించారు. అటు వెస్ట్‌బ్యాంక్, ఇటు గాజా నుంచి – అనగా పాలస్తీనియన్లను తమ మాతృగడ్డనుంచి పారద్రోలే పథకానికి ట్రంప్ ఎంత సుందరమైన కథ అల్లారు!

మధ్యప్రాచ్యంలో అమెరికా మద్దతుదారైన సౌదీ అరేబియా ట్రంప్ ఆలోచనను ఖండిస్తూ, 'స్వతంత్ర పాలస్తీనా రాజ్యంపట్ల మా వైఖరి దృఢమైనది, తిరుగులేనిది, ఊగిసలాటకు తావులేనిది'ని ప్రకటించింది. ఈజిప్టు, జోర్డాన్‌లతోపాటు టర్కీ, పాలస్తీనా అథారిటీ, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, జర్మనీ, రష్యా ప్రతినిధులు ట్రంప్ ఆలోచన అంతర్జాతీయ చట్టానికి తీవ్రమైన ఉల్లంఘనగా వ్యాఖ్యానించారు. రెండు రాజ్యాల పరిష్కారాన్ని పునరుద్ఘాటించారు. భారత్ ఆదినుండీ పాలస్తీనీయుల మాతృదేశ కోర్కెను సమర్థిస్తున్నది. ఇజ్రాయెల్‌తో స్నేహం పెరిగినప్పటికీ రెండు రాజ్యాల వాదాన్ని మోదీ ప్రభుత్వం బలపరుస్తున్నది. అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రభావవంతమైన స్థానాన్ని కోరుకుంటున్న మోదీ ప్రభుత్వం ట్రంప్ దుర్మార్గపు ప్రకటనపై స్పందించాలి.

# కెసిఆర్ పై 'బహుజన' గ్రెనేడ్ విసిరిన రేవంత్!



ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

కెసిఆర్ పై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బహుజన' గ్రెనేడ్‌ను వ్యూహాత్మకంగానే విసిరారు. బిసిల కులగణన, ఎస్‌సి వర్గీకరణపై రేవంత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బిఆర్ఎస్ ను పూర్తిగా ఆత్మరక్షణలో పడదోసిన ఘటన. ఇందులో నుంచి ఎలా బయట పడాలో తెలియక డొంక తిరుగుడు మాటలు మాట్లాడుతూ తప్పించుకునే ప్రయత్నంలో కెసిఆర్ పార్టీ తలమునకలై ఉన్నది. 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే 2024 నివేదిక' ను ఫిబ్రవరి 4న అసెంబ్లీలో ప్రవేశపెట్టడం చారిత్రాత్మక సందర్భం. ''కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసిలకు సీట్లు ఇవ్వనున్నది. బిజెపి, బిఆర్ఎస్ సిద్ధమా''? అని ముఖ్యమంత్రి చేసిన చాలెంజ్ కు ప్రతిపక్షాల నుంచి సూటిగా జవాబు లేదు.

'సామాజిక న్యాయం', 'రాజకీయాధికారంలో జనాభా ప్రాతిపదికన వాటా' వంటి మాటలు తెలంగాణలో చాలాకాలం తర్వాత వినబడుతున్నవి. 2009లో ప్రజా రాజ్యం పార్టీ స్థాపించిన మెగా స్టార్ చిరంజీవి ఆ పార్టీని రద్దు చేసుకోవటంతోనే 'సామాజిక న్యాయం' అనే మాట దాదాపు అంతరించిపోయింది. మళ్ళీ దాదాపు 16 సంవత్సరాల తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 'సామాజిక న్యాయం' నినాదం పురుడు పోసుకుంది. అయితే దీని అమలులో తలెత్తే అవరోధాలు, ఎదురయ్యే సవాళ్లు, పర్యవసానాలు వంటి ఇతర అంశాలు రాజకీయ ఎజండా పైకి తీసుకు రావడం రేవంత్‌తోనే సాధ్యమయినట్టు రాజకీయ పరిశీలకులంటున్నారు. కెసిఆర్ హయాంలో సామాజిక న్యాయం, బహుజనులకు రాజకీయ అధికారంలో వాటా వంటి మాటలు చెల్లని నాణేలు. అంతా 'కెసిఆర్ న్యాయమే'! దళితులు, వెనుకబడిన తరగతులకూ విచ్చలవిడిగా సంక్షేమ కార్యక్రమాలు పంపిణీ చేసి వారందరినీ తన 'చెప్పుచేతల్లో'ఉంచుకునే పని చేశారు.

''బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే డాక్యుమెంట్ ను ఎందుకు కేబినెట్ లో పెట్టలేదు? ఎందుకు అసెంబ్లీలో పెట్టలేదు?ఎందుకు నివేదికను కెసిఆర్ కుటుంబం గుప్పిట్లో పెట్టుకుంది''? అని ఆ పార్టీకి చెమటలు పట్టించడంలో రేవంత్ వ్యూహమూ ఫలించింది. కెసిఆర్ హయాంలో 'సర్వే' జరిపినప్పుడు, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉన్నవాళ్లు కూడా రైళ్ళు, విమానాలు పట్టుకొని పరుగెత్తుకొని వచ్చి తమ వివరాలు నమోదు చేయించుకున్నారు. 'సమగ్ర కుటుంబ సర్వే'లో పాల్గొనకపోతే పథకాలు రావనో, జనాభా లెక్కల నుంచే తొలగించి పారేస్తారనో పెద్దఎత్తున ప్రచారం సాగింది. అదొక 'స్కైలాబ్' వలె జనాన్ని హడలెత్తించారు. సమగ్ర కుటుంబ సర్వే ఎందుకు నిర్వహించారో, ఫలితాలు ఏమిటో, దాని ఉద్దేశాలేమిటో కెసిఆర్ కు మినహా మరెవ్వరికీ తెలియదు. ఈ 'సర్వే' పేరుతో 100 కోట్ల రూపాయల దుర్వినియోగం చేశారని ఆరోపణలు వస్తున్నవి. బిఆర్ఎస్ ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వేపై సిబిసిఐడి విచారం జరిపించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌కు బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ ఒక లేఖ రాయడం మరో సంచలనం.

రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్టీ హైకమాండ్ దగ్గర రేవంత్ రెడ్డి 'రేటింగ్' పెంచుకున్నారు. వివిధ ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు, ఇతర స్టాక్ హోల్డరుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సర్వే జరిపారు. 'రాజకీయంగా, పరిపాలనా పరంగా కొన్ని నిర్ణయాలు వేగంగా తీసుకోవాలి. కొన్ని నిర్ణయాలు ఆచితూచి తీసుకోవాలి. కొన్ని నిర్ణయాలను వాయిదా వేయాలి. కొన్ని విషయాల్లో తగిన సమయంలో, తగిన నిర్ణయాలు తీసుకోవాలి. కొన్ని నిర్ణయాలు అసలు తీసుకోకూడదు' అని రాజనీతి శాస్త్రం చెబుతోంది. అసలు 'ఏ నిర్ణయం తీసుకోకపోవడమూ కూడా ఒక నిర్ణయమే' అన్నది దివంగత మాజీ ప్రధాని పివి. నరసింహారావు ఫార్ములా.

ఇందులో రేవంత్ రెడ్డి మొదటి క్యాటగిరీకి చెందిన వ్యక్తి. రాజకీయాలకు అతీతంగా ప్రజలను 'కేంద్రంగా' చేసుకొని విధాన నిర్ణయాలు తీసుకోవడానికి 'దమ్ము' కావాలి. రైతుల కమిషన్, విద్యా కమిషన్ వంటి కమిషన్ల ఏర్పాటు కావచ్చు,హైడ్రా, మూసీ సుందరీకరణ కావచ్చు, 55వేల మందికి ఉద్యోగాలివ్వడం కావచ్చు, గ్రూపు 1 పరీక్ష కావచ్చు, రుణమాఫీ కావచ్చు, తాజాగా బిసిల జనాభా లెక్కింపు, ఎస్‌సీవర్గీకరణపై సానుకూల ప్రకటన వంటి అంశాలు కావచ్చు అత్యంత సాహసోపేతమైన చర్యలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి నిర్ణయాల పర్యవసానాలపై పార్టీలోనే, లేదా సహచర మంత్రులలోనే భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అయినా వెరవకుండా ఇలాంటి చర్యలు తీసుకోవడం రేవంత్ రెడ్డికే సాధ్యమైంది. ముఖ్యమంత్రిగా ఎవరున్నా ఏ రోజు కారోజు గడచి పోతే సరిపోతుందని, పాలనలో ఇబ్బందులు తలెత్తకూడదని, ప్రతి నిర్ణయం వెనుక 'రాజకీయ మైలేజీ' సాధించాలని అనుకుంటారు.



రేవంత్ ప్రభుత్వం జరిపిన కులగణనను సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమర్థించారు. ''2014 సర్వేను ఈ సర్వేతో పోల్చకూడదు. ఒక్కరోజులో నాడు జరిపిన సర్వేకు, ఈ సర్వేకు చాలా తేడా ఉంది. బిసి రిజర్వేషన్లు పెంచుతారా? లేదా?..పెంచితే ఎంత?లేకపోతే ఈ సర్వే కాగితాలకే పరిమితమవుతుంది. 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దని సుప్రీం చెప్పింది.ఇక్కడ చర్చపెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దు. బిసి, ఎస్సీలకు ఉన్న మేధస్సు, పనితనం ఎవరికీ లేదు. నైపుణ్యం ఎక్కువున్న వాళ్లలో బిసిలే ఎక్కువ. తెలుగు రాష్ట్రాల్లో కులగణన ప్రయత్నం ఎప్పుడు జరగలేదు'' అని ఆయన అన్నారు.

జాతీయ పార్టీకి చెందిన ఒక సిఎం ఇలాంటి ధైర్య సాహసాలతో కూడిన, దూకుడు నిర్ణయాలు తీసుకోవడం అరుదైన సన్నివేశం.

''శక్తివంతుడయిన వ్యక్తి కావాలనే తన చుట్టూ ఉన్నవాళ్లను అయోమయానికి గురి చేసి, వాళ్ళను భయభ్రాంతులను చేసి, చొరవ చేసే శక్తిని తన ఆధీనంలో ఉంచుకుంటాడు. అవతలి వ్యక్తి ఏ మాత్రం ఎదురు చూడని సమయంలో, ఎదురుచూడని చోట ఒక్కోసారి హఠాత్తుగా దాడి చేసినపుడు ప్రత్యర్థి గజగజ వణికిపోతాడు. ఊహకు అందనట్టు ప్రవర్తించడం హడలు పుట్టించే ఒక ఆయుధం. అందుకే మనం హఠాత్తుగా సంభవించే భూకంపాలు, సుడి గాలులకు భయపడతాం. అలాంటివి ఎప్పుడు దాడి చేస్తాయో తెలియనందున అంతగా బెదిరిపోతాం'' అని క్రీస్తు పూర్వం 3వ శతాబ్దానికి చెందిన, చైనా తత్వవేత్త హాన్ ఫెయి త్సూ అన్నాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం, ఎత్తుగడలు అలాగే కనిపిస్తున్నవి. ఆయన వ్యూహాలను పసిగట్టడంలో బిఆర్ఎస్, బిజెపి విఫలమవుతున్నవి. రేవంత్‌ను రాజకీయంగా దెబ్బతీయాలనుకొని, ఆయన ట్రాప్‌లో చిక్కుకొని ఆత్మరక్షణ కోసం తల్లడిల్లుతున్నవి. బిసి కులగణన, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై రేవంత్ వైఖరి కెసిఆర్ ను ఇరకాటంలోకి నెట్టిపారేసింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో ఎస్.సి.రిజర్వ్‌డ్ 19, ఎస్.టి.రిజర్వుడు స్థానాలు 12 పోను మిగతా 88 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ 33 సీట్లను బిసి అభ్యర్థులకు కేటాయించింది. బిఆర్ఎస్ పార్టీ బిసిలకు కేటాయించిన నియోజకవర్గాలు 22. కనుక త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసిలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తే, అదే పద్ధతిలో తాము కూడా 42 శాతం ఇవ్వక తప్పని పరిస్థితుల్లోకి కెసిఆర్ పార్టీని నెట్టివేయడం రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులకే సాధ్యమైంది.

''రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, గ్యారెంటీలు, డిక్లరేషన్లన్నీ బూటకం. ఏడాదికి పైగా పాలన చేస్తున్న ప్రభుత్వానికి ఏ అంశం పైనా స్పష్టత లేదు. బిసి డిక్లరేషన్ పేరుతో అబద్ధాలు చెప్పింది. సర్వే డేటాపై ప్రభుత్వానికి ఏమాత్రం స్పష్టత లేదు. బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదు. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ నిస్సిగ్గుగా యూ టర్న్ తీసుకున్నది'' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు అమలుచేస్తామని, మీరు సిద్ధమా? అన్న సవాలును స్వీకరిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొనలేదు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతోనే తనకు పోటీ అన్నట్టుగా కెటిఆర్ వ్యాఖ్యలున్నవి. రామారావు ఎప్పుడు మాట్లాడినా రాహుల్ గాంధీపై 'రాయి' విసరడం ఆయనకు అలవాటు. ఈ విషయంలో కెటిఆర్ కు ఆదర్శం రేవంత్ రెడ్డే. కెటిఆర్, హరీశ్ రావు, కవిత వంటి వారు తనకు పోటీ కాదని, కెసిఆర్ మాత్రమే తనకు సమఉజ్జీగా రేవంత్ 'మాటల దాడులు' చేసే సంగతి అందరికీ తెలుసు. కనుక తనను లెక్క చేయని ముఖ్యమంత్రిని తాను ఖాతరు చేయదలచుకోలేదని, తనకు 'టార్గెట్' రాహుల్ గాంధీ మాత్రమేనని చెప్పడానికి కెటిఆర్ ప్రయత్నిస్తున్నారు.

''ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి విధానాలను రూపకల్పన చేయడానికి ప్రభుత్వం ఉపయోగిస్తుంది. ఈ చర్య వివిధ సామాజికవర్గాల మధ్య అసమానతల ను నిర్మూలించడానికి, పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని సూచిస్తుంది''. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన ఆసక్తిని కలిగించింది. ''సుప్రీం కోర్టు తీర్పు మేరకు వర్గీకరణకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నేను 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా, నా రాజకీయ జీవితంలో నాకు ఆత్మసంతృప్తిని కలిగించిన రోజు ఇది. ఇలాంటి అవకాశం నాకు రావడం సంతోషం.చరిత్రపుటల్లో ఇది శాశ్వతంగా నిలిచిపోతుంది. వర్గీకరణకు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టింది.'' అని రేవంత్ రెడ్డి తెలియజేశారు.

రేవంత్ ప్రభుత్వం జరిపిన కులగణనను సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమర్థించారు. ''2014 సర్వేను ఈ సర్వేతో పోల్చకూడదు. ఒక్కరోజులో నాడు జరిపిన సర్వేకు, ఈ సర్వేకు చాలా తేడా ఉంది. బిసి రిజర్వేషన్లు పెంచుతారా? లేదా?..పెంచితే ఎంత?లేకపోతే ఈ సర్వే కాగితాలకే పరిమితమవుతుంది. 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దని సుప్రీం చెప్పింది.ఇక్కడ చర్చపెట్టి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవద్దు. బిసి, ఎస్సీలకు ఉన్న మేధస్సు, పనితనం ఎవరికీ లేదు. నైపుణ్యం ఎక్కువున్న వాళ్లలో బిసిలే ఎక్కువ. తెలుగు రాష్ట్రాల్లో కులగణన ప్రయత్నం ఎప్పుడు జరగలేదు'' అని ఆయన అన్నారు.

''రాష్ట్రంలో కులగణన సర్వే జరగొద్దని సర్వేలో పాల్గొనద్దని కుట్రదారులు పిలుపు ఇచ్చినప్పటికీ, ప్రజలు సహకరించి దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టారు. కులగణన చాలా పారదర్శకంగా, శాస్త్రీయంగా జరిగింది. సర్వే పర్యవేక్షణకు సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన 2024, 19 అక్టోబర్ లో సబ్ కమిటీ ఏర్పాటు చేసాం. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీ చెకప్, ఒక ఎక్సరే లాంటిది. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉన్నది. సామాజిక న్యాయానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మీడియాకు చెప్పారు. కులగణన, ఎస్.సీ.వర్గీకరణ విషయాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు దామోదర రాజనరసింహ, ఉత్తమ్, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులంతా సిఎంకు వెన్నుదన్నుగా నిలబడడం విశేషం.

## సూరజ్‌కుండ్ మేళా... హస్తకళాకారుల పరిచయ వేదిక

1987లో ఘనంగా ప్రారంభమైన భారత హస్తకళల ప్రదర్శన మేళా నేడు 2025లో ఫిబ్రవరి 07 నుంచి 23 వరకు ఒక పక్షం పాటు పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. హర్యానా రాష్ట్రంలోకి ఫరీదాబాదు సమీపాల సూరజ్‌కుండ్ ప్రాంతంలో ప్రతి ఏట ఫిబ్రవరిలో నిర్వహించే పక్షకాలపు అంతర్జాతీయ స్థాయి క్రాఫట్స్ మేళాలో వైవిధ్యభరిత భారతీయ ప్రజలతో పాటు 45 50 దేశాల హస్తకళలు, కళాకారులు, అధికారులు పాల్గొనడంతో పాటు 15 రోజుల పాటు మిలియన్ల కొద్ది ప్రజలు పాల్గొని తమ నైపుణ్యాలకు తగు గుర్తింపును, కళారూపాల అమ్మకాలు జరుగుతాయి. ఈ మేళాలో హస్తకళల వస్తు ప్రదర్శనలతో పాటుగా వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన కళాకారులుతో కలిసి అంతర్జాతీయ కళాకారులు కూడా తమ తమ సాంప్రదాయ సాంస్కృతిక కళలను భారీ వేదికల మీదుగా ప్రదర్శించడం, వివిధ రకాల వంటలను పరిచయం చేయడం, వినోద కార్యక్రమాలు, సాహస క్రీడలు, నవ్య వాహన అనుభవాలు చూపరులను ఆకర్షిస్తూ పెద్ద ఎత్తున పలు కార్సక్రమాలు కొనసాగుతాయి.



భారతీయ హస్త కళారూపాల ప్రదర్శన విక్రయాలు:

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో చవకగా వస్త్రాలను యంత్రాల సహాయంతో తయారు చేస్తూ మార్కెట్లోకి విసురుతున్న వేళ సాంప్రదాయ హస్తకళాకారులు తయారు చేస్తున్న వస్తువులకు గిరాకీ తగ్గడంతో భారతీయ హస్తకళాకారుల కుటుంబాలు ఆకలి కేకలతో అలవటిస్తున్నాయి. దీనికి ఒక విరుగుడు ప్రయత్నంగా గ్రామీణ సంప్రదాయ కళారూపాలు, హస్తకళల అందమైన వస్తువులను బయటి ప్రపంచానికి పరిచయం చేయడం, విక్రయాలు జరగడంతో మధ్యవర్తులు లేకుండా నేరుగా హస్తకళాకారులకు ఆర్థిక లబ్ధి జరిగే విధంగా సూరజ్‌కుండ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. దాదాపు 50 ఎకరాల సువిశాల ప్రాంగణంలో వెయ్యికి పైగా దుకాణాలు లేదా స్టాల్స్‌తో ఏర్పాటు చేస్తున్న సూరజ్‌కుండ్ హస్తకళల మేళాలో వస్త్రాలు, పేయింటింగ్స్, కర్ర వస్తువులు, మట్టి పాత్రలు లేదా కళారూపాలు, శిల్ప కళారూపాలు, వెదురుతో చేసిన వస్తువులు లాంటి మరెన్నో వస్తువుల ప్రదర్శనలకు వేదిక కానుంది ఈ సూరజ్‌కుండ్ మేళా.

**సూరజ్‌కుండ్ మేళా–2025 విశేషాలు:**

సూరజ్‌కుండ్ మేళా అథారిటీ, హర్యానా రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వ టూరిజమ్, టెక్స్టైల్స్, కల్చర్, విదేశాంగ మంత్రిత్వ శాఖల సౌజన్యంతో నిర్వహించే సూరజ్‌కుండ్ అంతర్జాతీయ క్రాఫట్స్ మేళా 2025లో ఒడిసా, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల ఇతివృత్తాలే కేంద్ర బిందువుగా పలు సాంస్కృతిక, హస్తకళల, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుం ది. ఈ ప్రదర్శనశాలను సందర్శించిన వారికి అరుదైన హస్తకళల వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, పేయింటింగ్స్ లాంటివి తిలకించడం, కొనడం, కళాకారులతో మాట్లాడడం, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించడం, హస్త కళాకారుల నైపుణ్యాలను నేరుగా చూడడం కొనసాగుతుంది. వ్యర్థాలను తగ్గించడం, హరిత సంచుల వాడ కం, శుభ్రత పాటించడం, పర్యావరణ సుస్థిర విధానాలను అవలంబించడం కూడా జరుగుతూ కార్బన్ ఉద్గారాలను పూర్తిగా తగ్గించేలా ప్రయత్నా లు చేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన సువిశాల భారతంలో దాగిన హస్తకళాకారులను ప్రోత్సహించడానికి సూరజ్‌కుండ్ మేళాకు హాజరై వివిధ కళారూపాలను కొని, పేద కళాకారులను ఆదుకుందాం, వారి ముఖాల్లో ఆనంద తాండవాలను చూద్దాం.

**(07–23 ఫిబ్రవరి సూరజ్‌కుండ్ అంతర్జాతీయ హస్తకళల మేళా సందర్భంగా)**


డా.బిఎంఆర్, 9949700037

## నిశ్శబ్ద నిష్క్రమణ




ఒకప్పుడు ఎంతో ఉన్నత సేవలతో అకట్టుకున్న ఎన్నో సంస్థలు... వివిధ రకాల సేవలు సుమారు గత అర్ధ దశాబ్దకాలంగా కనుమరుగవుతున్నాయి. అత్యవసర సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించే టెలిగ్రాఫ్ శాఖ ఇప్పటికే చరిత్రపుటల్లో కలిసిపోయింది. తపాలా, టెలిఫోన్ శాఖలు మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త రూపాలను సంతరించుకుంటూ నెట్టుకొస్తున్నాయి. తపాలా లేదా పోస్టల్ శాఖ కొన్ని సేవలను విడిచిపెట్టి, ఆ స్థానంలో నూతన వ్యాపార సేవలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ శాఖల పూర్తిగా లేదా పాక్షికంగా నిలిపివేసిన సేవల గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడం శోచనీయం. ఆ విధంగా నిశ్శబ్ద నిష్క్రమణ చేసిన సేవల్లో బుక్‌పోస్టు ఒకటి. ఎన్నో దశాబ్దాలుగా తపాలా శాఖ అందించిన బుక్‌పోస్టు సేవలకు తెరపడంతో ఒక సంస్థ సుదీర్ఘ ప్రస్థానం ముగిసింది. దేశవ్యాప్తంగా 1,54,725 పోస్టాఫీసులు, 19,101 పిన్ కోడ్‌లతో విస్తృతమైన నెట్‌వర్క్ ఉన్న తపాలా శాఖ ఎంతోకాలంగా బుక్ పార్సిళ్లను బట్వాడా చేస్తున్నది. సుదూర ప్రాంతాలకు కూడా వారంరోజుల్లోపే పార్సిల్స్ చేరుతుంటే, నగరాల్లో ఒక్క రోజులోనే అవి గమ్యాలకు చేరు తున్నాయి. వివాహాది శుభకార్యాల నుంచి పుస్తకాల వరకూ ముద్రితాలను పంపేందుకు ఎంతో అనుకూలంగా ఉండే బుక్‌పోస్టును తపాలా శాఖ రద్దు చేయడంతో, ప్రైవేటు పార్సిల్ సర్వీసులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. బుక్ పోస్ట్ సర్వీసును ఉదాత్తమైన ఆలోచనతో మొదలు పెట్టారు. విద్యను ప్రోత్సహించడం, పఠనాభిలాషను పెంపొందింపచేయడం, దేశవ్యాప్తంగా జ్ఞానాన్ని పరివ్యాప్తి చేయడం అనే విశాలదృష్టితో ఈసర్వీసును ప్రారంభంచారు.

రిజిస్టర్డ్ బుక్ పోస్ట్(ఆర్.బి.పి.)సర్వీసు ద్వారా 5 కిలోల బరువున్న పుస్తకాలను దేశంలోని ఏమారు మూల ప్రాంతానికైనా కేవలం రూ.80లకు పంపించ గలిగేవారు. మరే ఇతర కొరియర్ సర్వీసు ఇంత చౌకగా ఈ రకమైన సేవలు అందించడంలేదు. పుస్తకాలు చదివే అలవాటును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సబ్సిడీ రేట్లను అందుబాటులో కి తెచ్చారు. పుస్తకాలు, మాగజైన్లు, పీరియాడికల్స్ ఈ రాయితీల కు అర్హమైనవి. అయితే ముందుగా పుస్తక పరిశ్రమ, చదువరుల అభిప్రాయాల ను తెలుసు కోకుండా, ఏవిధమైన చర్చ, సమాచారం లేకుండా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని హఠాత్తు గా, ఏకపక్షంగా అమలు చేసింది. రిజిస్టర్ బుక్ పోస్ట్ కేటగిరిని తపాలా శాఖ సాఫ్ట్ వేర్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా తిసివేశా రు. తపాలా శాఖ సిబ్బందికి కూడా ముందుగా ఈ విషయం తెలియపరచలేదు. ఈ హఠాత్ నిర్ణయం వారందరినీ కూడా విస్మయానికి గురి చేసింది. దేశ వ్యాప్తంగా పోస్టాఫీసుల్లో పుస్తకాలను రిజిస్టర్ బుక్ పోస్టులో పంపడానికి వెళ్లిన వందలాది మంది ప్రచురణ సంస్థల సిబ్బంది ఇక ఈ సర్వీసు అంగుబాటులో లేదని తెలుసుకుని ఆశ్చర్యంతో పాటు ఆశాభంగానికి లోనయ్యారు. నిలదీసిన సందర్భాలు, వాగ్వాదానికి దిగిన సంఘటనలు లేకపోలేదు. ఈ సర్వీసును రద్దు చేయడం ప్రచురణ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. రిజిస్టర్ బుక్ పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జి.ఎస్.టి. తో కలిపి రూ. 25 కు పంపేవారు. ఇప్పుడు ఈ సర్వీసు రద్దు కావడంతో తప్పని సరిగా రిజిస్టర్డ్ పార్సిల్లో మాత్రమే పుస్తకాలను ఎక్కువ చార్జీలు భరించి పంపక తప్పని పరిస్థితి ఏర్పడింది. వంద రూపాయల ఖరీదు చేసే పుస్తకాన్ని ఎవరైనా పాఠకుడు పోస్టులో తెప్పించుకోవాలంటే షిప్పింగ్ చార్జీల కింద రూ.78 భరించాల్సి వస్తుంది. ఇంత భారం భరించి పుస్తకాలను ఎంతమంది తెప్పించుకోగలరు? ఇప్పటికే పఠనాసక్తి కొరవడి, పుస్తక పరిశ్రమ నష్టాల్లో కునారిల్లుతోంది. మూలిగే నక్కపై తాటిపండు చందంగా ఇప్పుడు తపాలాశాఖ తీసుకున్న నిర్ణయం పబ్లిషింగ్ ఇండస్ట్రీని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టింది. రిజిస్టర్ బుక్ పోస్ట్‌కి రిజిస్టర్ పార్శిల్ కి చార్జీల్లో తేడా ఇలా ఉంది. రిజిస్టర్ బుక్ పోస్టులో కిలో బరువున్న పుస్తకాలను రూ.32కే పంపేవారు. అవే పుస్తకాలను ఇప్పుడు రిజిస్టర్డ్ పార్శిల్లో పంపటానికి రూ.78 అవుతుంది. 2 కిలోల పుస్తకాలకు బుక్‌పోస్ట్‌లో రూ.45 అయితే పార్శిల్ లో రూ.116 అవుతుంది. 5కిలోల పుస్తకాలు బుక్ పోస్ట్‌లో రూ.80 అయితే పార్శిల్ లో రూ. 229 అవుతుంది. దీనికి తోడు తపాలాశాఖ మరొక అవాంఛనీయ నిర్ణయమూ తీసుకుంది. శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించారు. మన పుస్తకాలను విదేశీ భాషలోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు, ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను మనకు పంపుతుంటారు. ఇలా విదేశాల నుం చి వచ్చే పుస్తకాలపై మొదటి సారిగా ప్రభుత్వం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాల మీద సుంకం విధించడాన్ని సమర్థించవచ్చేమో కానీ కాంప్లిమెంటరీగా ఉచితంగా పంపే పుస్తకాలపై కూడా సుంకంపేరిట అదనపు భారం మోపడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇది విరుద్ధ ఫలితాలను ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల పర్యవసానాలు తీవ్రంగా ఉండనున్నాయి. దేశ విద్య, సాహిత్య లక్ష్యాలను ఇది విఘాతం కల్గిస్తుంది. అక్షరాస్యత, విద్య,మేధో వికాసాలకు నిబద్ధమై దేశం సాగిస్తున్న కృషిని లక్ష్యాలను బుక్ పోస్ట్ సర్వీసు ఉపసంహరణ పూర్తిగా నీరుగారుస్తుంది. ఆలోచనలు, విజ్ఞానమే దేశపురోగతికి పునాదులు. దేశం నలుమూలలకు వీటిని చేరవేయడానికి ఉద్దేశించిన బుక్ పోస్ట్ సర్వీసును నిలిపివేయడానికి మించిన విషాదం ఏముంటుంది?




## పెన్షన్‌దారులకు 'జీవన్ ప్రమాణ్' ఉపయోగం

లేఖ

బొగ్గు గనుల పెన్షన్ దారులు ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలలలో లైఫ్ సర్టిఫికెట్ జీవన ప్రమాణ్ మొబైల్ యాప్/ వెబ్‌సైట్ ద్వారా తాము జీవించి ఉన్నట్లు నిరూపణ మరియు పెన్షన్ పొందుటకు సమర్పించవలసి ఉంటుంది. ఈ సమర్పణ లో కొన్ని లోటుపాట్లు జరుగుచున్నవి. చాలామందికి ఇప్పటికి కూడా ఆన్లైన్ పద్ధతిలో సమర్పించుటకు అవగాహన లేక పోవడం, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ నెంబర్ స్థానం లో మెడికల్ సిపిఆర్ఎంఎస్ నెంబర్, పెన్షన్ పొందు సంస్థ, బ్యాంక్ అకౌంట్ నెంబర్ సంబంధిత ఇతర వివరాలు పొరపాటుగా పొందుపరుస్తున్నట్లు తెలుస్తున్నది. ఫలితంగా వారు జనవరి నెల నుండి అనగా 1st February రోజున పెన్షన్ బ్యాంకు అకౌంట్‌లో జమ కాక పోవడం వలన ఆందోళన చెందుతున్నారు. ఇంతేగాక ఈ సేవ మీ సేవ కేంద్రాలలో కూడా ఆపరేటర్లు తప్పుగా పొందుపరుస్తున్నారని పెన్షనర్లు తెలుపుతున్నారు.

పైన వివరించిన సమస్యలను నివారించడానికి పెన్షన్ దారులు ఇబ్బందుల పాలు కాకుండా ఈ క్రింది విధమైన సూచనలు చేస్తున్నాను. ఈ జీవన ప్రమాణ్ పెన్షనర్ ఐడెంటిఫికేషన్ ఆన్లైన్ పద్ధతిలో ఆధార్ కార్డు ఆధారిత వివరాలతో పొందుపరిచి ఉంటుం ది. ఆధార్ నెంబర్ పొందు పరిచిన తర్వాత పెన్షన్ పేమెంట్ ఆర్డర్ నెంబర్, టైప్ ఆఫ్ పెన్షన్, ఆర్గనైజింగ్ టైప్, శాంక్షనింగ్ అథారిటీ, డిస్బర్సింగ్ ఏజెన్సీ మరియు ఏజెన్సీ ఆటోమేటిక్ గా సంబంధిత వ్యవస్థల వివరాలు, అదేవిధంగా బ్యాంకు నెంబర్ పొందుపరచుటకు కూడా తగిన ఏర్పాటు చేయడం చేయాలి.సిపిఆర్ఎంఎస్(మెడికల్ కార్డు) లో కూడా తగిన ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ప్రతి దినచర్య ఐటీ రంగంపై ఆధారపడి ఉంటున్నది.

ఈ తరుణంలో పైన సూచించిన విధంగా ప్రోగ్రాం రాయడం తయారు చేయడం ఇబ్బంది కాకపోవచ్చు. ఈ సూచనలకు బొగ్గు కంపెనీలు, బొగ్గు మంత్రిత్వ శాఖ బొగ్గు కంపెనీల యాజమాన్యాలు కార్మిక సంఘాలు తోడ్పడాలని కోరుతున్నాను.

దండంరాజు రాంచందర్ రావు

# వారిది బుజ్జగింపులు మాది 'సబ్ కా వికాస్'

## రాజ్యసభలో ప్రధాని మోదీ స్వోత్కర్ష

**న్యూఢిల్లీ :** ఓట్లకోసం కాంగ్రెస్‌పార్టీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం రాజ్యసభలో విమర్శించారు. తమ ప్రభుత్వం 'సబ్ కా సాత్–సబ్ కా వికాస్' (అందరి మద్దతు–అందరి ప్రగతి) అనే సూత్రంపై పనిచేస్తోందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మొదట తన కుటుంబానికే ప్రాధాన్యత ఇస్తుందనీ, ఆ తర్వాతే చుట్టూ ఉన్నవాటిపై దృష్టి పెట్టి తన విధానాలకు ప్రాధాన్యమిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేసిందని మోదీ ఆరోపించగానే ప్రతిపక్ష సభ్యులు పెద్దపెట్టున మోదీకి తమ నిరసన తెలియజేశారు. మోదీ ప్రసంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. భారత రాజ్యాంగ రూపశిల్పి డా.బి.ఆర్.అంబేద్కర్‌కు కాంగ్రెస్‌పార్టీ వ్యతిరేకమని కూడా మోదీ ఆరోపించారు. 1975–77 కాలంనాటి ఎమర్జెన్సీ రోజులలో జరిగిన సంఘటనలను ఆయన గుర్తుచేశారు. ఇంతకుముందు అధికారంలో కొనసాగిన కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాలు భావ ప్రకటనాస్వేచ్ఛను అణచివేశాయని, తమ ప్రభుత్వం మాత్రం పేదల అభ్యున్నతికోసం పాటుపడుతోందని, తా ము మధ్యతరగతి పక్షం వహించామని, దేశంలో నయా–మధ్యతరగతి వర్గం భుజం కాస్తున్నామని అన్నారు. ''మొదట దేశం అనేదే బిజెపి ప్రాధాన్యం'' అని మోదీ చెప్పుకొచ్చారు. ''నేను చాలా గర్వంగా చెప్పగలను, గడచిన ఐదారు దశాబ్దాలుగా ప్రజలకు ఒక ప్రత్యామ్నాయ ప్రభుత్వం అంటూ ఒకటి లేకుండా పోయింది, చాలా సుదీర్ఘ కాలం తర్వాత 2014లో బుజ్జగింపు రాజకీయాలపై ఆధారపడని, అందరినీ సంతృప్తిపరచే ఒక కొత్త నమూనా ప్రభుత్వాన్ని దేశం చూసింది, కాంగ్రెస్ హయాంలో కొనసాగిన నమూనా ప్రభుత్వంలో ప్రతీది బుజ్జగింపు రాజకీయమే, ఇదే దేశ రాజకీయాలలో కీలకమర్మంగా మారిపోయింది. కొన్ని చిన్న గ్రూపులకు ఏదో ఒకటి ఇచ్చి ఇతరులకు రిక్తహస్తాలు చూపించింది, ఎన్నికల సమయంలో ప్రజల్లో తప్పుడు ఆశలు రేకెత్తించేది, ప్రజలను తెలివితక్కువ వాళ్ళను చేసే విధంగా రాజకీయాలు నడిపింది'' అని మోదీ విమర్శించారు. బిజెపి ప్రభుత్వ హయాంలో దేశంలోని వనరులను గరిష్ఠస్థాయిలో సద్వినియోగం చేయడంపైనే దృష్టి సారించామని చెరప్పారు. ''అందరికీ సంతృప్తి కలిగించే వైఖరిని మేం అనుసరించాం, ఈ పథకాలతో 100 శాతం ఫలితాలు సాధిస్తాం, ఎవరిని అశక్తులను చేయకుండా, రిక్తహస్తాలు చూపించకుండా ముందుకే తీసుకువెళ్ళే వైఖరిని మా ప్రభుత్వం అనుసరించింది, గడిచిన దశాబ్దకాలంలో ప్రతిష్ఠాయిలోనూ ''సబ్ కా సాత్, సబ్ కా వికాస్' ను అమలు చేసేందుకే మేం ప్రయత్నం చేశాం, ఇప్పుడు దాని ఫలితాలను, ఆ ప్రభావాన్ని మనం చూస్తున్నాం'' అని మోదీ అన్నారు.

''కుల విషాన్ని వ్యాప్తి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి, గడచిన మూడు దశాబ్దాలుగా పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఉన్న అన్ని పార్టీలకు చెందిన ఓబిసి ఎంపీలు ఒక ఒబిసి కమిషన్ కావాలని డిమాండ్ చేస్తున్నారు, కానీ ఆ డిమాండ్‌ను తిరస్కరిస్తూ వచ్చారు, ఎందుకంటే ఆ నాటి కాలంలో వారు చేసిన రాజకీయాలకు అది సరిపడలేదు గనుక, మేం మాత్రం ఈ ఓబిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన ప్రతిపత్తిని ఇచ్చాం, రిజర్వేషన్ల సమస్య వచ్చినప్పుడల్లా దేశంలో ఒక చీలిక సృష్టించేందుకే దాన్ని ఉపయోగించుకున్నారు, మొదటిసారి మేం ఒక నమూనా ఇచ్చాం, మేం ఆర్థికంగా వెనుకబడిన గ్రూపులకు పదిశాతం రిజర్వేషన్ ఇచ్చాం, ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి వర్గాలకు చెందిన ఎవ్వరి రిజర్వేషన్లూ లాక్కోకుండా ఈ అవకాశాన్ని వారికి ఇచ్చాం, ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిలు దీనిని ఆహ్వానించాయి, వారికి ఎక్కడా సమస్య కనిపించలేదు'' అని మోదీ అన్నారు.

**ప్రధాని మోదీ ప్రసంగం అబద్ధాల పుట్ట**

రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన 90 నిమిషాల ప్రసంగమంతా పచ్చి అబద్ధాల పుట్ట అని, చరిత్రను వక్రీకరించారని కాంగ్రెస్‌పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ప్రజల నిజమైన సమస్యల గురించి ప్రధానమంత్రి మాట్లాడలేదన్నారు. ఇతర ప్రతిపక్షాలు కూడా ఇదేవిధంగా స్పందించాయి. ప్రధానమంత్రి ప్రసంగం అబద్ధాలతో కొనసాగిందని, అర్ధసత్యాలను సభలో వల్లెవేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, ప్రజలను వర్గాలుగా విభజించడం, ద్రవ్యోల్బణం వంటి అనేక వాస్తవ సమస్యలను ప్రధానమంత్రి సభలో ప్రస్తావించలేదని, వాటికి పరిష్కారాలు చెప్పలేదని జైరామ్ రమేశ్ విమర్శించారు. ఆయన ఏదైనా సక్రమంగా చెప్పి ఉంటే, మేం కూడా దానిపై చర్చించేవాళ్ళమని, కానీ ఆయన ఏమీ చెప్పకుండా చరిత్రను వక్రీకరించారని, అసత్యాలు వల్లెవేశారని విమర్శించారు. ప్రధానమంత్రి పదవికి తాము ఎంతో గౌరవం ఇస్తామని, కానీ పొరపాటున కూడా నిజాలు మాట్లాడని ప్రధానమంత్రికి తాము ఏ విధంగా గౌరవం ఇవ్వగలమని ఆయన ప్రశ్నించారు.

# గాజాలో సహజవనరుల దోపిడీకి ట్రంప్ పన్నాగం

## పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటించాలని ప్రపంచ శాంతికాముక ప్రజలకు సిపిఐ పిలుపు





**న్యూఢిల్లీ :** బల ప్రయోగంతో గాజా స్ట్రిప్‌ను స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులను భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. పాలస్తీనా ప్రజలకు తన సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఈ మేరకు గురువారంనాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ట్రంప్ యుద్ధోన్మాద వాచాలత్వానికి వ్యతిరేకంగా దృఢమైన వైఖరిని అనుసరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాలస్తీనా ప్రజలకు మద్దతు ఇస్తున్న భారతదేశ దీర్ఘకాలిక వైఖరిని ఉద్ఘాటించి ప్రముఖంగా అందరికీ తెలిసేట్టు చేయాలని కోరింది. సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాంతికాముకులైన ప్రజలు ఏకమై పాలస్తీనా ప్రజలతో భుజం భుజం కలిపి నిలబడాలని సిపిఐ పిలుపు ఇచ్చింది.

'గాజా స్ట్రిప్‌ను బలవంతంగా ఆక్రమించుకుంటామని బెదిరించడం తమ మాతృభూమిలో నివసిస్తున్న పాలస్తీనా ప్రజల మౌలిక హక్కులను ఉల్లంఘించడమే. ''ఈ దౌర్జన్యకరమైన పరిస్థితి ట్రంప్ నిజస్వరూపాన్ని, ఆయన ఉద్దేశాలను బహిర్గతం చేసింది. ఇది కేవలం దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న రెండు దేశాల పరిష్కారానికి ద్రోహం చేయడం మాత్రమే కాదు, గాజా స్ట్రిప్‌లో ఉన్న సహజవాయువు, చమురు నిల్వలను సామ్రాజ్యవాద ప్రయోజనాలకోసం దోపిడీ చేసేందుకు వీలుకల్పించే ఉద్దేశాలను బయటపెట్టింది. అనేక దశాబ్దాలుగా పాలస్తీనా ప్రజలు అత్యంత క్రూరమైన ఆక్రమణను, యుద్ధాన్ని, నిరాశ్రయాన్ని భరిస్తూ వస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఇజ్రాయెల్ చేస్తున్న ఈ దురాక్రమణను పాలస్తీనా ప్రజలు వెనుకంజ వేయకుండా ప్రతిఘటిస్తున్నారు. పాలస్తీనా సార్వభౌమత్వాన్ని శాశ్వతంగా అణచివేస్తానని, తదుపరి ఇజ్రాయెల్ ఆక్రమణకు రక్షణ కల్పిస్తానని, ఆ విధంగా లాభాలు దండుకునే కార్పొరేట్ల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఈ ప్రాంతంలో ప్రకృతివనరులను దోచుకోవడమే తన ఎజెండా అని ట్రంప్ ఇప్పుడు చేసిన నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. స్వయం నిర్ణయాధికారం కోసం, స్వాతంత్ర్యం కోసం పాలస్తీనా ప్రజలు చేస్తున్న న్యాయబద్ధమైన పోరాటానికి సిపిఐ మడమ తిప్పకుండా తన సంఘీభావాన్ని ప్రదర్శించే వైఖరికే కట్టుబడి ఉంది పాలస్తీనా ప్రజల లక్ష్యసాధనకు సిపిఐ తన చిత్తశుద్ధిని పునరుద్ఘాటిస్తున్నది, ప్రజాస్వామ్యదేశాలు, ప్రగతిశీలశక్తులు, అంతర్జాతీయ సమాజం వారి పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నది'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో పేర్కొంది.

# 18 మెడికల్ కాలేజీలకు 'యుజిసి షోకాజ్ నోటీసులు'

## ర్యాగింగ్ నిరోధక నిబంధనలు పాటించనందుకు యుజిసి చర్యలు

## ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీ




**న్యూఢిల్లీ :** ర్యాగింగ్ నిరోధక నిబంధనలు పాటించని 18 మెడికల్ కాలేజీలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అధికారులు ఈ విషయాన్ని గురువారం తెలిపారు. ఢిల్లీ సహా తమిళనాడు. అసోం, పుదుచ్చేరిలో ఒక్కొక్కటి రెండు చొప్పున, ఆంధ్రప్రదేశ్, బిహార్‌లో ఒక్కొక్కటి మూడు, మధ్యప్రదేశ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలలో ఒక్కొక్కటి చొప్పున మెడికల్ కాలేజీలు డిఫాల్టర్ కాలేజీలుగా ఉన్నాయి. ర్యాగింగ్ ముప్పును అరికట్టేందుకు 2009 ర్యాగింగ్ నిరోధక నిబంధనలను ఈ మెడికల్ కాలేజీలు పాటించలేదని తెలిపింది. అకడమిక్ సంవత్సరం ప్రారంభంలో అడ్మీషన్ల సమయంలో విద్యార్థుల నుండి యాంటీ ర్యాగింగ్ అండర్‌టేకింగ్స్ పొందటంలో ఈ కళాశాలలు విఫలం అయ్యాయని గుర్తించినట్లు యుజిసి సెక్రటరీ మనీష్‌జోషి చెప్పారు. 2009 యాంటీ ర్యాగింగ్ నిబంధనల ప్రకారం.. ప్రతీ విద్యార్థి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షుల నుంచి అండర్‌టేకింగ్ తీసుకువచ్చి నిర్దేశించిన సమయంలో అందజేయాలన్న నిబంధనను అతిక్రమించినట్లు గుర్తించడం జరిగిందని జోషి తెలియజేశారు. విద్యాసంస్థలలో ర్యాగింగ్ సంఘటనలను నిరోధించడానికి ఈ బాధ్యత చాలా ముఖ్యమైనది. కాలేజీలలో జాప్యానికి గల కారణాలను, ఈ పరిస్థితిని సరిదిద్దడానికి గల చర్యలను షోకాజ్ నోటీస్ అందుకున్న తేదీ నుంచి ఏడు రోజుల్లోగా అందజేయాలని ఆదేశించినట్లు మనీష్ జోషి చెప్పారు. నిర్ణీత కాల పరిమితిలో సంతృప్తికరమైన వివరణను ఇవ్వని పక్షంలో కాలేజీలపై శిక్షార్హక చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా చర్యలను కొనసాగించాల్సి వస్తుందని జోషి స్పష్టం చేశారు.

# యుజిసి ముసాయిదా.. ఆర్‌ఎస్‌ఎస్ అజెండా

## లోక్‌సభలో రాహుల్ ధ్వజం




**న్యూఢిల్లీ :** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) ముసాయిదా నిబంధనలు దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను అమలు చేసే ప్రయత్నంగా ఉన్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధి గురువారం లోక్‌సభలో అధికార పార్టీపై ధ్వజమెత్తారు. డిఎంకె ఆధ్వర్యంలో యుజిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ యుజిసి ముసాయిదా నిబంధనలు ఒకే చరిత్ర, ఒకే సంస్కృతి, ఒకే భాషను అమలు చేసే విధంగా ఉన్నాయని, ఇది ఇతరుల చరిత్ర, సంస్కృతులను, భాషను నాశనం చేసే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ హక్కులను కాలరాసేదిగా ఉందన్నారు. ప్రతి రాష్ట్రం ప్రత్యేక సాంప్రదాయాలను, సంస్కృతి, భాషను కలిగి ఉందని, అందుకే భారతదేశం వివిధ రాష్ట్రాల కలయికగా మనగడ సాగిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని భాషలను, సంస్కతి, సాంప్రదాయాలను గౌరవించాలన్నారు. ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే చరిత్ర రాజ్యాంగ మూల సూత్రానికే విరుద్ధమన్నారు. అందుకే యుజిసి ముసాయిదాను తమిళ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, తమ భాషా సంస్కృతులను రక్షించుకునేందుకు వారు ఉద్యమించనున్నారని, ఆర్‌ఎస్‌ఎస్ ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలో బోధన సిబ్బంది నియామకాలలలో యుజిసి ముసాయిదా నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని, ఆ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రాష్ట్రాల అధికారాలను స్వాధీనం చేసుకోవాలని బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. రాజకీయ నాయకులను పారిశ్రామిక వేత్తల సేవకులుగా చేసే విధంగా నూతన విద్యా విధానం ఉందని, దానిని తాము ఎన్నడూ సమర్ధించబోమన్నారు. ఇటీవల బెంగళూరులో ఆరు రాష్ట్రాల ఉన్నత విద్యా మంత్రులతో కూడిన సమావేశంలో యుజిసి ముసాయిదాకు వ్యతిరేకంగా 15 అంశాలతో కూడిని తీర్మానం చేసినట్టు కాంగ్రెస్ పార్టీ నాయకుడు జైరామ్ రమేశ్ తెలిపారు.

# ఉమ్మడి పౌరస్మృతి.. రాజకీయ అస్త్రం కారాదు

**న్యూఢిల్లీ :** ఉమ్మడి పౌర స్మృతి(యుసిసి) రాజకీయ అస్త్రం కారాదని, దీనిపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. యుసిసి దేశంలో శాశ్వత శీతలీకరణకు దారి తీస్తుందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తంచేసింది. ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం తమ రాష్ట్రంలో యుసిసిని అమలు చేయడం, యుసిసి ఆవశ్యకతపై గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని నియమించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉత్తరాఖండ్ రూపొందించిన యుసిసి అసంబద్ధమైనదని, అది సులభంగా అతిక్రమణలకు అవకాశం ఇచ్చేదిగా ఉందని కాంగ్రెస్ పార్టీ సమాచార విభాగం అధిపతి జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. గత దశాబ్ద కాలంగా కుటుంబ చట్టాలపై వ్యక్తమౌతున్న ఆందోళనను ఏమాత్రం పరిష్కరించేదిగా లేదని, కేవలం బిజెపి అజెండాను బలవంతంగా రుద్దే ప్రయత్నంలో భాగమేనని అన్నారు. మోడీ ప్రభుత్వం కుటుంబ చట్టానికి సంస్కరణలలో భాగంగా నియమించిన 21వ లా కమిషన్ 182 పేజీల నివేదికను 2018 ఆగస్టు 31న అందజేసింది. నివేదికలోని 1.15 పేరా యుసిసి అమలులో దేశంలోని భిన్న సంస్కృతులకు విఘాతం కలుగకుండా ఉండేలా ఉమ్మడి పౌర స్మృతి ఉండాలని, ప్రస్తుత పరిస్థితులలో వివక్షపూరిత చట్టాల ఆవశ్యకత లేదని, ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రథమ ప్రాధాన్యమని పేర్కొన్నట్టు జైరాం రమేశ్ పేర్కొన్నారు. 2023 జూన్ 14న 22వ లా కమిషన్ ఉమ్మడి పౌర స్మృతిని మరోసారి పరిశీలించాలని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. 22వ లా కమిషన్ నివేదికను సమర్పించకుండానే రద్దయిందని, 2024 సెప్టెంబర్ 3న 23వ లా కమిషన్ ఏర్పాటయినప్పటికీ దాని వివరాలు ఇప్పటికీ వెల్లడి చేయలేదని జైరాం అన్నారు. రాజ్యాంగంలోని 44వ అధికరణలో ఉమ్మడి పౌర స్మృతిని ప్రస్తావించినప్పటికీ వివిధ రాష్ట్రాలు ప్రతిపాదించిన ఉమ్మడి పౌరస్మృతి అంశాలు ఆమోదం పొందలేకపోయాయని, దేశవ్యాప్తంగా దీనిపై చర్చ జరిగితేనే ఆమోద యోగ్యమైన ఉమ్మడి పౌర స్మృతి రూపుదిద్దుకుంటుందని జైరాం రమేశ్ తెలిపారు. కాగా బిజెపి పాలిత ఉత్తరాఖండ్ ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా అవతరించింది. దీని ప్రకారం మతాల ప్రమేయం లేకుండా ప్రతి పౌరుడికి వివాహం, విడాకులు, ఆస్తుల తదితర అంశాలలో సమాన హక్కులు ఉంటాయి.


## బిల్లులకు గవర్నర్ ఆమోదం నిలిపేసిన వివాదం కేసులో..

# సుప్రీంకోర్టు '8 కీలక ప్రశ్నలు' సిద్ధం



**న్యూఢిల్లీ :** శాసనసభ బిల్లులకు ఆమోదం నిలుపుదల చేయడంపై తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ ఆర్‌ఎన్.రవి మధ్య నెలకొన్న వివాదంపై తీర్పు కోసం గురువారం సుప్రీంకోర్టు ఎనిమిది కీలక ప్రశ్నలను రూపొందించింది. పాకెట్ వీటో భావనపై ప్రశ్నలు సహా గవర్నర్ అధికారం, విచక్షణపై ప్రశ్నలపై స్పష్టత తీసుకోనుంది. తమిళనాడు ప్రభుత్వం తరపున వాదిస్తున్న సీనియర్ అడ్వకేట్ రాకేష్ ద్వివేదీ వాదనలను విచారిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్ధివాలా, ఆర్.మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పోజర్లను (కీలక ప్రశ్నలు ) రూపొందించింది. విచారణ కొనసాగనున్న క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం రోజువారీ విచారణ ప్రారంభంలోనే ప్రశ్నల జాబితాను సిద్ధం చేసింది. అందులో మొదటిది... ఒక రాష్ట్రం శాసనసభ బిల్లును ఆమోదిం,దానిని గవర్నర్ ఆమోదం కోసం పంపించినప్పుడు, గవర్నర్ ఆమోదాన్ని నిలిపివేసినప్పుడు, శాసనసభ మళ్లీ బిల్లును ఆమోదించి తిరిగి గవర్నర్‌కు సమర్పించినప్పుడు తిరిగి గవర్నర్ దానిని మరోసారి నిలిపివేయడానికి అధికారం ఉన్నదా?. తదుపరి ప్రశ్న ఈవిధంగా ఉన్నది. రాష్ట్రపతికి బిల్లును సమర్పించే విచక్షణ నిర్దిష్ట అంశాలకు పరిమితం చేయబడుతుందా, నిర్దిష్ట నిర్దేశిత అంశాలకు మించి ఉందా?. మూడవది... తన సమ్మతిని తెలియజేయడానికి బదులు ప్రస్తుత బిల్లును రాష్ట్రపతికి పంపించాలన్న గవర్నర్ నిర్ణయం వేటిని పరిగణనలోనికి తీసుకున్నారు?. మరొకప్రశ్న... పాకెట్ వీటో కాన్సెప్ట్ ఏమిటి?. ఇది భారతదేశ రాజ్యాంగ పరిధిలో దీనికి స్థానం ఉన్నదా?. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200లో ఎలా వ్యవహరించాలన్న అంశంపై తాము వ్యవహరిస్తామని, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదా నిలిపివేసే అధికారాన్ని గవర్నర్‌కు ఇస్తుంది. 'మార్పులను సూచించేందుకు, పునర్విచారణ జరిపేందుకు బిల్లును తిరిగి శాసనసభకు పంపవచ్చు. ఒక బిల్లును గవర్నర్‌కు సమర్పించి, తిరిగి పున:పరిశీలనకు పంపించడం, గవర్నర్‌కు ఈ విధంగా మంజూరు చేయాల్సిన బాధ్యత ఉందా? ఆ బిల్లును శాసనసభ మళ్లీ ఆమోదించవచ్చా?'అని ధర్మాసనం అడిగింది.ఈఅంశంపై అటార్నీజనరల్ ఆర్.వెంకటరమణిని అదేరోజు విచారించనున్నది. తమిళనాడు ప్రభుత్వం గవర్నర్‌కు వ్యతిరేకంగా దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం విచారిస్తున్నది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తిరస్కరించడంతో తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య తీవ్రస్థాయి సుదీర్ఘ కాలం వివాదం చోటుచేసుకున్నది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# 'పరీక్ష పే చర్చ'లో దీపిక, మేరీకోమ్



**న్యూఢిల్లీ :** ప్రధాన నరేంద్ర మోదీ రూపకల్పన చేసిన 'పరీక్ష పే చర్చ' ఎనిమిదో వార్షిక కార్యక్రమం ఈసారి వినూత్నంగా ప్రసారం కానున్నది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తులైన నటి దీపిక పదుకొనె, బాక్సర్ మేరీ కోమ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. గతంలో టౌన్ హాల్‌లో రూపుదిద్దుకున్న కార్యక్రమం ఈసారి సుందర్ నర్సరీలో చిత్రీకరించనున్నారు. పరీక్షలకు సంబంధించిన అంశాలు, మానసిక ఒత్తిడిని ఎలా తట్టుకోవాలన్న అంశంపై ఎనిమిది ఎపిసోడ్‌లతో కూడిన ఈ కార్యక్రమం ఫిబ్రవరి 10న ప్రసారం కానున్నది. ఈ కార్యక్రమంలో పరీక్షలంటే భయపడేవారిని పరీక్షల యోధులుగా ఎలా రూపు దిద్దుకున్నారో ప్రసారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని దూరదర్శన్, స్వయం, స్వయం ప్రభ, పిఎంఓ యుట్యూబ్ చానల్, సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేయనున్నారు. ఈ సారి పరీక్ష పే చర్చ కార్యక్రమం వినూత్నంగా రూపుదిద్దుకున్నదని, ప్రముఖ వ్యక్తులు తమ అనుభవాలను ఇందులో పంచుకోనున్నారని, పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎలా ఎదుర్కోవాలో తెలుపనున్నట్టు ప్రధాని మోడి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దీపిక, మేరీ కోమ్‌తోపాటు పారాలింపిక్ స్వర్ణ విజేత అవని లేఖర, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుహాస్ యతిరాజ్, న్యూట్రిషియన్లు రుతుజ దివేకర్, సోనాలి సభెర్వాల్, నటీనటులు విక్రమ్ మాసె, భూమి పెడ్నేకర్, యూట్యూబర్ గౌరవ్ చౌదరి, రాధిక గుప్తె తమ అనుభాలను పంచుకోనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పోటీ పరీక్షలలో కృతార్థులైన 35మంది విద్యార్థులు కూడా పాల్గొననున్నట్టు అధికారులు తెలియజేశారు.

# 2027లో చంద్రయాన్ మిషన్ ప్రయోగం

## చంద్రయాన్-4కు భారత్ సన్నాహాలు

## సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్



**న్యూఢిల్లీ :** భారత్ చంద్రయాన్–4 సన్నాహాలు చేస్తోందని, 2027లో చంద్రయాన్ మిషన్‌ను ప్రయోగిస్తామని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ మిషన్‌లో చంద్రుడి నమూనాలను భూమిపైకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ మిషన్‌లో ఎల్‌వీఎం 3 రాకెట్ వేర్వేరు ప్రయోగాల తర్వాత.. ఐదు వేర్వేరు భాగాలను మూసుకువెళ్లి స్పేస్‌లో అనుసంధానించనున్నట్లు తెలిపారు. వీటిని భూమి కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. చంద్రుడి ఉపరితల నమూనాలను సేకరించి.. తిరిగి భూమికి చేరుకోవడమే చంద్రయాన్–4 మిషన్ లక్ష్యమని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ వచ్చే ఏడాది ప్రయోగించనున్నట్లు తెలిపారు. భారతీయ వ్యోమగాములను ప్రత్యేకం వాహనంలో భూమి దిగువ కక్ష్య వరకు పంపి.. తిరిగి సురక్షితంగా భూమిపైకి తీసుకురానున్నట్లు చెప్పారు. 2026లో భారత్ సముద్రయాన్ ప్రయోగం చేపడుతుందని ప్రకటించారు. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు జలాంతర్గామి ద్వారా ఆరువేల కిలోమీటర్ల లోతుకు వెళ్లి సముద్రగర్భంలో అన్వేషణ సాగిస్తారని జితేంద్రసింగ్ పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్‌తో సహా భారత్ పలు చారిత్రాత్మక మిషన్‌లకు రూపకల్పన చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సముద్రయాన్ అంశంపై ప్రసంగించిన విషయం తెలిసిందే. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ సముద్రయాన్ ద్వారా కీలకమైన ఖనిజాలు, అరుదైన లోహాలు, తెలియని సముద్రజీవ వైవిధ్యం గురించి సమాచారాన్ని సేకరిస్తామన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టు మానవరహిత మిషన్‌ను సైతం అదే ఏడాది నిర్వహిస్తామన్నారు. ఇందులో రోబోట్ వ్యోమ్ మిత్రను సైతం పంపనున్నట్లు పేర్కొన్నారు.

**స్పేస్ సెక్టార్‌లో సూపర్ పవర్‌గా భారత్**

ఇస్రోని 1969 స్థాపించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. కానీ, 1993 వరకు తొలి లాంచ్ ప్యాడ్‌ను స్థాపించేందుకు రెండు దశాబ్దాలకుపైగా సమయం పట్టిందన్నారు. రెండో లాంచ్ ప్యాడ్‌ను 2004లో నిర్మించారని, అందుకు మరో దశాబ్దం పట్టిందన్నారు. గత పదేళ్లకాలంలో భారత అంతరిక్ష రంగం మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు విస్తరించినట్లు పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం భారీ రాకెట్లను నింగిలోకి పంపేందుకు వీలుగా మూడో లాంచ్ పాడ్‌ను శ్రీహరికోటలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిన్న ఉపగ్రమాల కోసం తమిళనాడులోని టుటికోరిన్ జిల్లాలో కొత్త ప్రయోగ వేదిక కేంద్రాన్ని ఏర్పాటు చేసి.. శ్రీహరికోట స్పేస్ సెంటర్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. భారతదేశ స్పేస్ ఎకానమీ ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల విలు వ ఉందని.. వచ్చే దశాబ్దం నాటికి 44 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని తెలిపారు. ఇది ప్రపంచంలో భారత్ అంతరిక్ష రంగంలో ఓ సూపర్ పవర్‌గా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు.

# రెండు ట్రక్కు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

**ఉమారియా/భింద్ :** మధ్యప్రదేశ్‌లోని ఉమారియా, భింద్ జిల్లాల్లో గురువారం ట్రక్కులు ఢీకొన్న రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఉమారియాలో, ఉదయం 7.30 గంటల ప్రాంతంలో వేగంగా వస్తున్న రెండు ట్రక్కులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు మృతి చెందగా, మరొక వ్యక్తి గాయపడ్డారని ఒక అధికారి తెలిపారు. జాతీయ రహదారి 43పై, జిల్లా ప్రధాన కార్యాలయం నుండి 38 కి.మీ దూరంలో ఉన్న పాలి ప్రాంతంలోని ఒక తినుబండారం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. షాడోల్ నుండి ఉమారియాకు వెళ్తుండగా, మరొక ట్రక్కు వ్యతిరేక దిశలో వెళుతోంది. ఉమారియాకు వెళ్తున్న ట్రక్కులో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మరణించగా, మరొక వాహనంలో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి జిల్లా ఆసుపత్రిలో మరణించాడని పాలి పోలీ స్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మదన్ లాల్ మరాబి తెలిపారు. బాధితులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు.


# కుప్పకూలిన మిరాజ్ యుద్ధ విమానం

## పైలెట్లకు తీవ్ర గాయాలు..

**గ్వాలియర్ :** వైమానిక దళానికి చెందిన మిరాజ్ 2000 యుద్ధ విమానం ఆకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ప్రమాదం సమయంలో అందులో పైలెట్ సహా మొత్తం ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. మిరాజ్ 2000 సాధారణ శిక్షణ కోసం బయలుదేరినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఆర్మీ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయ చర్యలు చేపడుతున్నాయి. అయితే యుద్ధ విమానం కూలిపోవడానికి గల కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో చోటుచేసుకుంది. విమానం నేలను ఢీకొట్టడానికి ముందే పైలట్లు బయటకు దూకేశారని అంటున్నారు. వారికి గాయాలు కాగా, ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. సాంకేతిక కారణాల వల్లే విమానం కూలిపోయిందని పలువురు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై వైమానిక దళం, జిల్లా పరిపాలన అధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆ చుట్టుపక్కల ప్రాంతాలను పర్యవేక్షించారు. ఆ ప్రదేశం నుంచి శిథిలాలను తొలగించే పని జరుగుతోంది. ఈ ప్రమాదం తర్వాత వైమానిక దళ అధికారులు మొత్తం ఈ ఘటన గురించి పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. మిరాజ్ 2000 ప్రమాదం వైమానిక దళానికి ఆందోళన కలిగించే విషయమని చెప్పవచ్చు. ఈ ఘటన వెనుక గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో సైన్యం విచారణకు ఆదేశించింది.

# ట్రాక్టర్ నడిపేందుకు స్కూల్ ఎగవేత

## బోల్తా పడి ముగ్గురు మైనర్లు మృతి..



**రాయ్‌పూర్ :** నలుగురు మైనర్లు స్కూల్ ఎగ్గొట్టి చేసిన పనికి వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. ఆ క్రమంలో ట్రాక్టర్ నడిపేందుకు యువకులు బయటకు వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో ముగ్గురు మైనర్లు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ ధమ్‌తారి జిల్లా కురుద్ సమీపంలో చోటుచేసుకుంది. ఈ దుర్ఘటన ధమ్‌తారి జిల్లా కురుద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చర్రా గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు ఈ ప్రమాదం గురించి గురువారం సమాచారం అందించారు. ఆ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా 16 ఏళ్ల ప్రీతమ్ చంద్రకర్ ఉన్నారని, మయాంక్ ధ్రువ్, హోనేంద్ర సాహు, గాయపడ్డ బాలుడు అర్జున్ యాదవ్ ఈ ప్రమాదంలో భాగస్వాములయ్యారని తెలిపారు. మృతులలో 16 ఏళ్ల ప్రీతమ్ చంద్రకర్, 16 ఏళ్ల మయాంక్ ధ్రువ్, 14 ఏళ్ల హోనేంద్ర సాహు చర్రా గ్రామానికి చెందినవారు. గాయపడిన బాలుడు అర్జున్ యాదవ్ బనగర్ గ్రామానికి చెందిన వారని పేర్కొన్నారు. ఈ నలుగురు బాలురు గురువారం స్కూలుకు వెళ్లకుండా ట్రాక్టర్ నడిపేందుకు వెళ్లిన క్రమంలో ప్రమాదం జరిగింది. సమాచారం ప్రకారం ప్రీతమ్ చంద్రకర్ తన ఇంటి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను తీసుకుని మిగతా ముగ్గురు బాలుళ్లతో కలిసి కురుద్ గ్రామానికి వెళ్లారు. ఆ క్రమంలో తిరిగి వస్తున్నప్పుడు ట్రాక్టర్ నడిపిస్తున్న ప్రీతమ్ చంద్రకర్ ట్రాక్టర్‌పై నియంత్రణ కోల్పోయాడు. ఆ క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి, ముగ్గురు బాలురు క్రింద చిక్కుకుని అక్కడికక్కడే మరణించారు. గాయపడిన అర్జున్ యాదవ్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించగా, అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం పట్ల స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

## మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు వ్యాపారస్తులు సహకరించాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్‌కు వ్యాపారస్తులు సహకరించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్‌లో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ మినీ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. నూతనంగా ఎఐటియుసిలో చేరిన వారికి మినీ ట్రాన్స్‌పోర్ట్ భద్రాద్రి జిల్లా సమితి పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బుక్య దస్రు, సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంతరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించండి

ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు డిమాండ్




**ప్రజాపక్షం/కల్లూరు :** ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు గత నాలుగు నెలలుగా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆసుపత్రి కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించి తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యశాల హెడ్‌నర్స్ రమాదేవి, యుడిసి మధుకు వినతి పత్రం అందజేశారు. ఆసుపత్రి కార్మికుల గౌరవాధ్యక్షుడు, జిల్లా ఎఐటియుసి ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో నాలుగు నెలల నుంచి వేతనాలు అందక పేద కుటుంబాలకు చెందిన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను అడగగా ఏడు నెలలుగా బిల్లులు రావడంలేదని సమాధానమిస్తున్నారని, వేతనాలు ఇచ్చేవరకు ప్రతి రోజు గంట పాటు నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.కార్యక్రమంలో ఎఐటియుసి మండల నాయకులు దామాల దయాకర్ రావు, కార్మికులు వంశి, సురేంద్ర, వి. నాగమణి, కోటేశ్వరి, బి. నాగమణి, లక్ష్మి ప్రసన్నలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

సిపిఐ రాష్ట్రసమితి సభ్యుడు కొండపర్తి గోవిందరావు



**ప్రజాపక్షం/చింతకాని :** స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు సూచించారు. బుధవారం రాత్రి కొదుమూరు, రాఘవాపురం గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో కొండపర్తి మాట్లాడుతూ పార్టీ బలానికి అనుగుణంగా పట్టు కోల్పోకుండా గత ఫలితాలతో పాటు మరిన్ని స్థానాలు గెలుపొందేందుకు కార్యాచరణ తయారు చేసుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు కూచిపుడి రవి, నాయకులు సింగారపు సత్యనారాయణ,కొల్లి సీతయ్య, నక్కనబోయిన కృష్ణ, నారపోగు నాగార్జున, చల్లగుండ వెంకటి, వీరబాబు, సారిక వెంకటేశ్వర్లు, జె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు విశ్వనాథం డిమాండ్



**ప్రజాపక్షం/పాల్వంచ :** అర్హులైన పేదలందరికీ షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కారెగట్టు, సారకల్లు గ్రామాలలో శాఖ మహాసభలు నిర్వహించారు. సమావేశంలో విశ్వనాథం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు గ్యారెంటీ అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ప్రకటించిన అర్హత జాబితాలో సాంకేతిక కారణాలతో అనేక మంది పేదల పేర్లు రాలేదన్నారు. అధికార యంత్రాంగం నిష్పక్షికతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా సర్వే చేపట్టాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలన్నారు. అనంతరం కారెగట్టు సిపిఐ నూతన శాఖ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నిమ్మల రాం బాబు, చెన్నయ్య, కొంగర అప్పారావు, ఉంద్రాతి రవి, నురా గురుమూర్తి, ఒకోరం చంద్రశేఖర్, షణ్ముఖచారి, నల్ల మోసు, నరసింహారావు, కొత్త సురేష్ రెడ్డి, వాసం యాదగిరి, సర్ప శ్రీకాంత్, మడివి విజయ్, వెంకన్న పాల్గొన్నారు.

## తునికాకు టెండర్లు పిలిచి, ప్రూనింగ్ పనులు చేపట్టాలి : సిపిఐ



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజనుల రెండో పంటైన తునికాకు టెండర్లను ప్రభుత్వం వెంటనే పిలిచి, ప్రూనింగ్ పనులు చేపట్టాలని సిపిఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత గిరిజనులు, ఆదివాసీలు తునికాకు సేకరణకు మొగ్గుచూపుతారన్నారు. అలాంటి తునికాకు సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నేటికి టెండర్లు పిలువలేదని, ఏజెన్సీ ప్రాంతంలో నాణ్యమైన తునికాకు లభ్యమవుతుందని, ప్రూనింగ్ పనులు ఆలస్యమైతే ఆకు నాణ్యత లోపించే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తునికాకు సేకరణపై దృష్టి సారించి టెండర్లు పిలిచి వెంటనే ప్రూనింగ్ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మారెడ్డి శివాజీ, సీతారామరాజు, వెంకన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు స్వాంతన కలిగించేలా వైద్యసేవలు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంపూర్ణ స్వస్థత ఆరోగ్యం ప్రతిఒక్కరి హక్కు అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రోగులకు స్వాంతన కలిగించేలా వైద్యసేవలు అందించాలని ఆయన తెలిపారు. గురువారం ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్‌సిడి క్లినిక్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అనంతరం ఆసుపత్రిలో వైద్యసేవలు అందించే విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. అవుట్ పేషంట్ వివరాలు, సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వాలన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ ఆసుపత్రి మొత్తం తిరిగి భవనాలను పరిశీలించారు. కావాల్సిన వసతులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ కళావతి బాయి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆర్ఎంఒ రాంబాబు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్ పాల్గొన్నారు.



### ఫుట్‌బాల్ మైదానంలో వసతుల కల్పన

ఫుట్‌బాల్ మైదానంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం రఘునాథపాలెం మండలం వివి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలోని ఫుట్‌బాల్ మైదానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేసుకునేందుకు వీలుగా సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి, యువజన సంక్షేమ అధికారి సునీల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, కోచ్ ఆదర్శ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### ఇవిఎం గోడౌన్ తనిఖీ

నెల వారి తనిఖీల్లో భాగంగా కలెక్టర్ కలెక్టరేట్‌లోని ఇవిఎం గోడౌన్‌ను గురువారం తనిఖీ చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు భద్రపర్చిన గది, మొదటి అంతస్తులో భద్రపర్చిన వివి ప్యాట్ గది సీల్‌లను, గోడౌన్ వద్ద బందోబస్తును పరిశీలించారు. భద్రతా సిబ్బందితో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఎన్నికల విభాగ పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారి ఆయన వెంట ఉన్నారు.



### ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

భవన నిర్మాణ సామాగ్రిని రహదారులపై ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ గురువారం తెలిపారు. మున్సిపల్ అధికారులు వీటిపై చట్ట రీత్యా చర్యలు చేపడట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ప్రాంతీయ ఇంటిలిజెన్స్ అధికారి రామోజీ రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ డిఎస్‌పి యు.వెంకన్నబాబు, ఇన్‌స్పెక్టర్లు సిహెచ్ శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినిలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను సిఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలైన వి.వెంకటాయపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినిలు సిఎం కప్ ఫుట్‌బాల్ పోటీల్లో విజయం సాధించడం, ఖేలో ఇండియా స్థాయిలో అండర్ 13,15,17 విభాగాల్లో రన్నర్స్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో సైతం రాణించాలన్నారు. కార్యక్రమంలో కోచ్ ఆదర్శ్‌కుమార్ పాల్గొన్నారు.



## 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఒసి కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతి గృహాలలో ప్రతి విద్యార్థికి మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రలతో పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమధ్యం నివారించవచ్చన్నారు. జిల్లాలో 336,212 మంది ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు గల వారు ఉన్నారని, వారందరికీ విద్యాశాఖ అధికారులు, ఎఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంగా పని చేసి జిల్లాలోని విద్యార్థులందరికీ మాత్రలను అందివ్వాలన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు వేసే ప్రదేశంలో తగినంత తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు అల్బెండజోల్ మాత్రల ఉపయోగాలపై కళా జాతర బృందాలు, మహిళా సమాఖ్యల ద్వారా అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 10వ తేదీన మాత్రలు తీసుకొని వారికి 17వ తేదీన మాత్రలు అందించాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్‌పి సిఇఒ నాగలక్ష్మి, వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, డిసిహెచ్‌ఒ రవిబాబు, మహిళా, శిశు వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూయ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

జిల్లా ఎస్పి రోహిత్ రాజు

ఘనంగా ప్రారంభమైన జిల్లా పోలీస్ వార్షిక క్రీడలు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** విధుల నిర్వహణలో ఒత్తిడి నివారణకు, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎస్పి రోహిత్ రాజు అన్నారు. గురువారం హేమచంద్రపురంలోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీసుల యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎస్పి రోహిత్ రాజు ముఖ్యఅతిధిగా హాజరై స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు.జిల్లా పోలీస్ శాఖలోని విభాగాల వారీగా చేసిన పరేడ్‌ను తిలకించారు. యానిమల్ స్పోర్ట్స్ మీట్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్పి రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్యం తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారన్నారు. విధుల నిర్వహణలో భాగంగా నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఆటవిడుపుగా, మానసికొల్లాసం కొరకు క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మూడురోజుల పాటు జరగనున్న క్రీడలలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొనాలని కోరారు. క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్, 5 కిలోమీటర్ల పరుగు పందెం వంటి క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడలలో గెలుపోటములు సహజమని క్రీడాకారులందరూ స్పోర్టింగ్ స్పిరిట్‌తో ఆడాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి మానసికోల్లాసానికి ఏర్పాటు చేసిన ఈ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పోర్ట్స్ మీట్ పేరెడ్ ఏర్పాట్లను చేసిన అధికారులను అభినందించారు. అనంతరం హోంగార్డ్స్ టీం పాల్వంచ సబ్ డివిజన్ మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్‌ను టాస్ వేసి ఎస్పి ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయ టీం, ఇల్లందు సబ్ డివిజన్ టీంల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను తిలకించారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సహకార సంఘాలకు ప్రత్యేక పాలన తప్పదా ?

పాలకవర్గాల ఎన్నికలపై కానరాని స్పష్టత




**ప్రజాపక్షం/చింతకాని :** సహకార సంఘ పాలకవర్గాల పదవీ కాలం మరో ఎనిమిది రోజుల్లో ముగియనుంది. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్ణయానికి రాలేదు. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది.ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఊసేలేదు.2020 ఫిబ్రవరి 15న ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత రోజు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ,జిల్లా మార్కెటింగ్ సొసైటీల పాలకవర్గాల సభ్యులను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం సైతం ఈనెల 15న ముగియనుంది.

**రెండు నుంచి మూడు సంఘాలకు...**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 23 సంఘాలకు ఒక మండలస్థాయి అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. కొత్త జిల్లాల స్థాయిలో సహకార బ్యాంకుల విస్తరణ ఉండకపోవచ్చని తెలుస్తుంది.ఉమ్మడి జిల్లా పరిధిలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడినపుడు ఆయా జిల్లా స్థాయిలో సహకార బ్యాంకులను విస్తరించాలని ప్రభుత్వం సూచించింది.

**బ్యాంకుల విస్తరణ ఏమైనట్టు...** జిల్లా సహకార బ్యాంకులు విస్తరించాలనే ప్రతిపాదనలు పంపినా..నేటికి స్పందన రాలేదని తెలుస్తోంది. రైతులు దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాలు పొందే విషయంలో ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఈక్రమంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కొత్తగా 47 సంఘాలు...** ఉమ్మడి జిల్లా పరిధిలో 101 సహకార సంఘాలకు తోడుగా ఖమ్మంజిల్లాలో మరో 47 సహకారసంఘాలు ఏర్పాటు చేయాలని సహకార అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిని ఏర్పాటు చేసిన తర్వాతే ఎన్నికలు జరగవచ్చనే ప్రచారం జరుగుతోంది.

**ఆదేశాలు రావాల్సి ఉంది : జి.గంగాధర్ జిల్లా సహకార అధికారి**

సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం మరో 8 రోజుల్లో ముగియనుంది. వారి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించే విషయంలో ఆదేశాలు రాలేదు. అలాగే కొత్త సంఘాల ఏర్పాటు విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు చేయలేదు. ఎన్నికల విషయంలో ఆదేశాలు వస్తేనే ప్రక్రియ ప్రారంభిస్తాం.

**ఉమ్మడి జిల్లాలో వివరాలు...** జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 1, జిల్లా మార్కెటింగ్ సొసైటీ 1, పిఏసీఎస్ సంఘాలు 101.

## మొక్కుబడిగా అధికారుల సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వరుని సన్నిధిలో అన్నిశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం గురువారం మొక్కుబడిగా సాగింది. ఈనెల 25నుంచి ప్రారంభ కానున్న జాతరపై ఆర్‌డిఒ నర్సింహారావు అధ్యక్షతన జాతర విజయవంతపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ప్రతి ఏటలాగానే ఏ ఏ శాఖల అధికారులు ఎటువంటి విధులు నిర్వహించాలో ఆదేశించారు. కానీ అధికారులు మాత్రం జాతర పట్ల పెద్ద పట్టింపులేని విధంగా నడుచుకున్నారు. ఆ శాఖల ఉన్నత స్థాయి అధికారులకు బదులుగా అసిస్టెంట్లను పంపించి మమ అనిపించేశారు. ఇందులో రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి ఉన్నత స్థాయి అధికారులు హాజరయ్యి, చేపట్టబోవు చర్యలను గురించి వివరించారు. అలాగే ఆలయ ఇఒ సైతం జాతరతో తనకేం సబంధం లేదన్నట్టు..అంత అధికారులదే బాధ్యత అనేలా వ్యవహరించారు. ప్రతి ఏటా చేపట్టే పనులను ఈ సారి అధికారులే చూసుకోవాలంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో జాతర ఏ విధంగా జరగబోతుందన్న సందేహాలు రేకెత్తిస్తున్నాయనే చెప్పాలి. సమావేశంలో తహసీల్దార్ బి.రాంప్రసాద్, సిఐ ముష్క రాజు, ఎస్ఐ అనిల్, ఇరిగేషన్ డిఇ మన్మదరావు, ఏఈ అరుణ, ఆర్అండ్‌బి డిఇ చంద్రదర్, ఎంపిఒ శ్రీదేవి, పల్లెగూడెం ఎఇ రామారావు, ఎఒ ఉమానాగేష్, ఆర్ఐ రవికాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు బోడ వెంకన్న, తేజావత్ బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తప్పని రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఎఆర్ ఎస్ఐ ఆత్మహత్య



**ప్రజాపక్షం/మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారంలో ఎఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. నర్సయ్య భార్య సునీత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తుంది. భార్య భర్తల మధ్య నెలకొన్న గోడవల వల్లే నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని బంధువుల ఆరోపిస్తున్నారు. భార్యపై చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు కోరారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# ‘కట్టప్ప’పై సర్కార్ కన్నెర్ర

సంచలనం రేపిన ‘ప్రజాపక్షం’ కథనం

స్పందించిన ఎన్ఎస్‌పి అధికారులు

కాలువలు కాపాడాలని కోరుతున్న రైతులు

ప్రజాపక్షం ఎఫెక్ట్



మల్లుపల్లిలో కబ్జాకు గురైన మేజర్ కాలువకట్ట

**ప్రజాపక్షం/కొణిజర్ల :**మల్లుపల్లిలో కాలువకట్టను దర్జాగా కబ్జాచేసి తనపొలంలో కలుపుకున్న కట్టప్పపై అధికారులు కన్నెర్ర చేశారు. వంద ఎకరాల ఆయకట్టుకు ఏకైక మార్గమయిన కాలువ కట్టను అన్యాక్రాంతం ఆయిన తీరుపై అధికారులు సీరియస్ అయ్యారు. ‘కాలువపై కట్టప్ప’ శీర్షికతో గురువారం ‘ప్రజాపక్షం’ దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనం సంచలనం రేపింది. అటు అధికార యంత్రాంగంతోపాటు ఇటు రైతులు, పాఠకుల్లో చర్చకు దారితీసింది. నీటిపారుదలశాఖ క్షేత్రస్థాయి అధికారినుంచి ఉన్నతాధికారుల వరకు ఈకథనం చేరింది. జిల్లా కలెక్టర్ మిజుమ్ముల్‌ఖాన్ సైతం ‘ప్రజాపక్షం’ కథనంపై ఎన్ఎస్‌పి అధికారులను ఆరాతీసినట్లు సమాచారం. కట్టను ఆక్రమించిన రైతుతీరుపై ఎన్నెస్పీ జిల్లా అధికారి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. నలుగురు నడిచే కాలువకట్టను ఆక్రమించడానికి ఆరైతుకు ఎలాంటి అధికారం లేదని, ఆక్రమణ తొలగించాలని ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. జిల్లా అధికార యంత్రాంగంలో గుబులురేపిన ప్రజాపక్షం ప్రత్యేక కథనంతో ఆయకట్టు రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాలువ కట్టపై వాహనాలు వెళ్లేందుకు తమ పంటను తరలించకుండా చేసిన నిర్వాకంపై ప్రజాపక్షంలో కథనం రూపంలో వెలువడటంతో ఆ రైతుల కష్టాల ను కళ్లకు కట్టినట్లయింది. అధికారులతో మొరపెట్టుకున్నా స్పందించకపోవడంతో ప్రజాపక్షంలో ప్రచురితమైన సంచలనాత్మక కథనానికి ఆయకట్టు రైతులు జేజేలు పలికారు. కాగా రైతు ఆక్రమించిన తీరును పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికందించేందుకు ఎన్నెస్పీ క్షేత్రస్థాయి సిబ్బంది సమాయత్తం అయినట్లు సమాచారం.

### ఆక్రమణలకు గురవుతోన్న పంటకాలువలు

సీతారాంబంజర్ మేజర్ కాలువ 50 అడుగుల వెడల్పుతో 5.800 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ మేజర్ కాలువకట్ట పక్కన ఉన్న రైతులు కట్ట ను ఆక్రమించుకుంటున్నారు. పలుకుబడి కలిగిన కొందరు నాయకులు కట్టను ఆక్రమించుకోవడంతో మిగిలిన రైతులు కూడా ఆక్రమించేందుకు ఉపక్రమించారు. దీంతో కాలువ కట్ట కుంచించుకుపోతుంది. 0.600 కిలోమీటర్లతో ఒక మైనర్ కాలువ 1.830 కిలోమీటర్లు సుమారు 30 అడుగుల వెడల్పుతో ఉన్న మరో మైనర్ కాలువ రెండు మైనర్ కాలువలను సైతం ఆక్రమించుకున్నారు. వీటితోపాటు పంటకాలువలను సైతం ఆక్రమించుకోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువ కట్టలను, పంట కాలువలను ఆక్రమించుకోవడంతోపైన ఆయకట్టు ఉన్న రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. వీటి ఆధునీకరణ పనుల కోసం 2005–06లో రూ.1.23 కోట్లు నిధులు ఖర్చుచేశారు. కోట్ల రూపాయల ఖర్చుతో కాలువలను ఆధునీకరణ చేస్తే కొంతమంది స్వార్థపరులు వీటికి తూట్లు పొడుస్తు యధేచ్చగా ఆక్రమించుకుంటున్నారు. నీటిపారుదల అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడటంతో ఆక్రమణలు జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఎన్ఎస్‌పి అధికారులు పర్యవేక్షణ జరిపి కాలువ కట్టను, పంటకాలువలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని, నీటిపారుదల ఆస్తులను కాపాడి తమకు న్యాయం చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఆక్రమణలపై దృష్టిసారించి ఆక్రమణదారులను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

# ప్రజలను రెచ్చగొట్టేలా బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలను రెచ్చగొట్టేలా బిఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూర్య సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగజారుడు రాజకీయాలను బిఆర్ఎస్ మానుకోవాలని హితవు పలికారు. గాంధీ భవన్‌లో మంత్రి సీతక్క సమక్షంలో బోథ్ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ నేతృత్వంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు మాజీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సీనియర్ నేత మధుసూదనచారితో కలిసి మంత్రి సీతక్క కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతు భరోసా నిధులను రైతు ఖాతాల్లో జమ చేస్తున్నామని, కొన్ని యూట్యూబ్ ఛానళ్లలలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. అబద్ధాలు ఎంతో కాలం నిలవవన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసాన్నారు. అధికారం పోగానే బిఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సమస్యలకు బిఆర్ఎస్ కారణమన్నారు. పదేళ్లు పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో సమస్యలు తిష్ట వేశాయన్నారు. బిఆర్ఎస్సే రాష్ట్రానికి అతిపెద్ద సమస్యగా మారిందని విమర్శించారు. తప్పుడు లెక్కలు చెప్పటంలో బిఆర్ఎస్‌ను దుయ్యబట్టారు. 1200 మంది అమరవీరులు చనిపోయారని చెప్పి, తెలంగాణ వచ్చిన తర్వాత 400 మందికి కుదించారని గుర్తు చేశారు. అధికారులు శాస్త్రీయంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేసి కులాల లెక్కలను తేల్చారన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుంటే తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. అణగారిన వర్గాల దశాబ్దాల సమస్యను సిఎం రేవంత్ రెడ్డి పరిష్కారం చూపారని చెప్పారు. బిజెపి, బిఆర్ఎస్ స్పాన్సర్ లీడర్స్ టార్గెట్ చేసి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అబద్దానికి పుట్టిందే బిఆర్ఎస్ అని, అబద్దానికి అంబాసిడర్ బిఆర్ఎస్ మంత్రి సీతక్క మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతుంటే బిఆర్ఎస్ కుట్రలు చేస్తోందన్నారు. బిఆర్ఎస్‌కు కుల గణన చేపట్టటం చేతకాలేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ చేయలేదన్నారు. లిమ్కా బుక్ రికార్డు కోసం ఒక రోజు సర్వేను హడావుడిగా చేశారని, ఆ సర్వే నివేదికలో నిజం లేదు కాబట్టే అసెంబ్లీలో పెట్టలేదన్నారు. చట్టబద్ధత కల్పించలేదన్నారు. ఇంటింటికి వెళ్లి పకడ్బందీగా చేసిన సర్వేపై ఇప్పుడు కూనిరాగాలు తీస్తున్నారని విమర్శించారు. సర్వేలో ఎక్కడా లోపం లేదని, బిసి జనాభా 56.33 శాతంగా వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ పాలన నచ్చి ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. సంక్షేమ రాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఇంకా తమకు నాలుగు సంవత్సరాల సమయం ఉందని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. మీకు(బిఆర్ఎస్)కు 10 ఏళ్లు అధికారం అప్పజెప్పిన మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పారదర్శకంగా గ్రామ సభలోనే అర్హులని ఎంపిక చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

# కలకలం రేపుతున్న ఎస్ఐల వరుస ఆత్మహత్యలు

కౌన్సిలింగ్ ఏకైక మార్గం : డిజిపి జితేందర్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి వరకు జరుగుతున్న వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఆత్మహత్యలకు కారణాలు వేరు వేరు అయినా పోలీసు శాఖలో ఇలాంటివి జరగడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సమస్యలతో బాధపడుతూ సతమతమవుతున్న ఇలాంటి అధికారులను గుర్తించి వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని డిజిపి డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషనర్‌లకు సూచనలు జారీ చేశారు. ఇటీవల ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ రమేష్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడగా, ఆ తరువాత కామారెడ్డి జిల్లాలో ఓ ఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు చెరువులో శవమై తేలారు. ఆ వెంటనే ఒకే రోజు వేర్వేరు ఘటనల్లో ముగ్గురు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడగా ఒకరు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. మెదక్ జిల్లా కొల్చారంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకుని కానిస్టేబుల్ సాయి సూసైడ్ చేసుకున్నాడు. ఇక తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సువర్ణపాక లక్ష్మి నర్సు (36) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలా పోలీసు శాఖలో కారణాలు ఎవైనా వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలు అధికారులను కలవరానికి గురిచేస్తున్నాయి. అయితే ఆత్మహత్యకు గల కారణాలపై ఎవరు కూడా సూసైడ్ నోట్‌లు రాయకపోవడం ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం. ఆత్మహత్యకు పాల్పడే వారు కారణాలను తప్పకుండా తెలియజేసే క్రమంలో సూసైడ్ నోట్ రాస్తారు. అయితే పోలీసు ఆత్మహత్యలకు పాల్పడిన వారు సూసైడ్ నోట్‌లు రాయకపోవడం గమనార్హం. ఇంటి సమస్యలు, ఆర్థిక సమస్యలు, అప్పుల సమస్యలకు తోడు పోలీసు శాఖలో పనిఒత్తిడి కారణంగానే ఆత్మహత్యలకు తెగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారిని ఉన్నతాధికారులు గుర్తించి వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చేందుకు జిల్లాల వారీగా అధికారులు కసరత్తు చేపడుతున్నారు. అయితే పోలీసు శాఖలో ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు ధైర్యంగా అధికారుల ముందుకు వచ్చి తమ సమస్యలను వివరిస్తారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇలాంటి వారిని ఎలా గుర్తించాలి అనే విషయంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. తోటి సిబ్బంది సహకారంతో వారి సమస్యలను తెలుసుకుని వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇప్పించాలని అధికారులు ఆలోచిస్తున్నారు.



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్.

## నిషేధిత లిస్ట్‌లో ఆస్తుల్ని చేర్చే అధికారం లేదు

ప్రభుత్వానికి స్పష్టం చేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. బ్యాన్డ్ లిస్ట్‌లో ప్రైవేట్ భూముల్ని చేర్చే అధికారులకు లేదు. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎలో గైడ్‌లైన్స్ వ్యతిరేకంగా చేసేందుకు వీల్లేదు. ఆ గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘించి చేస్తే అవి చెల్లుబాటు కాబోవు. రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఎలో పేర్కొన్న పరిధిలోని అంశాల్లోకి వస్తే తప్ప ప్రభుత్వానికి ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడానికి వీల్లేదని చెప్పింది. ఇదే అంశంపై వింజమూరి రాజగోపాలాచారి వర్సెస్ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి కేసులో హైకోర్టు ఫుల్ బెంచ్ తీర్పు చెప్పిందని గుర్తు చేసింది. రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఎ(1)లోని ఎ నుంచి డి వరకు ఉన్న క్లాజుల ప్రకారం నిషేధిత జాబితాలోని ఆస్తులను మాత్రమే రిజిస్ట్రేషన్లు చేయడానికి వీల్లేదని చెప్పింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో సర్వే నెం 132/సి/బి/1/2లోని 1.26 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు వెళితే రిజిస్ట్రార్ నిరాకరించారం టూ ఎస్. వెంకటసుబ్బయ్య వేసిన పిటిషన్ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారించారు.. పిటిషనర్‌కు చెందిన పత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ చట్టం, స్టాంపుల చట్టం ప్రకారం ఆ పత్రాలు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తమ తీర్పు ఉత్తర్వులు అందుకున్న నాలుగు వారాల్లోగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## కెటిఆర్‌కు ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌లకు గురువారం హైకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 12 వరకు అరెస్టు చేయాదని, కింది కోర్టు విచారణ హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రతివాదులైన పోలీసులు, ఫిర్యాదుదారు అయిన నీటిపారుదల శాఖ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వలి షేక్‌లను ఆదేశించింది. గత ఏడాది జూలై 26న మేడిగడ్డ బ్యారేజ్‌ను కేటీఆర్ ఇతర నాయకులు సందర్శించారు. అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారని మేడిగడ్డలోని వలిషేక్ ఫిర్యాదు చేశారు. దీనిపై నమోదైన కేసును కొట్టేయాలని కేటీఆర్ ఇతరులు వేసిన వ్యాజ్యాలను జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు.

## బిసిల రిజర్వేషన్లపై ప్రభుత్వ అస్పష్ట వైఖరి




వెంటనే సర్వేపై స్వతంత్ర కమిటీ వేయాలి

కులగణనపై ప్రజా కమిటీ ప్రతినిధుల డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కులగణన సర్వే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్ల విషయమై ప్రభుత్వ ప్రకటనలో అస్పష్టత నెలకొన్నదని కులగణనపై ప్రజా కమిటీ అభిప్రాయపడింది. తక్షణమే సర్వేపై స్వతంత్ర కమిషన్ లేదా కమిటీ వేసి సమగ్ర విచారణ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అప్పుడే డేటాలో పేర్కొన్న కులాల వారీ వివరాలు, తప్పిదాలు బయట పడతాయని అభిప్రాయపడింది. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ ఆధ్వర్యంలో దేవళ్ల సమ్మయ్య అధ్యక్షనత జరిగిన మీడియా సమావేశంలో కమిటీ ప్రతినిధులు, ప్రొఫెసర్లు కె.మురళీ మనోహర్, ఐ.తిరుమలి, ఎస్.సింహాద్రి మాట్లాడారు. కులగణన సర్వేలో బిసిలు, ఎస్‌సి, ఎస్‌టిల జనాభా తక్కువ చూపించి, ఒసిల జనాభా 21లక్షలకు పెరిగిందని చూపడం అన్యాయమన్నారు. గత సర్వేలతో పోల్చితే బిసిల జనాభా 51శాతం ఉంటే, ప్రస్తుతం 46శాతం అంటూ సర్వేలో తేల్చడం బిసిల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఏంటో అర్థమవుతుందని విమర్శించారు. అసలు డెడికేషన్ కమిషన్ రిపోర్టు రాక ముందే అసెంబ్లీలో దానిపై చర్చను ముగించడం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు లేనట్టేనని అర్థమవుతుందన్నారు. గతంలో ఉన్న 32శాతం రిజర్వేషన్లతో పోల్చుకుంటే ఈ సర్వే ప్రకారం బిసిలకు 16 శాతం రిజర్వేషన్లు వస్తాయని పేర్కొన్నారు. దీంతో వేలాది మంది బిసిలకు రాజకీయ సీట్ల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా డెడికేషన్ కమిషన్ నివేదిక తెప్పించుకొని జస్టిస్ ఈశ్వరయ్య సూచించినట్లు చర్యలు తీసుకుంటే రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

# సామాజిక సాధికారత సాధనలో దేశానికే తెలంగాణ ఆదర్శం

అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దేశంలోనే మొట్ట మొదటి సారిగా బిసి కుల గణన చేపట్టి దశబ్దాల కాలంగా వెనకబాటుకు గురైన వెనకబడిన తరగతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ అన్నారు. సామాజిక సాధికారత సాధనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శమన్నారు. హైదరాబాద్‌లోని వడ్డెర సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో గుంజ శ్రీనివాస్ మాట్లాడారు. కుల గణన చేపట్టడంలో ఇతర రాష్ట్రల ముఖ్యమంత్రి ఎవరూ చేయలేని సాహసాన్ని సిఎం రేవంత్‌రెడ్డి చేసారన్నారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కుల గణన వివరాలను అధికారికంగా ప్రకటించడమే కాకుండా దేశ వ్యాప్తంగా కుల గణనను చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదింపజేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం అభినందనీయమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. ఒకవేళ న్యాయ స్థానాల్లో చట్టపరమైన చిక్కులు ఎదురైతే ప్రస్తుతానికి పార్టీ పరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తామని అసెంబ్లీ వేదికగా ప్రకటించడం, బిసి సామాజిక వర్గాల వారి జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించడమే సిఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

## మార్చి 28న భవన నిర్మాణ కార్మికులు చలో ఢిల్లీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికల కోసం 'సంక్షేమ నిధిని' ఏర్పాటు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని మార్చి 28న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలిండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ (ఎఐసిబిసిడబ్ల్యు) జాతీయ డిప్యూటి ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ గౌడ్ గురువారం వెల్లడించారు. భవన కార్మికులకు అన్ని సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చలో ఢిల్లీ భాగంగా 'భవన కార్మికులు పార్లమెంట్ మార్చ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాల భవనకార్మికులు సంక్షేమ బోర్డులు విధిగా కార్పస్‌ఫండ్ వసూలు చేసేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని డిమాండ్ చేశారు. భవన కార్మికల బతుకులు జీవన స్థితిగతుల్లో మార్పులు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. భవన కార్మికుల సంక్షేమ బోర్డులను బలోపేతం చేయాలని సంక్షేమ బోర్డుల ద్వారా నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ చర్యలు చేపట్టాలని, సంక్షేమ బోర్డుల్లో ఎఐటియుసితోపాటు, కేంద్ర కార్మికుల సంఘాల ప్రతినిధులను నియమించాలని డిమాండ్ చేశారు. భవన కార్మికులకు ప్రతినెల 6వేల రూపాయల పెన్షన్ చెల్లించాలని, ఇ.ఎస్.ఐ. సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర చట్టం 9. రూల్స్ 281 (ఎ) ప్రకారం భవన కార్మికలకు పండుగల అలవెన్సులు చెల్లించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి సారధ్యంలోని ఎన్డియే ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, విధ్వంసం చేస్తందని ఆరోపించారు. కార్మికుల హక్కులపై ఉక్కు పాదం మోపుతూ, కార్మిక తిరోగమన విధానాలను అనుసరిస్తుందని ప్రవీణ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. 44 చట్టాలను 4 కోట్లకుగా మార్చి, కార్మిక చట్టాలు ధ్వంసం చేస్తుందని ధ్వజమెత్తారు. కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకోకుండా యూనియన్లు పెట్టుకునే హక్కులను లేకుండా బిజెపి ప్రభుత్వం చట్టాలను మార్చివేసిందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్, పెట్టుబడిదారులకు సంపన్న వర్గాలకు దోచి పెడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రవేటిపరం చేస్తూ, పెట్టుబడిలను ఉపసంహరిస్తూ కార్పొరేట్ శక్తులకు బిజెపి ప్రభుత్వం కొమ్ముకాస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమలు చేస్తున్న కార్మికుల తిరోగమన విధానాలు తిప్పి కొడుతూ, భవన కార్మికుల హక్కులు, డిమాండ్లు, చట్టాలు, అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రమాద వశాత్తు చనిపోయిన నిర్మాణ కార్మిక కుటుంబానికి రూ.10 లక్షలు, అంగ వైకల్యం చెందితే రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఆర్‌టిఐ కమిషనర్‌లను నియమించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఆర్‌టిఐ కమిషనర్‌లను నియమించాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎంపికైన గోపీనాథ్ కట్టెకోల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోపినాథ్‌ను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూరస్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతీ నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గోపీనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి,పందుల రాజు గౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీలను కేంద్రం ఆధీనంలోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల ద్వారా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మండిపడ్డారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి హక్కులను హరించకుండా,యుజిసి నూతన నిబంధనలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, నితిన్ గడ్కరీలను బిఆర్ఎస్ ప్రతినిధులతో కలిసి కెటిఆర్ గురువారం కలిశారు. యుజిసి నిబంధనలో చేయాల్సిన మార్పులపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు, జాతీయ రహదారి 365బిని వేములవాడ కోరుట్ల వరకు విస్తరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కెటిఆర్ లేఖ అందజేశారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దేశ పౌరులు విజయవంతంగా తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారంటే అందుకు ప్రధాన కారణం దేశంలోని యూనివర్సిటీలేనని, యూనివర్సిటీలో జరుగుతున్న పరిశోధనల ఫలితాల వల్లనే ఇది సాధ్యమైందని వివరించారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధితో పాటు అనేక ప్రైవేట్ విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, ఐఐటి వంటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాసంస్థలు కూడా ఉన్నాయన్నారు. దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్ర పరిధిలోని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకానికి ఏర్పాటు చేసే సర్చ్ కమిటీలకు బాధ్యతను, పూర్తిగా రాష్ట్ర గవర్నర్లకు అప్పగిస్తూ కేంద్రం తీసుకురానున్న యుజిసి నిబంధనలపైన ధర్మేంద్ర ప్రధాన్‌కు కూలంకషంగా వివరించామని కెటిఆర్ తెలిపారు. నో సూటబుల్ క్యాండిడేట్ ఫౌండ్ అనే ఒక నిబంధనను తీసుకురావడంతో ఎస్‌సి,ఎస్‌టి, బిసిలకు ఉన్న రిజర్వేషన్ల ప్రకారం కాకుండా, అభ్యర్థులు దొరకలేదనే సాకుతో ఆ ఉద్యోగాలను ఇతర కేటగిరీలకు చెందిన వారితో భర్తీ చేసే ప్రమాదం ఉన్నదని కెటిఆర్ వివరించారు. ఇది భారత రాజ్యాంగం, ఆయా సామాజిక వర్గాలకు ఇచ్చిన రాజ్యాంగబద్ధమైన హక్కులను హరించడమేనని కెటిఆర్ అన్నారు. యూనివర్సిటీ ఉద్యోగాల భర్తీలో కేవలం విద్యార్హతలపైన మాత్రమే కాకుండా, పరిశోధనలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు రెడీ



**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వడానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. కమిషన్ ప్రకారం బిసిలకు ఏ విధంగా రిజర్వేషన్ అందించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. పదేళ్లు పరిపాలన చేసిన కెసిఆర్ ఏనాడు బిసి, ఎస్‌సి, ఎస్‌టిల గురించి ఆలోచన చేయలేదన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఎక్స్ వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. కుల గణన విజయం కొందరు ప్రతిపక్ష నాయకులకు నచ్చట్లేదని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ మండిపడ్డారు. గత ప్రభుత్వంలో సకల జనుల సర్వే రిపోర్టు బయటకు పెట్టలేదని ఆరోపించారు. మూడు నెలల్లోపు సర్వే రిపోర్టును ప్రజల ముందు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదని కొనియాడారు. తట్టుకోలేక బిసిలకు న్యాయం చేయడంలో వెనుకబడ్డామని ప్రతిపక్షాలు ఆతృతతో ప్రకటనలు చేస్తున్నాయని అన్నారు. మరోవైపు కులగణన సర్వేను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా చేపట్టిందో అదే తీరులో బిజెపి కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. కానీ తెలంగాణలో ముస్లిం జనాభా పెరుగుతుంది. ముస్లింలకు అనుకూలంగా తెలంగాణ ప్రభుత్వం మారింది అని.. బిజెపి నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మరోవైపు ముస్లిం జనాభా బిసిల్లో పెరుగుతున్నదని, బిసిల్లో వారిది పది శాతానికి వచ్చిందన్నారు. కుల గణన సర్వేను బిఆర్ఎస్, బిజెపి పార్టీలు అబాసుపాలు చేస్తోందని మండిపడ్డారు.

# ప్రభుత్వ ఆలోచనల మేరకు పని చేయాలి

ఏ సమస్యలు ఉన్నా నేరుగా వచ్చి చెప్పండి ..

టిజిబిసిఎల్ డైరీ ఆవిష్కరణలో ఎక్సైజ్ కమిషనర్ చెవ్వూరు హరి కిరణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఆశిస్తున్న మేరకు ఉద్యోగులుగా అందరు పని చేయాల్సి ఉంటుందని, ఆదాయాన్ని సమకూర్చే శాఖలు అవసరమైనపుడు రెట్టింపుగా శ్రమ పడాల్సి ఉంటుందని తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరి కిరణ్ అన్నారు. గురువారం అబ్కారీ భవన్‌లో టిజిబిసిఎల్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి హజరయ్యారు. టిజిబిసిల్లో పని చేసే ఉద్యోగులంతా ఒకే తాటిపై నడవాలని కమిషనర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న 19 టిజిబిసిఎల్ డిపోలకు మద్యం దుకాణాలు, బార్లు సమానంగా ఉండే విధంగా చర్యలు చేపడితే డిపోలపై భారం తగ్గుతుందని, ఈ మేరకు అవసరమైన ప్రణాళికలు తయారుచేయాలని కమిషనర్ కోరారు. తెలంగాణలో కొత్త డిపోల ఏర్పాటు, కొత్త నియామకాలు, ఇతర సమస్యలను పరిష్కరించడానికి అన్ని చర్యలు చేపడుతామని కమిషనర్ అన్నారు. బండికి రెండు చక్రాల రీతిలో ఎక్సైజ్, టిజిబిసిఎల్ కలిసి పని చేస్తు ఉండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని, మరింతగా కృషి చేసి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా పని చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. టిజిబిఎల్‌సిలో చాలా మంది ఉద్యోగులకు ప్రమోషన్లు, కొత్తగా రిక్రూట్‌మెంట్, కొత్త డిపోల ఏర్పాటు, డిపోల్లో ఆధునికీకరణ, డిపోలకు వాహనాల ఏర్పాటుకు కమిషనర్ సహకారం అందించాలని, 260 మంది ఉద్యోగులకు కేవలం 120 మంది ఉద్యోగులతో పని చేస్తున్నామని, ఐనా కూడ రూ.12 000 కోట్ల రూ.36 వేల కోట్లకు ఆదాయాన్ని పెంచడానికి మా వంతుగా కృషి చేస్తున్నామని టిజిబిసిఎల్ జనరల్ మేనేజర్ అబ్రహం కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్, డైరెక్టర్‌తో పాటు అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్ ఖురేషి, టిజిబిసిఎల్ జనరల్ మేనేజర్లు అబ్రహం, కాశీనాథ్, తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జీటి జీవన్‌తోపాటు ఇతర ఉద్యోగులు కలిసి డైరీని ఆవిష్కరించారు. టిజిబిసిఎల్ ఉద్యోగులు కమిషనర్, డైరెక్టర్‌కు శాలువతో సన్మానించి బొకేలు అందించారు. ఈ కార్యక్రమంలో టిజిబిసిఎల్ నాయకులు శ్యామ్, సురేందర్, వినోద్, మహిళ కార్యదర్శి అంశ, విజయలక్ష్మి, జాన్సీ, వాసవి దాత్తరమణ, శ్రీనివాస్, గురువయ్య, అర్జున్‌రావు, అరుణ్‌కుమార్, అనిల్, రమేష్‌తో పాటు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## నర్వ మండల రోడ్లకు మహర్దశ



**ప్రజాపక్షం/నర్వ:** మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి కృషితో రాంపూర్ గేట్ నుండి నర్వ మండల కేంద్రానికి బిటి రోడ్డు పనులకు 7 కిలోమీటర్లకు గాను, 4.55 కోట్ల నిధులను కేటాయింపులు జరిగాయి. మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో సంబంధిత పంచాయితీ రాజ్ డిఈఈ ఉపేందర్ రెడ్డి, ఎఈఈ ప్రవీణ్‌కుమార్, యంపిడిఓ శ్రీనివాస్ అధికారులు, రోడ్డు పనులకు సర్వే చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బీసం చెన్నయ్యసాగర్, డిసిసి జనరల్ సెక్రెటరీ నాగన్న , శ్రీనివాస్‌రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ నాగన్న, వివేకవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శరణప్ప, వెంకట్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు నరేష్, సద్దలి ఆంజనేయరెడ్డి, బైని గోపాల్, లంకాల మూర్తి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక ధోబీఘాట్లు నిర్మించాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రజకులకు మాడ్రన్‌దోభిగాట్లను నాగర్ కర్నూల్ జిల్లాకేంద్రంలో నిర్మించాలని తెలంగాణ రజకవృత్తిదారుల సమాఖ్య జిల్లా కన్వీనర్ కొట్రశేఖర్ అన్నారు. గురువారం తెలంగాణ రజకవృత్తిదారుల సమాఖ్య నాగర్‌కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గోడక్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్మాణపరంగా క్షేత్రస్థాయినుండి బలోపేతంచేసి రజకసోదరులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరపోరాటాలు రూపొందించుకోవాలని కోరారు. రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలన్నారు. గ్రామీణ మండలజిల్లా మున్సిపాలిటిస్థాయిలో దోబి గాట్లులేనిచోట దోబిగాట్లు కేటాయించి స్థలాలు మంజూరుచేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి విద్యాపరంగా ఉపాధిపరంగా రిజర్వేషన్ల సీట్లు పెంచాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న ఉచితవిద్యుత్ 250యూనిట్లనుంచి 500యూనిట్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో రజకవృత్తిదారుల సమైక్యజిల్లా నాయకులు కొట్ర బాలయ్య, కొట్రనరేష్, కొట్రభాస్కర్, కొట్రతారక్, ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, ఎఐటియూసి జిల్లానాయకులు శ్రీనివాసులు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశములశివకృష్ణ పాల్గొన్నారు.





## దళితుల భూముల జోలికొస్తే ఖబడ్దార్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** తాడూరు మండలకేంద్రంలోగల దళితుల భూముల జోలికొస్తే ఖబడ్దార్ అని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ హెచ్చరించారు. గురువారం జాతీయప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరివెంకటస్వామిలతోపాటు స్థానిక రైతులతో కలిసి నంద్యాలహైవే భూసేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడూర్ నంద్యాలహైవేకోసం జరిగే భూసేకరణలో వివక్షతతోనే బలవంతంగా దళితుల భూములులాక్కొవడం సిగ్గుచేటని, దళితులకు భూమే ఆత్మగౌరవంపైన దెబ్బకొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవలే అక్రమ భూసర్వేను అడ్డుకోవడానికి మనస్థాపంచెంది ఆత్మహత్యయత్నానికి పాల్పడిన కురుమూర్తి, శేఖర్‌లకు పరామర్శించారు. తాడూరు గ్రామంలో భూసర్వేకోసం పోలీస్‌బందోబస్తుమధ్య మూడుసార్లు సర్వే చేపట్టి ఆ సర్వే అగ్రవర్ణాల భూముల మీదుగా పోతున్నాయని భావించి తిరిగి నాల్గో సర్వే నిర్వహించి దళితుల భూములు కోల్పోయేలా రోడ్‌మ్యాప్ తయారు చేసి దళితుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారని అన్నారు. తక్షణమే భూసర్వేను నిలిపివేసి మొదటి మూడుసార్లుచేసిన సర్వేప్రకారమే భూసేకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి చింతసత్తి, నాయకులు గాజులభాస్కర్, కుర్మయ్య, చింతకురుమూర్తి, శేఖర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఊర్కొండ :** మండలపరిధిలోని ఇప్పపహాడ్ గ్రామానికిచెందిన దుబ్బబుచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు జననేత ముచర్ల జనార్దన్‌రెడ్డి వారి ఆత్మకు శాంతిచేకూరాలని సంతాపం తెలిపి తక్షణసహాయంగా రూ.5వేల ఆర్థికసాయం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బిజెపినాయకులు నారాయణ, సుందర్‌రెడ్డి, దుబ్బరాములు, మాదిగ ఉపాధ్యక్షులు మంగలిరమేష్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/ఊర్కొండ :** లక్షడప్పులువేల గొంతుకలు కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ డప్పుస్వామి గురువారం మండలకేంద్రంలోని మాదారం మాజీసర్పంచ్ ధ్యాపనిఖిల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్రనాయకులు టైగర్‌జంగయ్య, కాంగ్రెస్‌పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, కాంగ్రెస్‌పార్టీమైనార్టీ సెల్ జిల్లాప్రధాన కార్యదర్శి అబ్దుల్‌సమి, కాంగ్రెస్‌యువజన విభాగం మండల అధ్యక్షుడు గుంజ ఆదినారాయణ, మాజీఅధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు మొండేళ్ల శ్రీశైలం, మధురెడ్డి పాల్గొన్నారు.

## రోబోటిక్స్‌పై శిక్షణ

**ప్రజాపక్షం/మద్దూర్:** విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించి సాంకేతికపై అవగాహన కల్పించడం లక్ష్యంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలో రోబోటిక్స్ ఇన్ ఆకడమిక్స్ కార్యక్రమం ఇప్పటి వరకు 12పాఠశాలల్లో శిక్షణ అందించడం జరిగింది. నేడు మద్దూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెనివట్లలో 100మంది విద్యార్థులకు శిక్షణ అందించడం జరిగింది. రోబోటిక్స్ శిక్షణల వల్ల విద్యార్థులలో సమస్య పరిష్కార నైపుణ్యాను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో సాంకేతిక ఆవిష్కరణల వైపు నడిపించడం మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోహం అకాడమీ ట్రైనర్లు, పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయు లు సాయికుమార్, నారాయణపేట స్ఫూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య, బాలరాజులు పాల్గొన్నారు.

# బాలికలు, మహిళల భద్రతకు పెద్దపీట

### కలెక్టర్ ఆదర్శ సురభి



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి:** భరోసా కేంద్రం ద్వారా మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు వారికి అవసరమైన న్యాయం కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. అత్యాచార బాధితులకు, వైద్య, న్యాయ, సైకాలజికల్ సపోర్టు వంటి సేవలు ఒకే గొడుగు కింద అందిస్తున్న పోలీస్ శాఖ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నడుపుతూ సేవలందించి, జిల్లా ప్రజల మన్ననలు పొందిన వనపర్తి జిల్లాలో భరోసా కేంద్రం ప్రారంభమైన నుండి ఒక సంవత్సరం ఇప్పటి వరకు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, జిల్లా అదనపు కలెక్టర్ సంజిత్ గంగ్వార్ సంబంధిత అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వివిధరకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా పోక్సో, మహిళలపై అత్యాచార కేసులను నియంత్రించడానికి స్కూల్, కళాశాలలో తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. భరోసా సిబ్బందిని, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, సీడబ్ల్యూసి, సఖీ సెంటర్ తదితర డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయంతో భరోసా కేంద్రాలలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సంజిత్ గంగ్వార్, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వర్‌రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి సుధారాణి, వనపర్తి సిఐ,వనపర్తి రూరల్ 2వ ఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.

# నూతన రోడ్లు, మరమ్మతులకు రూ.30 కోట్లు మంజూరు




**ప్రజాపక్షం/మక్తల్:** ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా డా.వాకిటి శ్రీహరి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందులో భాగంగానే తాజాగా మక్తల్ నియోజకవర్గంలో నూతన రోడ్లు, రోడ్ల మరమ్మతుల కోసం 30 కోట్ల 73 లక్షల నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో తాజాగా నూతన బీటీ రోడ్ల కోసం 15 కోట్లు, ఇతర చోట్ల రోడ్ల మరమ్మతుల కోసం 15 కోట్ల 73 లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు.

నూతన బీటీ రోడ్ల వివరాల్లోకి వెళితే మాగనూరు మండల పరిధిలో మాగనూరు నుంచి అచ్చంపేట్ వరకు 4 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి 3 కోట్ల 80 లక్షలు క్రిష్ణ మండల పరిధిలో క్రిష్ణ ఘాట్‌నుంచి గుర్జాల్ గ్రామానికి 2 కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల 40 లక్షలు, ఉట్కూరు మండల పరిధిలో బిజ్వార్ నుంచి కొత్తపల్లి మీదుగా ధన్వాడకు 2 కిలోమీటర్ల బీటిరోడ్డు నిర్మాణానికి కోటి 90 లక్షలు, నర్వ మండల పరిధిలో నర్వ నుంచి జక్కన్న పల్లి గ్రామానికి 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల 90 లక్షలు, అమర్‌చింత మండల పరిధిలో చంద్ర ఘడ్ స్టేజి నుంచి నందిమల్ల వరకు 1.85 కిలోమీటర్ల నిర్మాణానికి కోటి 40 లక్షలు, జెడ్పి రోడ్డు నుంచి ధర్మాపూర్ వరకు 2.52 కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణానికి 2 కోట్లు, ఆత్మకూరు మండల పరిధిలో వీర రాఘవపూర్ నుంచి పామపురం వరకు 0.70 కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి 60 లక్షల రూపాయలు మంజూరయ్యాయని అన్నారు. మొత్తం నియోజకవర్గ పరిధిలో 16.07 కిలోమీటర్ల బీటి రోడ్డు నిర్మాణానికి 15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఇక రోడ్ల మరమ్మత్తుల విషయానికోస్తే మక్తల్ మండల పరిధిలోని కాచ్‌వార్ నుండి ఎడివెల్లి గ్రామం వరకు 3.60 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు 2 కోట్ల 34 లక్షలు, ముస్టిపల్లి నుంచి అనుగొండ గ్రామంవరకు ఒక కిలోమీటరు రోడ్డు మరమ్మత్తు కోసం 65 లక్షలు, నర్వ మండల పరిధిలో పిడబ్ల్యుడి రోడ్డు నుంచి లంకాల మీదుగా నర్వ వరకు 7 కిలోమీటర్ల రోడ్ల మరమ్మత్తు కోసం 4 కోట్ల 55 లక్షలు, మాగనూరు మండల పరిధిలో కొల్పూరు గ్రామం నుంచి మూడుమాల్ గ్రామం వరకు కిలోమీటర్ల రోడ్డు మరమ్మత్తు కోసం 2 కోట్ల 60 లక్షలు, అమరచింత మండల పరిధిలో నందిమల్ల నుంచి మిట్ట నందిమల్ల గ్రామం వరకు 6.80 కిలోమీటర్ల రోడ్డు మరమ్మత్తు కోసం 4 కోట్ల 42 లక్షలు, ఆత్మకూరు మండల పరిధిలోని పిడబ్ల్యుడి రోడ్డు నుంచి మేడిపల్లి వరకు 1.80 కిలోమీటర్ల రోడ్డు మరమ్మత్తు కోసం కోటి 17 లక్షలు మంజూరయ్యాయని మొత్తంగా నియోజకవర్గ పరిధిలో 24.20 కిలోమీటర్ల రోడ్ల మరమ్మత్తుల కోసం 15 కోట్ల 73 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. కేవలం ఏడాదిలోనే నియోజకవర్గంలో రహదారుల కోసం దాదాపు 100 కోట్ల వరకు నిధులను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరికి దక్కుతుందని అన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, మండలాధ్యక్షుడు గణేష్, టౌన్ ప్రెసిడెంట్ ఏ.రవికుమార్, మార్కెట్ డైరెక్టర్లు ఫయాజ్, శాలం, సీనియర్ నాయకులు చంద్రకాంత్ గౌడ్, నేతలు నూరుద్దిన్, శంషుద్దిన్, అస్మోద్దిన్, బోయ నరసింహ, బందారి బాబు తదితరులు ఉన్నారు.

## సిమెంటు అందజేత

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్టగ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయానికి ఇచ్చినమాటప్రకారం వందబ్యాగుల సిమెంట్‌ని బిఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్రనాయకులు మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్ సిమెంటు అందజేశారు. దేవాలయ నిర్మాణంకొరకు సిమెంటు అందజేసిన ఉప్పలవెంకటేష్‌కు ఎల్లికట్ట చెన్నకేశవసంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్లికట్ట బిఆర్‌ఎస్‌పార్టీ గ్రామకమిటి అధ్యక్షులు భీమయ్య, కేశవులు, రవి, స్వామి, కృష్ణ, రమేష్, శ్రీకాంత్, వేణు,వెంకటయ్య, ఆంజనేయులు, మల్లేష్, ప్రశాంత్, రమేష్, తిరుపతి, రవి, బాలయ్య, బాలచిన్నయ్య, మల్లయ్య, జంగయ్య పాల్గొన్నారు.



## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తాండ్ర గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికిగురై మృతి చెందిన షాంపూరి గణేష్ కుటుంబసభ్యులకు యాజమాన్యం సిబ్బంది ఆర్థికసాయం చేశారు. గురువారం వెల్దండ మండలం కొట్రగ్రామంలోని మృతుడి భార్య శివలీలకు రూ.2,50,000 బృంగి ఆస్పత్రి యాజమాన్యం రూ.80వేలు ఆస్పత్రి సిబ్బంది ఆర్థికసాయం చేశారు. మృతుని కుటుంబసభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూవారి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని బృంగి ఆస్పత్రి యాజమాన్యం తెలిపారు. అందరితో చనువుగాఉన్న షాంపూరి గణేష్ మృతిచెందడం తీరనిలోటని వారు ఆవేదన వ్యక్తంచేశారు.



## మహాదేవునిపేట గ్రామస్తుల ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** నిరుపేద కుటుంబాలురోజువారి జీవనం సాగించడమే గగనమవుతున్నా ఈరోజుల్లోవారి ఇంట్లో ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలు దినవారాలు జరపడం కత్తిసామే. బిజినేపల్లి మండలంలోని మహాదేవునిపేట గ్రామానికిచెందిన లేట్లయాదమ్మ అనుమానస్పదంగా మృతిచెందింది. గ్రామస్తులసాయం తో అంత్యక్రియలుకానిచ్చి న భర్త ఉత్తయ్య భార్య దినవారాలు చేయలేనిదుస్థితి ని తెలుసుకున్న కొందరు గ్రామస్తులు గురువారం తమకు తోచినంత చందాలువేసుకొని రూ.15,300ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నా రు. ఆర్థికసాయం అందజేసిన గ్రామస్తులకు ఉత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## కులగణనపై కాంగ్రెస్ నాయకులు హర్షం

**ప్రజాపక్షం/పెద్దమందడి:** పెద్దమందడి మండలం ఉద్యోగ, ఉపాధి, రాజకీయాలలో అన్ని కులాలకు జనాభా ప్రతిపాదన రిజర్వేషన్లు అమలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే ఆధారంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కులగణన బిల్లును ప్రవేశపెట్టడంతో స్పీకర్ ఆమోదం తెలిపారు. కుల గణన బిల్లు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కులగణన జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. బీసీల మీద కపట ప్రేమ చూపిస్తున్న బీఆర్‌ఎస్‌కు నిజంగా చిత్తశుద్ధి గనక ఉండి ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లభించి దశాబ్దం అయ్యుండేది. ప్రాణాణికత లేని ఒక పనికిమాలిన సర్వే చేసి దానిని అధికారికంగా ఎక్కడా ప్రస్తావించకుండా నేడు ప్రజా ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల బాగుకై కులగణన సర్వే చేస్తే వారి అభ్యున్నతిని జీర్ణించుకొని దొరల పార్టీ లేని పోని రాద్ధాంతం చేస్తుంది. సర్వేలో ఏమైనా తప్పులు ఉంటే సలహాలు సూచనలు ఇవ్వాలే గాని ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని వారి ఆవేదన అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి. పెంటన్న యాదవ్, పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షుడు పి. విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గట్టు మన్యం, పెద్దమందడి మాజీ జడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఎవరూ సంతోషంగా లేరు

### 13న జరిగే రైతుదీక్ష విజయవంతం చేయాలి
### మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకివచ్చినతర్వాత విద్యార్థులనుంచి పండుముసలివరకు, ఏవర్గముకూడా సంతోషంగాలేరని మాజీ ఎమ్మెల్యేజైపాల్‌యాదవ్ అన్నారు. ఈనెల13న ఆమన్‌గల్‌పట్టణంలో నిర్వహించనున్న రైతుదీక్ష సన్నాహక సమావేశాన్ని పట్టణంలోని ఆయననివాసంలో నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం అబద్ధపుహామీలు ఇచ్చి ప్రజలను మోసంచేసిందన్నారు. అధికారంలోకి వచ్చి 420రోజులైన ఇచ్చిన హామీలు అమలుచేయడంలేదన్నారు. కాంగ్రెస్‌పాలనలో రైతులు, సామాన్యప్రజలు ఎవరిని కదిలించిన ఆవేదనతో వాళ్లబాధలు చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్‌పార్టీలో కొంతమంది నాయకులుతప్ప ఎవరు రాష్ట్రంలో సంతోషంగా లేరన్నారు. కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌పార్టీ జనాభాలో 50శాతంపైగా బిసిలకు అంతేశాతం సీట్లుకేటాయిస్తామని చెప్పి 14నెలలుగా ఊరించి ఇప్పుడు ఆదరాబాదరగా సర్వేనిర్వహించి 42 శాతం ఇవ్వడానికి బిసిలను మోసంచేయడానికి అన్నారు. కెసిఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వేప్రకారం 1.85కోట్లు ఉన్న రాష్ట్రజనాభా ఇప్పుడు 1.64కోట్లకు తిరోగమనదిశలో ఉండటంఇదే కాంగ్రెస్‌కుట్ర అన్నారు. కేవలం స్థానిక సంస్థలలో బిసిల ఓట్లుకొల్లగొట్టడానికి బిసిలపట్లప్రేమ ఒకలబోస్తూ, అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించకుండా కేంద్రంమీదికినెపంనెట్టి కాంగ్రెస్‌చేతులు దులుపుకున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయాలని బిసిజనాభా లెక్కతేల్చి చట్టబద్ధత కల్పించినతర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈనెల 13న ఆమన్‌గల్ పట్టణంలో రైతుదీక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈదీక్షకు మాజీమంత్రి , టిఆర్‌ఎస్‌పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈరైతు దీక్ష సభను నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, టిఆర్‌ఎస్ రాష్ట్రనాయకులు ఉప్పలవెంకటేష్, మాజీ మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ జడ్పిటిసి విజితారెడ్డి, మాజీమార్కెట్‌చైర్మన్, టిఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షులు విజయ్‌గౌడ్,మాజీవైస్ ఎంపిపి గోవర్ధన్, మాజీ మార్కెట్‌చైర్మన్ బాలయ్య, పట్టణటిఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు మధు, ఆమన్‌గల్ టిఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు అర్జున్‌రావు పాల్గొన్నారు.

## విద్యార్థులు స్నేహ సంబంధాలు మెరుగు పర్చుకోవాలి

**ప్రజాపక్షం/మద్దూరు:** విద్యార్థులు ఒకరిని చూసి మరొకరు స్నేహ సంబంధాలు మెరుగు పర్చుకోవాలని కొత్తపల్లి, మద్దూరు మండలం ఎంఈఓలు ఆంజనేయులు, బాలకిష్టప్పలు అన్నారు. పీఎం కార్యక్రంలో గురువారం ఉదయం కొత్తపల్లి మండలంలోని నిడ్జింత పాఠశాలను మద్దూరు మండలం పెదిరిపాడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిష్టప్ప, వారి ఉపాధ్యాయ బృందంతో కలిసి విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వాటి పరిరక్షణ విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉన్నటువంటి ఏకోపార్క్, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఆఫీస్ రూం, డిజిటల్ క్లాసులు, వాష్ రూం నిర్వహణ, మధ్యాహ్న భోజనం నిర్వహణ, గేమ్స్ సంబంధించినటువంటి విషయాలు అంతేకాకుం డా ప్రతీ క్లాస్ ను సందర్శించి విషయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాజర్, శ్రీనివాస్, వేణుగోపాల్, వెంకట్రాములు, పీడీ కతలప్ప విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 'వన్ టైం సెటిల్మెంట్'

**ప్రజాపక్షం/పెద్దమందడి:** ప్రాథమిక సహకారసంఘంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులను రుణ విముక్తులను చేసేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రకటించిన వన్ టైం సెటిల్మెంట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. పెద్దమందడి సొసైటీలో 218 మంది రైతులు రూ.4,16,00,000దీర్ఘకాలిక రుణాల కింద అప్పు తీసుకోగా రూ.2,24, 82,000 మాఫీ చేశామని తెలిపారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు వన్ టైం సెటిల్మెంట్ ప్రకటించగా బుధవారం వరకు 49 లక్షల 57వేల 961 రూపాయలు చెల్లించారని వీరందరికి 51,22, 262 రూపాయల సబ్సిడి వర్తించిందని చెప్పారు. ఈ సందర్భంగా జగత్ పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస యాదవ్ కుటుంబానికి చెందిన ఎనిమిది మంది రైతుల ఖాతాలకు సంబంధించి 11,40,000ఏకకాలంలో చెల్లించి రుణ విముక్తులయ్యారు. ఏకకాలంలోనే అప్పు చెల్లించిన శ్రీనివాస యాదవ్‌ను సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, సొసైటీ సిఈఓలు అభినందించారు. ఈ కార్యక్రమమంలో మంగంపల్లి వెంకట్రాంరెడ్డి, యాపర్ల రాంరెడ్డి, సొసైటీ సిబ్బంది లు పాల్గొన్నారు.

## ఆరాధ్యమృతి ఎంతో బాధాకరం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బాలనగర్ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఆరాధ్యమృతి ఎంతోబాధాకరమని రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండలం చొక్కన్నపల్లి గ్రామానికిచెందిన కొమ్మురజిత రమేష్ దంపతుల కుమార్తె బాల్‌నగర్ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతుంది. అయితే వసతిగృహంలో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి మృతికి సంబంధించిన విషయాలను ఆరాతీశారు. స్కూల్‌ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాలికమృతి చాలా కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థినిలు ఆత్మహత్యచేసుకునేవరకు సిబ్బంది ఏం పనిచేస్తూరంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరాధ్యమృతిపై విచారణచేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకొని తల్లిదండ్రులకు న్యాయంచేయాలని డిఎస్‌పి వెంకటేశ్వర్లుకు సూచించారు.

# శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** నేటి నుండి మార్చి 16 వరకు నిర్వహించనున్న మన్యంకొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై గురువారం మన్యంకొండ కొండ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. తొలుత సమావేశంలో బ్రహ్మోత్సవాలకు ఆయా శాఖలు ద్వారా చేసిన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవా లు భాగంగా ముఖ్యమైన రోజులైన ఫిబ్రవరి 12న స్వామి వారి గరుడ వాహన సేవ, రథోత్సవం అలాగే ఫిబ్రవరి 26 మహ శివరాత్రి, మార్చి 14న శ్రీ అమ్మవారి తిరుకళ్యాణోత్సవం, రాత్రికి గరుడ వాహన సేవ, విమాన రథోత్సవం ముఖ్యమైన రోజుల్లో భక్తులు అధికసంఖ్యలో రానున్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ తరపున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ తగినన్ని బస్సులు నడపాలని అన్నారు. బ్రహ్మోత్సవాలు ముఖ్యమైన రోజులు ఫిబ్రవరి 12 రాత్రి 13న స్వామి వారి గరుడ వాహన సేవ, రథోత్సవం సందర్భంగా కొండపైకి ఫిట్నెస్ ఉన్న మినీ బస్సులు నిరంతరంగా నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున కొండపైన, కొండ దిగువన అలివేలు మంగతాయారు దేవాలయం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపు, డాక్టర్లు, మందు లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్కో ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, జనరేటర్ ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ ద్వారా కొండపైన, దిగువన అవసరమైన అగ్నిమాపక సాధనాలతో సిద్ధంగా ఉండాలని, 5 కిలోమీటర్ల పరిధిలో మద్యపానాన్ని నిషేధించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్‌బి ద్వారా అవసరమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ నీటి సరఫరా శాఖ భక్తులకు అవసరమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సమస్య తలచకుండా చూడాలని డిపిఓను ఆదేశించారు. తిను బండారాలు, ఆహార పదార్థాలు ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులు సిబ్బంది ఏర్పాటు చేసి మానిటర్ చేయాలని ఆదేశించారు. తప్పిపోయిన పిల్లలు ఉంటే ప్రకటించేలా ఏర్పాటు చేయాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశం అనంతరం కొండపైన అతిథి గృహాలు, పార్కింగ్ కొనేరు, పరిశీలించి సూచనలు చేశారు. కొండపైకి వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా పార్కిం గ్ ఏర్పాటు చేయాలని అన్నారు. శాంతి భద్రత కమిటీ, ఫెస్టివల కమిటీ, వాటర్, శానిటేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, వంటి కమిటీలను ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, దేవాదాయ శాఖ అసిస్టెంట కమిషనర్, తదితరులు ఉన్నా రు.

**రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ ఎడ్యుకేషన్ సొసైటీ సందర్శన**

తెలంగాణ రెసిడెన్సియల్ ఇన్స్టిట్యూషన్ ఎడ్యుకేషన్ సొసైటీ బాలానగర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. గురువారం ఉదయం 10వ తరగతి విద్యార్థిని ఆరాధ్య ఆత్మహత్య చేసుకున్న ఘటనపై జిల్లా కలెక్టర్ విద్యార్థినిలు, ఉపాధ్యాయులతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని తల్లి దండ్రులతో మాట్లాడి వారిని పరామర్శించి ఓదార్చారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఎస్పి వెంకటేశ్వర్లు, డిఈఓ ప్రవీణ్‌కుమార్, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిణి జరీనాబేగం, బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర తదితరులు ఉన్నారు.



ఫోకస్

వ్యవసాయం

# సాగు రంగంలో అభివృద్ధి కాగితాలకే పరిమితమా?

దేశంలోని ప్రతి వ్యవసాయదారుడి ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టి దశాబ్దం దాటింది. ముచ్చటగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టింది. ప్రధానిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించారు. కానీ, రైతుల జీవితాలు బాగుపడిన దాఖలాలు లేవు. ఈ ఆదాయం రెట్టింపు కోసం అప్పట్లో విధించిన గడవు పూర్తయి ఏడాది దాటింది. అయినప్పటికీ, అది నేటికీ నినాదంగానే మిగిలిపోయింది. రైతు సమస్యల పట్ల మోదీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఎన్నో సందర్భాల్లో రుజువైంది. రైతుల మలిదశ ఆందోళనలు, నిరసనలు ఊపందుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా, మరోసారి రైతులపై మోదీ సర్కారు ఎక్కడి లేని ప్రేమను ప్రకటించింది. బిహార్‌పై ప్రత్యేక అభిమానం చూపి, మఖానా బోర్డు ఏర్పాటును ప్రకటించింది. అక్కడ ఉన్నది బిజెపి కనుసన్నల్లో నడిచే నితీశ్ కుమార్ జెడియు ప్రభుత్వం. అందుకే, అంత ప్రేమ. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగం అభివృద్ధిపై కేంద్ర ఆర్థిఖ మంత్రి నిర్మలా సీతారామన్ అద్భుతమైన లోకాన్ని కళ్ల ముందు ఆవిష్కరించారు. కానీ, చెప్పిన మాటలు.. తీసుకున్న నిర్ణయాలు.. ప్రకటించిన కేటాయింపులు ఎంత వరకూ అమలవుతాయన్నది ప్రశ్న. దేశ ఆర్థిక ప్రయాణానికి వ్యవసాయం కీలకమన్నది వాస్తవం. వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడం, ఉత్పాదకతను పెంచడానికి చర్యలు తీసుకోడం అత్యవసరం. ప్రభుత్వ గణాంకాలను అనుసరించి వ్యవసాయ రంగం 2016–17 నుండి 2022–23 వరకు సగటున ఏటా 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. అయితే, ప్రకటించిన అధిక దిగుబడినిచ్చే విత్తనాల జాతీయ మిషన్ ఏక పంటల సాగు, పంట వైవిధ్యం అంశాలను ప్రస్తావించకపోవడం ఆందోళనకరం. తెగుళ్ళు, వాతావరణ ఒత్తిళ్లను తట్టుకొని, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అభివృద్ధి చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం విత్తనాల జాతీయ మిషన్ లక్ష్యం. అదే విధంగా 23 రకాల తృణధాన్యాలు, 11 రకాల పప్పుధాన్యాలు, 7 రకాల నూనెగింజలుసహా 100కి పైగా కొత్త విత్తన రకాల లభ్యతను పెంచడాన్ని కూడా ధ్యేయంగా ఎంచుకుంది. కానీ, పలు కీలక అంశాలపై ఈ మిషన్ వద్ద సరైన ప్రణాళిక లేదని స్పష్టమవుతున్నది. బిహార్‌కు మఖానా బోర్డుతో పాటు, తూర్పు భారత దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి వీలుగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రీన్యువ రిషిప్ అండ్ మేనేజ్‌మెంట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ నిర్ణయాలకు రాజకీయ కోణం తప్ప రైతులకు మేలు చేయాలనే తలంపు లేదన్న విమర్శల్లో నిజం లేకపోలేదు.




కాగా, భవిష్యత్తులో ఆహారం, పోషక భద్రత కోసం 10 లక్షల జెర్మ్ ప్లాస్మ్ లైన్లతో రెండవ జీన్ బ్యాంక్ (1996లో మొద టి బ్యాంక్ ఏర్పడింది) ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. జన్యు బ్యాంకు అనేది మొక్కలు, జంతువులు లేదా సూక్ష్మ జీవుల నుండి జన్యు పదార్థాన్ని నిల్వ చేసి భవిష్యత్తు ఉపయోగం కోసం భద్రపరుస్తుంది. పత్తి సాగు, ఉత్పాదకత, స్థిరత్వాన్ని మెరుగుపరచ డానికి 5 సంవత్సరాల కాలానికి ప్రణాళికను సిద్ధం చేసినట్టు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి తెలిపారు. ఇది జౌళి మంత్రిత్వ శాఖకు సంబంధించిన, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్ అనే 5 ఎఫ్ సూత్రానికి అనుగుణం గా ఉంటుంది. ఇది లక్ష్యాలను అందుకుంటే మంచిదే. కానీ, బడ్జెట్ కేటాయింపుల్లో సవరణలు జరగవని గట్టిగా చెప్పే అవకాశం లేదు. బడ్జెట్ నిండా ఇలాంటి హామీలు ఎన్ని ఉన్నాయో, అంతకు రెట్టింపు అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గత పదేళ్ల కాలంలో జరిగిందే భవిష్యత్తులో పునరావృతం కాదని హామీ ఇచ్చేది ఎవరు?



## కాలుష్యం ఉచ్చులో 'హిండన్'

ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని పలు కీలక ప్రాంతాల్లో వ్యవసాయానికి, మత్స్య సంపదకు ఎంతగానో ఉపయోగపడిన హిండన్ నది నేడు కాలుష్యమయమైంది. శుద్ధి చేయని వ్యర్థాల కాలువగా మారింది. ఈ పరిణామం పర్యావరణ క్షీణతకు ప్రతీక. ఈ కాలుష్యం పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని పారిశ్రామిక బెల్ట్‌లో ఉన్న సమాజాలను ప్రమాదంలోకి నెడుతున్నది. హిండన్ నది ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్పూర్ జిల్లాలోని దిగువ శివాలిక్ శ్రేణుల నుండి ఉద్భవించింది. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని పారిశ్రామిక ప్రాంతం మీదగా సుమారు 400 కిలోమీటర్లు ప్రవహించి, నోయిడాలోని యమునా నదిలో కలుస్తుంది. ఈ నదికి కాళి (పశ్చిమ), కృష్ణా ఉపనదులుగా హరాయి. కాగా, మితిమీరిన పారిశ్రామికీకరణ, అదుపులేని పట్టణీకరణ హిండన్ నది పర్యావరణ సమతుల్యతను నాశనం చేశాయి. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) 2015లోనే హిండన్‌ను 'మృత నది'గా ప్రకటించింది. విపరీతమైన కాలుష్య స్థాయిలు ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పర్యావరణ క్షీణతకు దారితీసే మితిమీరిన కాలుష్యంతో కూడిన నదులను 'డెడ్ రివర్'గా పేర్కొంటారు. హిండన్ పరిరక్షణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంగానీ, ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ సర్కారుగానీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. పెరుగుతున్న కాలుష్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఇప్పటికైనా నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పర్యావరణం

## 'కెన్-బెత్వా'తో పర్యావరణానికి ముప్పు

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఖజురసోలో కెన్–బెత్వా లింక్ ప్రాజెక్ట్ (కెబిఎల్‌పి)కు శంకుస్థాపనం చేయడంతో పర్యావరణ సమస్యల చర్చ తెరపైకి వచ్చింది. ఎన్విరాన్మెంటల్ ఇపాక్ట్ అసెస్మెంట్ (ఇఐఎ) ప్రకారం, ఈ ప్రాజెక్టు వల్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అన్ని రకాల జాగ్రత్తలు, ముందస్తు చర్యలు తీసుకోకపోతే, దీని వల్ల లాభం లేకపోగా, నష్టాలే ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. జాతీయ దృక్పథ ప్రణాళిక (నేషనల్ ప్రాజెక్షన్ ప్రోగ్రామ్/ ఎన్‌పిపి)లో భాగంగా, బుందేల్‌ఖండ్‌లో నీటి కొరతను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా రూ. 45,000 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాంతంలోని 11 లక్షల హెక్టార్ల భూమికి నీటిని అందించే దౌధన్ డ్యామ్ నీటిపారుదల ప్రాజెక్టుకు ప్రధాని శంకుస్థాపన చేశారు. మధ్యప్రదేశ్‌లో మొదటి తేలియాడే సౌరశక్తి ప్రాజెక్టును ఆయన ఓంకారేశ్వర్‌లో ప్రారంభించారు. ఇది పునరుత్పాదక ఇంధనాన్ని పెంచేందుకు జరుగుతున్న ప్రయత్నం గా పేర్కొంటున్నారు.




ఏటా 6.3 లక్షల హెక్టార్లకు సాగునీరు, 62 లక్షల మందికి తాగు నీరు, 100 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి ఈ ప్రాజెక్టు లక్ష్యమని ప్రకటించారు. అయితే, ఈ ప్రాజెక్టు పర్యావరణంపై ప్రభావం చూపుతుందని ప్రతిపక్ష పార్టీల నేతలు, పర్యావరణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పన్నా టైగర్ రిజర్వ్, దాని ప్రధాన ప్రాంతంలో 10 శాతం పైగా మునిగిపోయే అవకాశం ఉందని అంటున్నారు. ఈ ప్రాజెక్టు వస్తే, పులులు, రాబందులు సహా అనేక వన్యప్రాణుల ఆవాసాలను గణనీయంగా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్టు కోసం సుమారు 23 లక్షల చెట్లు నరికివేయాల్సి ఉంటుందని అంచనా. ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాలు స్థానిక పర్యావరణ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పన్నా టైగర్ రిజర్వ్‌లోన వన్యప్రాణుల సంరక్షణను పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు అంటున్నప్పటికీ, అది ఎంతవరకూ సాధ్యమవుతుందనేది ప్రశ్న.

## కమిటీ సిఫార్సులపై శీతకన్ను..

వ్యవసాయంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ చేసిన ఎన్నో సూచనలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం లేదు. పిఎం కిసాన్ పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి ప్రస్తుతం ఏడాదికి రూ. 6,000 మద్దతునిస్తుండగా, దీనిని రూ. 12,000లకు పెంచాలని కమిటీ సూచించింది. అదే విధంగా సార్వత్రిక పంటల బీమాను అమలు చేయాలని సిఫార్సు చేసింది. రైతులు ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని కూడా సూచించింది. ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థ (ఎఫ్‌పిఒ)లు 9,204 రిజిస్ట్రేషన్లతో విస్తరించినప్పటికీ, పరిమిత మార్కెట్ అవకాశాలు రైతులను ఇబ్బందులకు గురి చేసుండగా, బలహీనమైన నిర్వహక సామర్థ్యం కూడా వారి ఆదాయం, మౌలిక సదుపాయాలను ప్రభావితం చేస్తున్నది. దీర్ఘకాలిక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కావడం లేదు. ఫలితంగా వ్యవసాయ రంగంలో స్థిరత్వం అసాధ్యమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఎన్ని నివేదికలను వెల్లడించినా, ఎంతటి అభివృద్ధిని ప్రకటించినా, వాస్తవ పరిస్థితులు మాత్రం సంతృప్తికరంగా లేవన్నది నిజం. నిర్దిష్ట సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని, పరిష్కరించడానికి పునర్విమర్శ, లోతైన అధ్యయనం, సరైన దిశగా చర్యలు అత్యవసరం. కానీ, మోదీ సర్కారు నుంచి వీటిని కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఉత్పత్తి ఖర్చులు పెరగుతున్న స్థాయిలో మద్దతు ధర లేదు. నాణ్యమైన విత్తనాల నుంచి గిడ్డంగుల అందుబాటు వరకూ రైతులు అడుగడుగునా సమస్యలు ఎదుర్కొంటున్నాడు. అతివృష్టి, అనావృష్టి నిరంతరం రైతును వెంటాడి వేధిస్తునే ఉంటాయి. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని, వ్యయప్రయాసల కోర్చి పండించిన పంటకు సరైన ధర లభించడం లేదు. తరుగు పేరుతో తూకాల్లో మోసాలు షరామామూలే. రైతుల సమస్యలను తీర్చలేని కేంద్రం, ఎప్పటికప్పుడు కొత్తకొత్త నినాదాలతో ముందుకొచ్చి, రైతులను ఆదుకుంటామని హామీలు గుప్పించడం హాస్యాస్పదం.




**వ్యవసాయ రంగంలో పెరుగుతున్న సాంకేతిక వినియోగం మెరుగైన ఫలితాలను చూపిస్తున్నది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో వరదలు, కరువులు సంభవించినప్పటికీ, పరిస్థితి త్వరగా చక్కబడేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. డ్రోన్లు, ఎఐ ఆధారిత సాధనాలను ఉపయోగించడం పెరిగింది. సాంకేతిక విస్తరణకు విస్తారమైన అవకాశాలు కనిపిస్తున్నాయి. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, క్రాప్ సైన్స్, పశువుల ఆరోగ్యం, సహజన వనరుల నిర్వహణ వంటి విభాగాల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరుగుతున్నది.**

# రెండవ ఎఎన్‌ఎం పోస్టులు పెంచాలి



ఖమ్మంలో....


మహబూబ్‌నగర్‌లో...


సూర్యాపేట కలెక్టరేట్‌లో..



ములుగులో...

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గత ప్రభుత్వం రెగ్యులర్ ఎఎన్‌ఎం పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బి నోటిఫికేషన్‌ను సవరించి అదనపు పోస్టులను ప్రభుత్వం మానవత దృక్పథంతో పెంచి సెకండ్ ఎఎన్‌ఎంలకు న్యాయం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండు చేశారు. అదనపు పోస్టులు పెంచాలని, 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని, పెండింగు పిఆర్‌సి విడుదల చేయాలని వయసు పెరిగి ఉద్యోగ నోటిఫికేషన్‌కు అర్హత కోల్పోయిన సెకండ్ ఎఎన్‌ఎం కాంట్రాక్టు ఎంప్లాయిస్‌కు 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న నిరవధిక సమ్మె నేపథ్యంలో గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో సెకండ్ ఎఎన్‌ఎమ్‌లు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి అనంతరం జిల్లా వైద్యాశాఖ అధికారి డిఎంహెచ్‌ఒ డా.కృష్ణకి డిమాండు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా సిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో సెకండ్ ఎఎన్‌ఎంలు రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెకండ్ ఎఎన్‌ఎంల సమస్యలను పరిశీలించి న్యాయం చే స్తామని హామీ ఇచ్చారని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగ నోటిఫికేషన్ కాలయాపన కారణంగా అనేక మంది వయోపరిమితితో ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోయారని అన్నారు. కనుక సెకండ్ ఎఎన్‌ఎంల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని లేనిచో ఈనెల 17 నుండి రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు దిగడం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయమ్మ, జిల్లా అధ్యక్షురాలు గిరిజారెడ్డి, నాయకులు సెకండ్ ఎఎన్‌ఎం సిస్టర్స్ ఎల్లమ్మ, భాగ్య, సుజాత, శోభరాణి, అంజమ్మ, కృష్ణ వేణి, జానకి, చంద్రకళ, సుగుణమ్మ, తదితరులు ఉన్నారు.

**ఖమ్మంలో....** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి ఖచ్చితంగా పోస్టులు పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం నగర కార్పొరేటర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులను పెంచడంతోపాటు పరీక్షకు అర్హతలేని వారికి 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ తోపాటు , వందశాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని రెం డవ ఎఎన్‌ఎంలు ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో రెండవ ఎఎన్‌ఎంలు తమను బేషరత్‌గా రెగ్యులర్ చే యాలని పోరాటం చేశారని, అది సాధ్యం కాదని అప్పటి ప్రభుత్వం తేల్చి చెప్పిన కారణంగా కనీసం 100% గ్రాస్ శాలరీ నైన ఇవ్వాలని తాము కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన ప్రతిపత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్‌ఎంల సంఘం ( ఎఐటియుసి) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం నాగ శేషమ్మ, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి , సునీత, సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట కలెక్టరేట్‌లో ...** గత 18 సంవత్సరాల నుండి పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో 2వ ఎఎన్‌ఎంగా పని చేస్తున్న వారందరికి రాష్ట్ర ప్రభుత్వం రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 2వ ఎఎన్‌ఎంలు టి.గోపమ్మ, పి.పద్మవతి, బి.రాధా కుమారి, ఎం. నరసమ్మ, జయసుధ, సల్వాది నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

**ములుగులో...:** రాష్ట్రవ్యాప్తంగా రెండవ ఎఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గురువారం జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కార్యాలయాం, ములుగు జిల్లా డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిఎంహెచ్ ఓకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండి అంజద్ పాష, సంఘం నాయకులు పి సరోజన, కోడి సుజాత, వజ్ర పావణి, మమత, సరోజిని, శోభారాణి, స్వప్న, సరిత, సరస్వతి, లలిత, సూర్యకాంతం, సమ్మక్క, సభిత తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్‌లో...:** పోస్టులు పెంచి, వందశాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. రెండవ ఏఎన్‌ఎం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వరంగల్ జిల్లా డిఎంహెచ్‌ఒ సూపరింటెండెంట్‌కు మెమోరాడం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా సెకండ్ ఎఎన్‌ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రజిత, జిల్లా ఆర్గనైజర్ టి ప్రసన్న, జిల్లా నాయకులు సుజాత, సుధ, కవిత, సునీత తదితరులు పాల్గొన్నారు

**నల్లగొండ టౌన్‌లో...:** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి పోస్టులు పెంచాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన ప్రతిపత్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పోలే రత్నకుమారి,జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల గీతా రాణి, మాధురి,సరిత,రుక్సాన, అలివేలుమంగా తదితరులు పాల్గొన్నారు.

**జయశంకర్ భూపాలపల్లిలో...:** ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి ఖచ్చితంగా పోస్టులు పెంచాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ ప్రభుత్వాన్ని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా 2 సెకండ్ ఎఎన్‌ఎం లు ఎం.పార్వతి, జే.శ్యామలత, కె.శ్యామల, పి.రజిత, జే.సునీత, ఎం.అనసూయ, కె.గీత, కె.శోభలత, ఏ.రజిత, జి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి జిల్లా... :** ప్రజా ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న రెండవ ఎఎన్‌ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలని వారి పోస్టులను పెంచాలని కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు నిరసన తెలియజేసి అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కే.చంద్ర యాదవ్ ఎఎన్‌ఎం సంఘం రాష్ట్ర అధ్యక్షులు పద్మ జయమ్మ తదితరులు ఉన్నారు

**ఆసిఫాబాద్ జిల్లాలో..:** ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండవ ఎఎన్‌ఎంల పోస్టులను పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌రేట్ ధర్నా నిర్వహించి అనంతరం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ అంజుమ్ భానుకు సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో 2వ ఎఎన్‌ఎం యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రమీల, 2వ ఎఎన్‌ఎంలు వనిత, పద్మ, జ్యోతి, సత్యవాని, రాజేశ్వరి,వెంకటలక్ష్మి ,విజయలక్ష్మి , తోపాటు తదితరులు పాల్గొన్నారు

**మహబూబాబాద్ జిల్లాలో.:** సెకండ ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని వారి సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మహబూబాద్ జిల్లాలో ఎఐటియుసి ఆధ్వర్యంలో సెకండ ఎఎన్‌ఎం సమస్యల పైన ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్య క్రమంలో దీనావతి. అశ్విని, పద్మావతి, సరిత,కవిత,. శ్రీమతి, విజయ, పద్మ, లలిత, నీనా, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో.. :** గత 18 సంవత్సరాలుగా పిహెచ్‌సి, యూపిహెచ్‌సిలలో పని చేస్తున్న రెండవ ఎఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్‌ఎంలు స్వప్న దేవి, వినోద, మంజూల, సరితా, పుష్పలత, రాజేశ్వరీ, పూజిత, సువర్ణ, భారతి, పుష్పలత, అమృతాదేవి, సుజాత, పద్మ, శ్యామల, రత్తమ్మ, రజిని, ఇందిరా, అరుణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లో...


జయశంకర్ భూపాలపల్లిలో..


రంగారెడ్డి జిల్లాలో...


రాజన్న సిరిసిల్లలో...


జనగామలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు సిహెచ్ రాజిరెడ్డి


సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఎఎన్‌ఎంలయూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని శ్యామల ఆధ్వర్యంలో


ఆసిఫాబాద్ జిల్లాలో...


మహబూబాబాద్ జిల్లాలో...

## విద్యార్థులతో సున్నితంగా వ్యవహరించాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాఠశాలకు వచ్చే విద్యార్థుల పట్ల యాజమాన్యం సున్నితంగా వ్యవహరించాలని ఫరూఖ్‌నగర్ ఎంఇఒ మనోహర్ సూచించారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మనోహర్ మాట్లాడుతూ పట్టణంలోని శాస్త్ర పాఠశాలలో విద్యార్థి మృతి చెందడం బాధకరమని, మున్ముందు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రాజేంద్రప్రసాద్, డివిఎన్ స్వామి, రవిప్రకాష్, థామస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఫీయ సుల్తాన పాల్గొన్నారు.

# మహానగరి

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాచిగూడలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ డిటిఎఫ్ టీం పోలీసులు అరెస్టు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెంట్ కృష్ణప్రియ కథనం మేరకు.. పాతబస్తీకి చెందిన అబ్దుల్లా బిన్ అజీజ్ బర్వాజ్, మహ్మద్ ఖలీంలు కాచిగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్కన డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో డిటిఎఫ్ టీం టీడర్ పవన్‌కుమార్ తనసిబ్బందితో కలిసి దాడి చేశారు. వారిని సోదా చేయగా 25 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, 8 గ్రాముల విదేశీ ఒజి కుష్కు(డ్రగ్స్) దొరికింది. వీరికి సహకరిస్తున్న రషీద్ అలీఖాన్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ ముఠా ఐటి ఉద్యోగులకు డ్రగ్స్ సరఫరా చేస్తారని విచారణలో తేలింది.

## ప్రజల అభ్యున్నతి సిపిఐ లక్ష్యం

### పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** నిరంతరం ప్రజల అభ్యున్నతి సిపిఐ లక్ష్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజ రవీంద్రచారి అన్నారు. నాటినుంచి నేటివరకు ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే పార్టీ ఎజెండా అన్నారు. గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో కోహెడ గ్రామ శాఖ కార్యదర్శి చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమానికి రవీంద్రచారి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించిన సిపిఐ 2025 డిసెంబర్ వరకు 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 దశకంలోకి ప్రవేశిస్తున్న పార్టీలో సభ్యులుగా ఉండటం సంతోషకరమన్నారు. ఎందరో అమరుల నెత్తురు తడిసిన జెండా, ఎన్నో విజయాలు, అపజయాలు చవిచూస్తూ అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల అభ్యునతి, దేశాభివృధి కోసం పరితపించే నిజమైన ఉద్యమ రాజకీయ పార్టీ సిపిఐ అని తెలిపారు. పార్టీ నిర్మాణం, పటిష్టం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలనీ యువతను పార్టీ వైపు ఆకర్శింపచేయాలన్నారు, కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతారాజు నర్సింహా తదితరులు పాల్గొన్నారు

## ఎల్‌బినగర్ ప్రమాదకారకులపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ డిమాండ్

### జోనల్ కమిషనర్‌కు వినతి




**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ఎల్‌బినగర్‌లో సెల్లార్ తవ్వకాల సమయంలో మట్టిదిమ్మలు కూలిన ఘటనకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషాదకర ఘటనకు టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం అని, బిల్డర్ అబినవ్, కాంట్రాక్టర్ సిద్ధం సాయినాథ్‌దర్శన్ అశ్రద్ధ కారణమని ఆరోపించారు. గురువారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌ని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలు ఇంటి నిర్మాణాలకు అనుమతులు లేకపోతే అధికారులు వేధించి చర్యలు తీసుకుంటారని, కానీ జాతీయ రహదారి సమీపంలో అక్రమంగా భారీ సెల్లార్ తవ్వకాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో పాటు మైనింగ్‌శాఖ వైఫల్యం కూడా దీనికి కారణమని ఆరోపించారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టి ప్రాణాపాయ పరిస్థితులు సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎల్‌బినగర్ జోన్‌లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, కట్టడాలపై జిహెచ్ఎంసీ అప్రమత్తంగా ఉండాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వారిని శిక్షించడంతో పాటు మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎల్‌బినగర్ నియోజకవర్గ సహాయకార్యదర్శి బాతరాజు నరసింహా, ఎఐటియుసి ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి రమావత్ సక్రునాయక్, సరూర్‌నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు పూజారి శ్రీను, బోయపల్లి రాములుగౌడ్, ఎం.మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## నీరజ్ ఘటనపై విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ డిమాండ్

### శాస్త్ర స్కూల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

### పోలీసులు, విద్యార్థి సంఘాల మధ్య తోపులాట





**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** శాస్త్ర స్కూల్ ఘటనపై విచారణ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, నీరజ్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శాస్త్ర స్కూల్ వద్ద విద్యార్థి సంఘాల నేతలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. పోలీసులు విద్యార్థి సంఘాల నేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. విద్యార్థి సంఘాల నేతలు పాఠశాల గేటుపైకి ఎక్కి లోపలికి చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసేందుకు యత్నించారు. పట్టణ సిఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడుతూ వేల రూపాయాలు ఫీజులు తీసుకొని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం అడుతున్న ప్రవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నీరజ్ మృతికి కారణమైన శాస్త్ర పాఠశాల గుర్తింపును రద్దు చేయడంతోపాటు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయకార్యదర్శి ఆకాష్ సాయి, నరేష్, ఆమేర్, ఆకాష్ చౌహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సుమేర్, శివ, సాగర్‌లు పాల్గొన్నారు.

# ఎల్‌బినగర్ ఘటనపై జిహెచ్ఎంసి సీరియస్

### భవన నిర్మాణ అనుమతులు రద్దు చేస్తూ నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్ సెల్లార్ కూలిన ఘటనపై మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) సీరియస్ అయ్యింది. భవన నిర్మాణ అనుమతులను జిహెచ్ఎంసి రద్దు చేసింది. సెట్ బ్యాక్ లేకుండా అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నారని, బారికేడింగ్, ప్రమాద నివారణకు ప్రహారీగోడ లేకుండానే సెల్లార్ తవ్వకం జరిగిందని జిహెచ్ఎంసి అధికారుల విచారణలో స్పష్టమైంది. అసలు జిహెచ్ఎంసి అధికారులకు సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు జరిపారని, ముగ్గురు మృతికి కారణమయ్యారంటూ బిల్డర్స్‌పై జిహెచ్ఎంసి క్రిమినల్ కేసు నమోదు చేసింది. జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జిహెచ్ఎంసి ఈ కేసు పెట్టింది. యజమాని కుస్మా రమేష్‌పై 106(1) 125(ఎ) బిఎన్ఎస్ సెక్షల కింద ఎల్.బి.నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిహెచ్ఎంసి అదనపు సిటీప్లానర్ రజిత్ కుమార్, ఎల్.బి.నగర్ జోనల్ సిటీప్లానర్ శ్రీనివాస్ యాదవ్‌లు సంఘటన స్థలాన్ని, పరిశీలించి, విచారణ జరిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను కమిషనర్‌ను అందచేసిన అనంతరం భవన నిర్మాణ అనుమతులు రద్దు చేసినట్లు తెలిసింది. ఎల్.బి.నగర్‌లోని మన్సూరాబాద్ చంద్రపురి కాలనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందగా, భిక్షపతి అనే మరో కూలీ తీవ్రంగా గాయపడ్డారు. సెల్లార్ తవ్వకాలు జరుపుతున్న సమయంలో ఓవైపు నుంచి ఒక్కసారిగా మట్టిదిబ్బలు కూలాయి. ప్రమాద సమయంలో పలువురు కూలీలు అక్కడే ఉన్నారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే కొంత మంది కూలీలు పక్కకు జరిగి ప్రాణాలు కాపాడుకోగాలిగారు. నలుగురు కూలీలు మాత్రం మట్టిదిబ్బల కింద పడిపోయారు. వెంటనే సహాయ చర్యలు చేపట్టినప్పటికీ మట్టిదిబ్బల కింద ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ప్రమాదంలో గాయపడిన భిక్షపతి ఎల్.బి.నగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం శరీరంలో అక్కడక్కడ కొన్ని గాయలతో నిలకడగానే భిక్షపతి ఆరోగ్యం ఉన్నట్లు తెలిసింది.

## సెల్లార్ ప్రమాదంపై జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆగ్రహం

### సెల్లార్ తవ్వకాలపై కొత్త మార్గదర్శకాల రూపకల్పనకు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెల్లార్ తవ్వకాల ప్రమాదాల నివారణపై మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) దృష్టిసారించింది. ఎల్.బి.నగర్ సెల్లార్ కుంగిన ఘటనపై జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి సీరియస్ అయ్యినట్లు తెలిసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగం(టౌన్‌ప్లానింగ్) విభాగం చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్‌ను ఆదేశించినట్లు సమాచారం. ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. స్థల యజమానితో పాటు బిల్డర్, డెవలపర్, ఆర్కిటెక్చర్ ఇంజనీర్, ప్లానర్, సైట్ ఇంజనీర్‌లను బాధ్యులను చేసేలా కొత్తగా మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి టౌన్ ప్లానింగ్ చీఫ్ శ్రీనివాస్ దృష్టి సారించారు. ఇప్పటికే ఉన్న నియమ, నిబంధనలతో పాటు కొత్తగా సంబంధితులను బాధ్యులను చేసేలా కొత్తగా కఠిన నిబంధనలు అమల్లోకి తేవడం ద్వారా ప్రమాదాల నివారించవచ్చుననే యోచనలో కమిషనర్ ఇలంబర్తి ఉన్నారు. నగరంలో ఎదో ఒకచోట ప్రతిసంవత్సరం ప్రహారీగోడలు కూలిపోవడం, భారీ సెల్లార్‌ల తవ్వకాల సందర్భాల్లో మట్టి కూలిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిర్మాణ సంస్థలు సరైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా పలు మార్లు జరిగిన ప్రమాదాల సందర్భంలో తేలింది. ప్రధానంగా సెల్లార్ తవ్వకాలపై ప్రధానంగా దృష్టి సారించారు. భూసార పరీక్షలు జరపకుండానే పలు సంస్థలు సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిసింది. భూసార పరీక్షలు జరిపినా అందుకు తగ్గట్టు సెల్లార్ తవ్వకాల్లో అందుకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే సెల్లార్ తవ్వకాలపై నిర్ధిష్టమైన మార్గదర్శకాలు తీసుకరావాలని కమిషనర్ నిర్ణయించారు. దీంతో తరచుగా చోటు చేసుకునే సెల్లార్ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు అనే యోచనలో ఉన్నారు.

## ప్రాధాన్యత ప్రకారమే ప్రాజెక్టులు పూర్తి

### గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రాధాన్యత ప్రకారమే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాయక్ మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓ రోల్‌మాడల్‌గా అభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నారని, వారిని విమర్శించే నైతిక హక్కు బిజెపికి లేదని హెచ్చరించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం, పార్లమెంటరీ నాయకుడు పురుషోత్తంరెడ్డి, ఓబిసిసెల్ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్, గంగనమోని సత్తయ్య, లింగారెడ్డి గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తండాల్లో బిటి రోడ్ల నిర్మాణాలకు నిధులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేయడంతో పాటె తగిన ప్రాధాన్యత ఇస్తుందని గిరిజన ఆదివాసి కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా చైర్మెన్ శ్రీనునాయక్ వివరించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టి సబ్‌ప్లాన్ ద్వారా రూ.10కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.20కోట్ల నిధులు తండాల్లో బిటి రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మంజూరు అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి న తరువాతే ఎస్సీ, ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు తండాలకే ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్ర రవి నాయక్, కాంగ్రెస్ నేతలు నెహ్రు నాయక్, రూప్లానాయక్, శ్రీనివాస్ నాయక్, బాసు నాయక్, రమేష్ నాయక్, మేఘ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి మాదిగ మేధావుల ఫోరం కృతజ్ఞతలు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఎస్‌సి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం పట్ల సిఎం రేవంత్‌రెడ్డికి మాదిగ మేధావుల ఫోరం కృతజ్ఞతలు తెలిపింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం అధ్యక్షులు డా.అరెపల్లి రాజేందర్, గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ ఖాసీం, పురుషోత్తం, మల్లేశ్, విద్యాకమిషన్ సభ్యులు చారకొండ వెంకటేశ్‌లు మీడియాతో మాట్లాడారు. ఎస్‌సి కులాలకు సామాజిన న్యాయం దక్కాలని సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.

### వర్గీకరణ ఆమోదాన్ని స్వాగతిస్తున్నాం

ఎస్‌సి వర్గీకరణ చేసి, మాదిగ, మాదిగ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల స్వాగతిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు అమలుకు తక్షణమే జివో తేవాలని కోరారు. సమావేశంలో గుర్రాల శ్రీనివాస్, కేదాసి మోహన్, నేతలు మంచాల యాదగిరి, మేడి రమణ, చింతా బాబు పాల్గొన్నారు.




## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

### హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, సకాలంలో పనులు పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులో తీసుకోరావాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని గాయత్రి నగర్ కాలనీ, ఇన్ఫర్మేషన్ కాలనీలలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జిహెచ్ఎంసి ఏఇ రమావత్ హేము నాయక్‌తో కలిసి పరిశీలించారు.

## ప్రజల ఆరోగ్య సంరక్షణకు చర్యలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** కాలనీ ప్రజలు ఆరోగ్య సంరక్షణకు జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కొత్తపేట డివిజన్ కార్పోరేటర్ నాయకోటి పవన్‌కుమార్ తెలిపారు. కొత్తపేట డివిజన్ మానస ఎంక్లేవ్ కాలనీలో గురువారం కార్పోరే కార్యక్రమంలో నాయకులు సుందర్ నారాయణ, వెంకటరామయ్య, నవీన్, వెంకటేష్, అంబనీ, భాగ్యరేఖ, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌వ్యాన్ కిందపడి చిన్నారి మృతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ లో స్కూల్ వ్యాన్ కిందపడి నాలుగేళ్ల చిన్నారి రిత్విక మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సంఘటన సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన స్కూల్ వ్యాన్ డ్రైవర్ రివర్స్ తీస్తుండగా డ్రైవర్ వెనుకాల ఉన్నపాపను గమనించలేదు. దీంతో వ్యాను టైర్ల కిందపడి చిన్నారి పడి అక్కడికక్కడే మృతి చెందింది. హయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య స్కూలుకు రోజు లాగే పిల్లలు వెళ్లారు. సాయంత్రం స్కూల్ సమయం అయిపోవడంతో పిల్లలందరూ ఇంటికి వెళ్లేందుకు వ్యాన్ దగ్గరకు వచ్చారు. స్కూల్ పిల్లలందరూ బస్సు ఎక్కారు. అయితే ఓ చోట నాలుగేళ్ల చిన్నారి వ్యాన్ నుంచి దిగి రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుంది. చిన్నారి రోడ్డు పక్కన నడవడాన్ని డ్రైవర్ గుర్తించలేదు. వ్యాన్ ను రివర్స్ తీసే ప్రయత్నంలో వెనుకాల టైర్ల కింద పడి చిన్నారి చనిపోయింది. ఈ ఘటనలో చిన్నారి కుటుంబంలో, స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. డ్రైవర్ ను స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పాఠశాల ముందు ఆందోళన..** చిన్నారి మృతి చెందిన సంఘటన తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పాఠశాలకు చెందిన స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే విద్యార్థి మృతి చెందిందని, విద్యార్థిని ఆర్థికంగా ఆదుకోవాలని, బాధ్యుడైన డ్రైవర్‌ను శిక్షించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు.

## విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురైన..

# జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

### మంగళవారం సంతోష్ నగర్‌లో ప్రమాదం

### రోడ్డు ప్రమాదం జరిగితే పట్టించుకోరా?

### ఉన్నతాధికారులపై టి జిహెచ్ఎంఇయు అధ్యక్షుడు కె.బాలకృష్ణ ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధి నిర్వహణలో ఉన్న జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికురాలు అండలమ్మ మంగళవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె గురువారం మరణించారు. జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు అండలమ్మ విధులలో ఉండగా కారు ఢీకొంది. ఘటన జరిగిన వెంటనే ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆమె రెండు కాళ్లను తొలగించాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తలకు తీవ్రమైన గాయం కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించి, గురువారం మరణించినట్లు తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్(టి జిహెచ్ఎంఇయు) అధ్యక్షుడు కె.బాలకృష్ణ తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలికి ఇంత పెద్ద ప్రమాదం జరిగి అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయాన్ని తాము కమిషనర్ దృష్టికి తీసుకవెళ్లామని, అయినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కమిషనర్, అదనపు కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ప్రమాదానికి గురైన అండలమ్మ ఆరోగ్య పరిస్థితిని పట్టించుకపోవడంతో పాటు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. పేద కార్మికురాలైన అండలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, ఆమే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఇలాగే ఎన్నో ప్రమాదాలో అనేక మంది కార్మికులకు అంగవైకల్యం కలగడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కానీ, జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు కానీ విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైన రోడ్‌లపై విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల రక్షణకు చర్యలు తీసుకోవాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు. అండలమ్మ మృతి పట్ల బాలకృష్ణ, యూనియన్ నాయకుడు మల్లేష్ సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## సిఎం ఢిల్లీ పర్యటనకు ముందు బేగంపేట విమానాశ్రయంలో ప్రమాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీ పర్యటనకు కొద్ది నిముషాల ముందు బేగంపేట విమానాశ్రయంలో విమాన ప్రమాదం చోటుచేసుకుది. ఓ ట్రైనీ ఎయిర్ క్రాఫ్ట్‌ని బేగంపేట విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న సమయంలో అదుపుతప్పి రన్ వే నుంచి పక్కకు ఒరిగిపోయింది. ఎయిర్ క్రాఫ్ట్ ముందు చక్రం వంగిపోవడంతో రన్ వే ను చీల్చుకుంటూ కొంత దూరం ముందుకు వెళ్లింది. దీంతో రన్ వే దెబ్బతిన్నది. ఈ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా ఈ ఘటన జరిగిన వెంటనే ఎయిర్ పోర్టు సిబ్బంది స్పందించి అవసరమైన చర్యలు చేపట్టారు. పాడైన రన్‌వే వెంటనే మరమ్మతులు చేశారు.. దీంతో బేగంపేట విమానాశ్రయంలో విమానాల రాకపోకలు కొంత అంతరాయం కలిగింది. సిఎం టూర్‌కు ముందు ఈ ప్రమాదం జరగడం కలకలం రేపింది.

# మహానగరి

## నీటి సమస్యలు రాకుండా చూడాలి



ప్రజాపక్షం/దుండిగల్ : మున్సిపల్ పరిధిలోని నవ వార్డులో నీటి ఎద్దడి కారణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ప్రైమరీ హెల్త్ సెంటర్ కూడా నీటి ఇబ్బంది కలగకుండా చర్య తీసుకోవాలని మాజీ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్ అన్నారు. ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని నీటి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిరాజుద్దీన్, మాజీ వార్డు సభ్యుడు మసూద్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/శామీర్‌పేట : భూసారంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అనంతరం భూసార పత్రాలను కార్డు రూపంలో రైతులకు అందజేస్తున్నామని శామీర్‌పేట ఎఇఒ రవియాదవ్ అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో ఇక్రిశాట్, లారస్ ల్యాబ్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. నేల ఆరోగ్యంపై నివేదికలు, సాయిల్ హెల్త్ కార్డు రూపంలో అందించారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




ప్రజాపక్షం/ఆల్వాల్ : మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం ఆధ్వర్యంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంట్రాక్టర్, ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు అందజేయాలి. మున్సిపల్ లో ఉన్నటువంటి ఖాళీలను పరిశుద్ధ కార్మికులు ఎస్ఎఫ్ఏలు ఎలక్ట్రికల్స్ కార్మికులను భర్తీ చేయాలి. కార్మికులకు రావలసిన ఇంక్రిమెంట్లు రిటైర్డ్ అయి చనిపోయిన కార్మికులకు పెన్షన్లు డిఏ ఇంక్రిమెంట్లు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. మున్సిపల్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హరినాథ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు మహేందర్, ఉపాధ్యక్షులు తిరుపతి, అల్వాల్ మున్సిపల్ సంఘం అధ్యక్షులు సయ్యద్ కౌసర్, కార్యదర్శి డి.రాజు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ పార్క్ అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/అల్వాల్ : ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించే విధంగా మచ్చబొల్లారం డివిజన్ వెంకన్న కాలనీలో పార్కుల అభివృద్ధికి కృషి చేసిన మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్‌కు కాలనీవాసులు ఎంత రుణపడి ఉంటామన్నారు. వెంకన్న కాలనీపార్కుస్థలం గతంలో అన్యాక్రాంతమయ్యే పరిస్థితుల్లో కాలనీ వాసులు ఎంత పోరాటం చేసి పార్కు స్థలాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆ స్థలాన్ని పట్టణ ప్రగతి నిధులతో పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. పార్కు స్థలం అభివృద్ధికి పాటుపడిన మాజీ ఎమ్మెల్యే కార్పొరేటర్‌కు వెంకన్న కాలనీ వాసులందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, జనరల్ సెక్రెటరీ శశిధర్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ప్రజాపక్షం/ నిజాంపేట్ : నిరుపేద ప్రజలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరంలా పనిచేస్తుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్‌లో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పెందిన కటకమ్ శ్రీనివాస్‌కి రూ. 60,000, కేతావత్ మంగమ్మకు రూ. 22500, ఎండి బషీర్‌కు రూ. 60,000ల చెక్కులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతగానో సహాయపడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమం కోసం ప్రజాపాలన ముందుకు వెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో జేమ్స్, అమర్ బాబు, ధరణి, మధు, భరత్, మోతె శ్రీనివాస్, రాములు, సంజీవ్ పాల్గొన్నారు.

## చెత్తను జిహెచ్‌ఎంసి వాహనాల్లోనే వేయాలి



ప్రజాపక్షం/మల్కాజిగిరి : పరిసరాల పరిశుభ్రత కోసం చెత్తా చెదారాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై పదేయకుండా చెత్తను తీసుకొని వెళ్లే వాహనాల్లోనే వేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ సూచించారు. డివిజన్‌లో ఎక్కడైనా నీటి సమస్య, రోడ్లు, డ్రైనేజిలాంటి సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కోరారు. గురువారం డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రాంతంలో జిహెచ్‌ఎంసి ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇనస్పెక్టర్ రజనీకాంత్‌లతో కల్సి పర్యటించారు. తమ ప్రాంతంలో చాలా కాలంగా ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యను పరిష్కరించాలని జవహర్‌నగర్ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ,మల్లేష్ గౌడ్, జాన్, కేసి రెడ్డి, ముత్యం రెడ్డి, కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆశా' సమస్యల పరిష్కారానికి సహకరిస్తా



ప్రజాపక్షం/మల్కాజిగిరి : నిరంతరం శ్రమించే ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా తాను కృషి చేస్తానని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. గురువారం డివిజన్ కార్యాలయంలో ఆశా వర్కర్లు కల్సి తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడించటంతో ఆయన సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించటంతో పాటు హెల్త్ కార్డులను ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## 10న మేడ్చల్ 'ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా'

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటిఐలో పలు సంస్థల్లో అప్రెంటీస్‌లుగా ఎంపిక చేసేందుకు ఈ నెల 10న జాబ్‌మేళా జరుగుతుందని ఐటిఐ ప్రిన్సిపాల్ హనుమ నాయక్ పేర్కొన్నారు. షెనిడర్ ఎలక్ట్రిక్, రాణే ఇంజన్ వాల్వ్స్, ఫేనెషా,మేఘ ఇంజనీరింగ్,రాక్వెల్, మహేంద్ర లాంటి 30 సంస్థల్లో ఉన్న 800కు పైగా ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళాలో పాల్గొంటారన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదో తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తమ ఎస్ఎస్‌సి, ఐటిఐ మెమో, ఆధార్ కార్డు, పాన్ కార్డు, సేవింగ్ బ్యాంకు ఖాతా పాస్‌బుక్, పాస్‌పోర్టు ఫోటో, బయోడాటాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

## ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం

### అబ్రహం లింకన్, బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్




ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : విద్యర్థులు గట్టి నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరు అయ్యేలా సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. వికారాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ప్రేరణ ,శిక్షణ కర్యక్రమాన్ని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి వసతిగృహ విద్యార్థిని విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై తర్ఫీదు మనోధైర్యాన్ని, వ్యక్తిత నైపుణాన్ని పెంచేందుకు నిష్టాతులైన ఉపాధ్యాయులు ,సునీత మేరీ, మాధవాచారి, వేణుగోపాల్,ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రేరేపకులు, కె.రామచంద్రుడు, కె. మాదవి, మహేందర్, ఉదయ్‌కుమార్, గోపీనాథ్, రమేష్‌లు తరగతులను నిర్వహించడం .జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మట్లాడుతూ పరీక్షలు అతి సమీపంలో ఉన్నాందున సమయం వృదా చేయకుండా ,ప్రతి సబ్జెక్టులో తమ నైపూణ్యాన్ని మెరుగుపరచకోవాలన్నారు. ప్రేరణ ,శిక్షణ తరగతుల్లో మోటివేటర్స్ సూచించిన మెలకువలను పాటస్తు అతి సులభతరంగా ఆర్థం చేసుకొని అన్ని ప్రశ్నాలకు సమాదానాలు చేసే విధంగా విద్యార్థిని,విద్యార్థులు సన్నద్ధం కావాలనీ కలెక్టర్ తెలిపారు. అతి పేద కుటుంబంలో జన్మించిన అబ్రహం లీంకన్ ప్రపంచంతో అతిపెద్ద దేశమైన అమెరికాకు అధ్యక్షులయ్యారని ,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేదరికంతోపాటు సమాజంలో ఎంతో వివక్షతకు గురైనప్పటికీ తను లక్ష సాధన దిశగా పయనిస్తు భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని ఇలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగాలని కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం తదితరులు పాల్గోన్నారు.

### డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి : జిల్లా కలెక్టర్

వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం నుండి దృష్యా మాద్యం ద్వారా పంచాయతీ రాజ్ , ఆర్అండ్‌బి , మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గంలో చేపట్టిన డబల్‌బెడరూమ్ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అదేశించారు. అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 851 ఇండ్లు పూర్తి అయినవని ,మిగతా పనులు జరుగుతున్నాయని త్వరతగా పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తే పేదవారికి ఇండ్లు అందుబాటులోకి వస్తాయిని ,పూర్తి అయిన ఇండ్లకు అన్ని మౌలిక సుధపాయలు కల్పించాలని అధికారులను అదేశించారు. వికారాబాద్ జిల్లాలోని 30 పాఠశాలను పిఎంఎస్‌ఎచ్ ఆర్ఐ స్కీం క్రింద ఎంపిక చేయడం జరిగింది అని కలెక్టర్ తెలిపారు. ఇందులో 6 అదర్శపాఠశాలలు, 2 కస్తుర్బాగాంధీ, 2 సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, 2 గురుకుల పాఠశాల, 18 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఎంపికైనా పాఠశాలలో మౌలిక వసతులు కల్పిండం జరుగుతుంని అన్నారు.అనంతరం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకదేవి,ప్రధానోపాధ్యాయులు పాల్గోన్నారు.

## రసాయనాల కంపెనీలను తరలించాలి



ప్రజాపక్షం/చర్లపల్లి : రసాయనాల కెంపెనీలను తరలించాలని, ప్రమాణాలను పాటించని పరిశ్రమలను మూసి వేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి దామోదర్‌రెడ్డి అన్నారు. ఇటీవల చర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఫేస్1లో సర్వోదయ కెమికల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం సంభవించడంతో సిపిఐ బృందం పరిశీలించారు.చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న రసాయనాల నిర్లక్ష్యం కారణంగా తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నామన్నారు. శివారు ప్రాంతాలోని జీడిమెట్ల,బాలానగర్, బొల్లారం, చర్లపల్లి పారిశ్రామికవాడల్లో గతంలో కంటే అగ్ని ప్రమాదాలు పెరుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ద్వారా పరిశ్రమలలో పని చేసే కార్మికుల భద్రతకు నిర్దష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు,నర్సింహ,నర్సింగ్‌రావు, స్వామిదాస్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



ప్రజాపక్షం/నాగారం : నిర్మాణదారులు రెసిడెన్షియల్‌కు టిజిబి పాస్ అనుమతులు పొందాలని కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం ప్రధాన రహదారిలో బాలాజీ స్వీట్ హౌస్‌పైన నిర్మించిన 2,3 అంతస్తులు,రిక్వీల్ఫోర్డ్ స్కూల్ కమాన్ వద్ద నిర్మించిన సెల్లార్,మోదటి అంతస్తు,రాంపల్లిలోని లక్ష్మి నగర్ కాలనీలోని రేకుల షేడ్‌ను కమిషనర్ ఆదేశాల తో టిపిఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో సిబ్బందితో కలసి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.కమర్షియల్ నిర్మాణాలకు హెచ్ఎండిఏ నుండి అనుమతి తీసుకోవాలని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

## పన్ను చెల్లించని ఇల్లు సీజ్



ప్రజాపక్షం/దమ్మాయిగూడ : ఇంటి పన్ను చెల్లించనిచో ఇంటికి సీల్ వేస్తామని దమ్మాయిగూడ కమిషనర్ నాగమణి అన్నారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధికి చెందిన చంద్ర బాబురావు, చంద్ర శిరీషాలు కమర్షియల్ ఇంటిపన్ను బకాయిలు చెల్లించని కారణంగా వారి ఇంటికి సీల్ వేయడం జరిగిందని తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని వారు ఇంటి పన్నులు త్వరితగతిన కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. బకాయిలు చెల్లించాని వారికి ఇంటిని సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం,వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరి

### బంగారం, వెండి, నగదు ఆపహరణ

ప్రజాపక్షం/తాండూరు : పట్టగలు బయటకు వెళ్ళి వచ్చేసరి ఓ ఇంటిని గుల్లా చేసిన ఘటన గురువారం తాండూరు పట్టణ పరిధి పాత కుంటలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి తాళం వేసి బయటకు వెళ్ళి వచ్చేసరికి గంట వ్యవది లోనే ఇంట్లోకి చొరబడిన దోపిడి దొంగలు బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును ఆపహరించుకపోయ్యారు. తాండూరు పట్టణ పరిధి ఆదర్శనగర్ పాత కుంట సమీపంలోనే విఘ్నేశ్వర కాలని చెందిన అశోక్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మధ్యాహం ఆసుపత్రికి వెళ్ళేందుకు గాను ఇంటికి తాళం వేసి వెళ్ళారు. తిరిగి గంటలోపు ఇంటికి వచ్చే సరికి ఇల్లు గుల్ల చేశారు. తాళం విరిగి ఉండడంతో ఇంట్లోకి వెళ్ళి చాడగా ఇంట్లో వస్తువులన్ని చిందరవందరగా పడి ఉన్నాయని, ఇంట్లోని బీరువా ఇతర ప్రాంతాలను పరిశీలించగా రెండు తులాల బంగారం , 20తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.30వేల నగదును ఎత్తుకెళ్ళారని బాధితులు తెలిపారు. జరిగన ఘటనపై తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.





## ఎస్‌సి వర్గీకరణపై మాట తప్పని కాంగ్రెస్



ప్రజాపక్షం/శామీర్‌పేట : ఎస్‌సి వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాహుల్ గాంధీ జోడోయాత్రలో దళితులకు ఇచ్చిన హామీ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణ తీర్మాణ బిల్లుకు అమోదం తెలిపారని, డెబ్బై ఏళ్లలో నెరవేరని దళితుల ఆకాంక్ష సిఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలు నెరవేర్చారని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టిలకు చెందిన అన్ని వర్గాలకు కులగణనతో సమన్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లతో ప్రతి ఒక్క వర్గానికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా న్యాయం జరుగుతుందన్నారు. తీన్మార్ మల్లన్న సమగ్ర సర్వేపై తప్పుగా మాట్లాడటం సరైంది కాదని ఎమైన పొరపాటు జరిగితే సరిదిద్దుకుందామని పార్టీలో కూర్చుని మాట్లాడాలని హితవు పలికారు. సమగ్ర కులగణనపై చర్చకు సిద్ధంగా ఉన్నామని చర్చకు రావాలని బిఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, ఏ బ్లాక్ అద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, శామీర్‌పేట అద్యక్షుడు శంకర్‌గౌడ్, తూంకుంట అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : పారిశుద్ధ్య సబ్బంద సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ ఎఐటియుసి డిమాండ్ చేసింది. పారుశుద్ధ్య సిబ్బంది సమస్యల వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఆల్వాల్ జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాయం డిప్యూటి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎఐటియుసి రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, మేడ్చల్ జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షుడు వి.హరినాథరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాసులు, మేడ్చల్ మున్సిపల్ నాయకులు భిక్షపతి, డి.కృష్ణ,పద్మ, మంజుల, జానకి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా నిరుపేదలైన పారిశుద్ధ్య కార్మికులు నిత్యం గ్రామ పరిసర ప్రాంతాలు, డ్రైనేజిలు, ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నారన్నారు. ఆరోగ్య బీమా, ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలన్నారు.

## రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధం




ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : 20242025 రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను అదేశించారు. ధాన్యం సేకరణ కార్యచరణ ప్రణాళిక 2024–25 సిఎంఆర్ డెలివరీ ,రేషన్ కార్డులు, ,మిల్లర్ల అసోసియేషన్ల బ్యాంక్ గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై పౌరసరఫరాల ముఖ్య కార్యదర్శి డిఎస్ చౌహన్ ఉన్నత అధికారులతో కలిసి విడియో కాన్పిరెన్స్ ద్వారా సమీక్షసమావేశం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 రబీ సీజన్‌లో 2,25,000మెట్రిక్ టన్నులవరి ధాన్నం వస్తుందని అంచనావుందని అన్నారు. లక్షటన్నుల ధాన్నాని సేకరించేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. 2023–24కు సంబంధించి వందశాతం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బబు ,జిల్లా మేనేజర్ విజయలక్ష్మి ,వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి ,జిల్లా మార్కెటింగ్ శాఖ సారంగాపాణి సంబంధిత శాఖ అధికారులు పాల్గోన్నారు.

## మాజీ పాలకవర్గం సభ్యులకు సత్కారం

ప్రజాపక్షం/నాగారంః పదవులకే విరమం కానీ పదవులకు కాదని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,మాజీ కౌన్సిలర్లు అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణలో స్థానికులు ముగిసిన పాలక వర్గం సభ్యులు చైర్మన్,కౌన్సిలర్లు గూడురు సబితాఅంజనేయులుగౌడ్,కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి,రేణుక,మమత,సుమిత్రాసురేష్ సత్కారం చేశారు. ప్రజా సేవలో ఎప్పుడు ముందుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిల హక్కుల సాధనకు సంఘటితం కావాలి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : రాష్ట్రంలో అధిక సంఖ్యలో బిసిల జనాభా ఉన్నప్పటికి అడుగడుగునా అన్నాయం జరుగుతోందని, ప్రభుత్వం బిసిలకు సమాన న్యాయ హక్కులు కల్పించేందుకు ముందుకు రావాలని బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు సి.హెచ్.దశరథ్ కోరారు. బిసిలకు చిరకాలంగా అడుగడుగునా జరుగుతున్న అన్యాయం కారణంగా విద్య, ఉపాధి, రాజకీయ తదితర రంగాల్లో ఎదగలేక పోతున్నారని వాపోయారు. సమస్యల పరిష్కార డిమాండ్ ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లటంలో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామని, దీంతో పాటు అన్ని తహసీల్దార్లకు బిసి హక్కుల సాధన సమితి శ్రేణులు వినతిపత్రాలను సమర్పించారన్నారు. బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బడ్జెట్‌లో బిసిల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, సబ్సిడీపై వృత్తిదారులక రుణాలు అందించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బిసి భవన్ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.. కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో కార్య నిర్వాహక అధ్యక్షులు ప్రమీల, ఉపాధ్యక్షులు జె.లక్ష్మి , కృష్ణ, కోశాధికారి గిరిజా కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులు నరేందర్ ప్రసాద్, జంగయ్య, ఎం,రాజేశ్వరి, బండ్ల నరేంద్రచారి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింహ, యాదయ్య, నాగరాజు, శీను, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీక్లీ మార్కెట్ వ్యాపారులు చెత్తను వాహనాల్లో వేయాలి

### కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ప్రతి వారం వివిధ ప్రాం తాల్లో జరిగే వీక్లీ మార్కెట్లలో వెలువడే చెత్తా చెదారాన్ని తప్పని సరిగా జిహెచ్‌ఎంసి వాహనాల్లోనే వేయాలని జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ డిప్యూటి కమిషనర్ జగన్ సూచించారు. సర్కిల్ పరిధిలోని 26 ప్రాంతాల్లో ఆయా ప్రాంత వాసులకు అందుబాటులో ఉండే విధంగా కూరగాయల అమ్మకాల కోసం సాయంత్రం నుండి రాత్రి వరకు వీక్లీ మార్కెట్లు కొనసాగుతుండటం, అమ్మకాలు పూర్తయ్యాకా వ్యాపారులు తమ పెద్ద మొత్తంలో మిగిలి పోయిన కూరగాయల చెత్తా చెదారాన్ని అక్కడే పడవేస్తునండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని ఈ సందర్భంగా డిసి తెలిపారు. మరుసటి రోజు ఈ చెత్త అంతా పారిశుద్ధ్య సిబ్బంది తొలగించే వరకు ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందన్నారు. వ్యాపారస్తులు తమ వద్ద మిగిలి పోయి ఉన్న చెత్తను రోడ్లపై కాకుండా వీక్లీ మార్కెట్ వద్ద చెత్త తరలించే వాహనాలను ఏర్పాటు చేసి వాటిలోనే వేసే విధంగా కూరగాయల వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిలోని భాగంగా గురువారం రాధికా మల్టిప్లెక్స్ సమీపంలోని మహేష్‌నగర్, ఎంజె రోడ్ మార్గాల్లో జరిగే వీక్లీ మార్కెట్‌లో సానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు కృష్ణరాజన్, రామకృష్ణ, ఎస్ఎఫ్ఏ శిరీష,లక్ష్మి , అరవింద్, ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఏ అంజలి, మిరియాల సాయిలు గౌస్.పరమేష్ తదితరులు వాహనాలను అందుబాటులో ఏర్పాటు చేసి మధ్యాహ్నం నుండి మైకుల ద్వారా అమ్మకాల అనంతరం మైకుల్లో ప్రచారం చేసారు. పారిశుద్ధ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ మార్కెట్ వ్యాపారస్తులు సహకరించాలని వారు కోరారు.

## ఆసుపత్రిలో పనిచేసే కార్మికులకు జీతాలు

### రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర డిమాండ్



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నా లుగు నెలల నుండి జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు కల్లూరి జయచంద్ర తెలిపారు. గురువా రం కార్మికులు ఎర్రజెండాలు పట్టుకొని ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యూనియన్ నాయకులు కల్లూరి జయచంద్ర కార్మికు ల ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు నిర్ణయం మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో పనిచేసే కార్మికులు ఆరవ తేదీ నుండి ప్రతి రోజు ఆసుపత్రి ముందు గంట విధులకు హాజరు కాకుండా ఉండాలని ఎఐటియుసి పిలుపునిచ్చింది. మెడికల్ యూనియన్ ప్రభుత్వానికి ప్రతి సాధన సిహెచ్,పిహెచ్‌సి ఉన్న సూపర్డెం ట్ ద్వారా సిబ్బందికి వేతనాలు ఇచ్చే విధానాన్ని అమ లు చేయడం వలన సమస్య ఇంత జటిలంగా ఉండదని జయచంద్ర అన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చేది ఒక సిబ్బందికి 15,వేల ఆరువందలు కాంట్రాక్ట్ సిబ్బందికి ఇచ్చేది కేవలం 10వేల ఐదువందల రూపాయలు ప్రభుత్వం గుర్తించి కాంట్రాక్ట్ వ్యవస్థని రద్దు చేయాలని ఆసుపత్రి సూపర్డెంట్ ద్వారా సిబ్బందికి వేతానాలు ఇచ్చే వ్యవస్థను తీసుకొస్తే కార్మికులకు వేతనాలు పెంచవచ్చని కల్లూరి జయచంద్ర ప్రభుత్వానికి సూచించారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించే విదంగా చూడాలని లేనిచో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు కార్మికులచే పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, శివమ్మ, ఊర్మిళ, కృష్ణ, లూధియా, బాలమ్మ,పుష్ప, నాగమ్మ, పుష్ప, స్వరూప, ప్రేమలత, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## మలుపు తిప్పిన శ్రేయస్ అయ్యర్

### టీమిండియా ఘన విజయం!



ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. నాగ్‌పూర్ వేదికగా గురువారం జరిగిన తొలి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. బౌలింగ్‌లో హర్షిత్ రాణా, జడేజా సత్తా చాటగా.. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ రాణించారు.

**రఫ్ఫాడించిన జడేజా..**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జోస్ బట్లర్(67 బంతుల్లో 4 ఫోర్లతో 52), జాకోబ్ బెతెల్(64 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(3/26), అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా(3/53) మూడేసి వికెట్లు తీయగా.. మహ్మద్ షమీ, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం భారత్ 38.4 ఓవర్లలో 6 వికెట్లకు 251 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. శుభ్‌మన్ గిల్(96 బంతుల్లో 14 ఫోర్లతో 87 ), అక్షర్ పటేల్(47 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 52 ) శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సకీబ్ మహ్మూద్(2/47), ఆదిల్ రషీద్(2/49) రెండేసి వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ పడగొట్టారు.

సూపర్ ఫీల్డింగ్‌తో ఫిల్ సాల్ట్‌ను రనౌట్ చేసిన శ్రేయస్ అయ్యర్.. బ్యాటింగ్‌లో రెండు కీలక వికెట్లు కోల్పోయిన తర్వాత దూకుడుగా ఆడి మ్యాచ్‌ను భారత్‌వైపు మలుపు తిప్పాడు. ఇంగ్లండ్ పేలవ ఫీల్డింగ్ కూడా భారత్‌కు కలిసొచ్చింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డే ఆదివారం కటక్ వేదికగా జరగనుంది.

**చెలరేగిన అయ్యర్, గిల్**

అనంతరం అదే జోరు కొనసాగించిన అయ్యర్ 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గిల్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో భారత్ 14 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుంది. క్రీజులో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని జాకోబ్ బెతెల్ విడదీసాడు. అయ్యర్‌ను ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 94 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అయ్యర్ ఔటైనా.. క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ ఆచితూచి ఆడాడు. ఈ క్రమంలో అతను 60 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

## మరో లీగ్ లోకి కావ్య ఎంట్రీ!.. రూ.1092 కోట్ల డీల్



హండ్రెడ్ లీగ్‌లోకి వరుసగా ఐపిఎల్ ఫ్రాంఛైజీలు అడుగుపెడుతున్నాయి. ఇప్పటికే ముంబయి, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఎంట్రీ ఇవ్వగా.. తాజాగా మరో ఐపిఎల్ టీమ్ కూడా అడుగు పెట్టింది. నార్తర్న్ సూపర్ చార్జర్స్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ భాగస్వామ్యమైంది. ఈ ఫ్రాంఛైజీలోని 49 శాతం వాటాను సన్ గ్రూప్ కొనుగోలు చేసింది. తద్వారా 'హండ్రెడ్ లీగ్ లో వాటాను కొనుగోలు చేసిన మూడో ఐపీఎల్ జట్టు యాజమాన్యంగా సన్ గ్రూప్ నిలిచింది. బిడ్డింగ్ లో గెలుపొందిన సన్ గ్రూప్ ను.. నార్తర్న్ సూపర్ చార్జర్స్ లో 49 శాతం వాటాను సుమారు 100 మిలియన్ బ్రిటన్ పౌండ్లకు దక్కించుకున్నట్లు తెలిసింది. అంటే భారతీయ కరెన్సీలో రూ.1092 కోట్లు అన్న మాట. సన్ గ్రూప్.. ఐపిఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ తో పాటు సౌతాఫ్రికా టి20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీమ్‌ను మెయిన్ టెయిన్ చేస్తోంది. దీంతో సన్ గూప్ ఖాతాలో మూడో జట్టు వచ్చి చేరినట్టైంది. కాగా, ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ కు సంబంధించిన వ్యవహారాలను కావ్య మారన్ చూసుకుంటోందన్న సంగతి తెలిసిందే.

## అందుకే విరాట్ కోహ్లీ ఆడటం లేదు: రోహిత్ శర్మ



మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో ఇంగ్లండ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. టాస్ గెలిస్తే తాము బౌలింగ్ చేయాలనుకున్నామని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. 'ఆరంభంలో కాస్త దూకుడుగా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకునేందుకు తగిన సమయం దొరికింది. ఛాంపియన్స్ ట్రోఫీ ముందు ఇది మాకు మంచి అవకాశం. కాస్త గేమ్ టైమ్ దొరకడం ముఖ్యం. మాకు దక్కిన అవకాశాలను సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తాం. యశస్వి జైస్వాల్, హర్షిత్ రాణా ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేస్తున్నారు. దురదృష్టవశాత్తు ఈ మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ దూరమయ్యాడు. గత రాత్రి అతనికి మొకాలి నొప్పి వచ్చింది. దాంతో ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

# రీల్

## రామ్ పోతినేనితో అగ్ర హీరో..



ఎనర్జిటిక్ స్టార్ 'రామ్ పోతినేని'గత ఏడాది 'డబుల్ ఇస్మార్ట్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే.ఎన్నో అంచనాల మధ్య 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్ గా వచ్చిన డబుల్ ఇస్మార్ట్ భారీ డిజాస్టర్ ని అందుకొని,రామ్ అభిమానులని,ప్రేక్షకులని నిరాశపరిచింది.దీంతో ఈ సారి ఎలాగైనా హిట్ కొట్టాలని,తనకి అచ్చొచ్చిన లవర్ బాయ్ ఇమేజ్ తో కూడిన సినిమాలో చేస్తున్నాడు. ఇప్పుడు ఈ మూవీలో ఒక అగ్ర హీరో నటించబోతున్నాడు.ఇందుకు గాను తెలుగుతో పాటు తమిళ,మలయాళ,భాషలకి చెందిన కొంత మంది హీరోల పేర్లని చిత్ర యూనిట్ పరిశీలిస్తుంది.దీంతో ఏ హీరో ఈ ప్రాజెక్టు లో భాగస్వామ్యమవుతాడు,ఆ క్యారక్టర్ ఎలా ఉండబోతోందనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఏర్పడింది.హీరో ఎంపిక పూర్తయ్యాక ఈ విషయంపై అధికార ప్రకటన రానుంది.ఇంకా టైటిల్ నిర్ణయించని ఈ మూవీలో మిస్టర్ బచ్చన్' ఫేమ్ 'భాగ్యశ్రీ బోర్సే'హీరోయిన్ గా చేస్తుంది.ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలు ఒక లెవల్లో ఉండటంతో,రామ్ అభిమానులతో పాటు,ప్రేక్షకుల్లో కూడా ఈ మూవీ పట్ల పాజిటివ్ వైబ్రేషన్స్ ఉన్నాయి.మిస్ శెట్టి,మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీని మైత్రి మూవీ మేకర్స్అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తుంది.ప్రస్తుతం హైదరాబాద్ లోనే పలు లొకేషన్స్ లో షూటింగ్ జరుగుతుండగా,చిత్ర యూనిట్ మరికొన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రి కి తరలి వెళ్లనుంది.అక్కడే ఒక నెలరోజుల పాటు ప్రధాన తారాగణం పై కీలక సన్నివేశాలని చిత్రీకరించనున్నారు.

## ఫన్ రైడ్‌గా విశ్వక్ సేన్ 'లైలా' ట్రైలర్



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటించిన లేటెస్ట్ మూవీ 'లైలా' ఫిబ్రవరి 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు రామ్ నారాయణ్ పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాడు. ఇక ఈ సినిమాలో విశ్వక్ సేన్ తొలిసారి లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ఈ అంచనాలను పెంచాయి. అయితే, తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం ఫన్ రైడ్‌గా కట్ చేశారు మేకర్స్. సోను మోడల్ పాత్రలో విశ్వక్ సేన్ యాక్టింగ్.. అతడు చేసే కామెడీ ఆకట్టుకోనుందని ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక అతడు ఎదుర్కొనే సమస్యల కారణంగా లైలా గా ఎందుకు మారాడు అనేది మనం సినిమాలో చూసి తెలుసుకోవాల్సిందే. అయితే, లేడీ పాత్రలో విశ్వక్ సేన్ చేసే అల్లరి మామూలుగా ఉండబోదని చిత్ర యూనిట్ ఈ ట్రైలర్‌లో ప్రజెంట్ చేశారు. అటు హీరోయిన్ ఆకాంక్ష శర్మ తన గ్లామర్ షోతో యూత్‌ను ఆకట్టుకోనుంది. లియోన్ జేమ్స్ సంగీతం మేజర్ అసెట్‌గా రానున్న ఈ సినిమాపై ఈ ట్రైలర్ అంచనాలను రెట్టింపు చేసింది. ఇక షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## స్టార్ బాయ్ జాక్ టీజర్ రెడీ!



మన టాలీవుడ్ యంగ్ అండ్ స్టార్ హీరోస్ లో స్టార్ ఎంటర్టైనర్ డిజె టిల్లు హీరో సిద్ధూ జొన్నలగడ్డ కూడా ఒకడు. మరి సిద్ధూ హీరోగా నటించిన ఓటిటి హిట్ చిత్రం కృష్ణ అండ్ హిజ్ లీలా సినిమా థియేటర్స్ లో రీరిలీజ్ కి రాబోతుండగా ఈ సినిమా కాకుండా తన నుంచి ఇపుడు రాబోతున్న మరో సినిమా జాక్. దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెరకెక్కించిన ఈ సినిమా పట్ల మంచి బజ్ మొదటి నుంచి ఉండగా ఇపుడు ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ కి డేట్ అండ్ టైం ని ఇచ్చేసారు. దీనితో నేడు ఉదయం 11 గంటల 7 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. మరి ఈ క్రేజీ థ్రిల్ రైడ్ ఎలా ఉంటుందో చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో వైష్ణవి చైతన్య హీరోయిన్ గా నటించినగా బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ ఏప్రిల్ 10న సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కి రాబోతుంది.

# 'వర్సిటీ'ల ఆర్థిక అవసరాలు తీర్చేందుకే యుజిసి

### విశ్వ విద్యాలయాలను ఆదేశించేందుకు, నిర్ణయాలు చేసేందుకు కాదు

### యుజిసి నిబంధనలు - రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో జోక్యం: సదస్సులో వక్తలు




ప్రజాపక్షం/హైదరాబాద్: రాజ్యాం గంలోని సమైఖ్యస్ఫూర్తిని, రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని, తెలంగాణ రాష్ట్ర విద్య, సాంస్కృతిక హక్కులను పరిరక్షించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) మార్గదర్శకాలను 2025'వ్యతిరేకించాలనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరికి తెలంగాణ విద్యా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ విద్యావేత్తల సదస్సు మద్దతునిస్తూ తీర్మానం చేసింది. ''యుజిసి నిబంధనలురాష్ట్ర విశ్వవిద్యాలయాలలో జోక్యం'' అనే అంశంపైన హైదరాబాద్‌లోని ఎస్‌సిఇఆర్‌టి క్యాంపస్ లోని గోదావరి కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ప్రముఖ విద్యావేత్తలతో సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ అధ్యక్షత వహించారు. యుజిసి పాలసీని ఉపసంహరించుకోవాలని, ఇది సమాఖ్య స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

**యుజిసి తన పరిధి దాటుతుంది: జస్టిస్ సుదర్శన్ రెడ్డి**

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ యుజిసి తన అధికారాల పరిధిని దాటి సిఫారసులు చేస్తున్నదని ఆక్షేపించారు. విశ్వవిద్యాలయాల ఆర్థిక అవసరాలు తీర్చేందుకే యుజిసి ఏర్పడిందని, కానీ యూనివర్సిటీలను ఆదేశించేందుకు లేదా యూనివర్సిటీలలో నిర్ణయాలు చేసేందుకు కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య తర్వాత దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాల్లో పరిస్థితులపై పెద్ద ఎత్తున చర్చ జరిగిందని, ఆ తర్వాత ఢిల్లీ జెఎన్‌యు విశ్వవిద్యాలయ విద్యార్థి కన్నయ్య కుమార్ పై కేసు నమోదవ్వడం, జెఎన్‌యు దేశద్రోహులను ఉత్పత్తి చేస్తున్నట్టుగా ఆరోపణలు రావడం, దీనిపైన దేశ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవ్వడం లాంటి పరిణామాలు జరిగాయని ఆయన వివరించారు. వైస్ ఛాన్సలర్లు యూనివర్సిటీలో భాగం కాదని, అధికారులు మాత్రమేనని వివరించారు. యుజిసి విసిల నియామక ప్రక్రియపై ఏ విధంగా సిఫారసు చేస్తుందని ప్రశ్నించారు. సబార్డినేట్ లెజిస్లేషన్ కు సంబంధించి రాజ్యాంగంలో పరిమితులు ఉన్నాయని జస్టిస్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఏటా 32.5 మిలియన్ల మంది గ్రాడ్యుయేట్లు బయటికి వస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని యుజిసి మార్గదర్శకాలను తీవ్రమైన సమస్యను గమనించాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సూచించారు.

**పాలసీలను మారుస్తున్నదెవరు..?:హరగోపాల్**

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో స్వేచ్ఛ ఉండాలని, యుజిసి జోక్యం తగ్గాలని డిమాండ్ చేశారు. యుజిసి అంటే కేవలం గ్రాంట్స్ ఇవ్వడం మాత్రమేనని, కానీ ప్రస్తుతం ఎందుకు యూనివర్సిటీలలో జోక్యం చేసుకుంటుందని, ఎందుకు పాలసీలను మారుస్తోందని, దీనిని ఎవరు మారుస్తున్నారని ప్రశ్నించారు. గవర్నర్లు కేంద్ర రాజకీయాలకు అనుగుణంగా పని చేస్తారని, అలాంటప్పుడు విసిల నియామకాన్ని గవర్నర్లకు అప్పగించడం ఏమిటని అన్నారు. ఏ దేశంలోనైనా, ఎవరైనా ఎప్పటికప్పుడు విద్య అర్హతలను పెంచుతారని, విసిల నియామక అర్హతను తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో విశ్వవిద్యాలయాలలో ముఖ్యమంత్రులు,విద్యా శాఖ మంత్రులు జోక్యం చేసుకోలేదని హరగోపాల్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విశ్వవిద్యాలయాలలో జోక్యం చేసుకోవద్దని సూచించారు.

**స్వయం ప్రతిపత్తికి గొడ్డలిపెట్టు : కోదండరామ్**

ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ మాట్లాడుతూ యుజిసి మార్గదర్శకాలు విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి గొడ్డలి పెట్టుగా అభివర్ణించారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడాల్సిన యుజిసినే విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బకొట్టేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ఒక రాజకీయ పార్టీ అభిప్రాయాలు మేరకే కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నియామకాలు జరుగుతున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతున్నాయన్నారు. విశ్వవిద్యాలయాల్లో భావ సంఘర్షణకు ఎంత అవకాశం ఉంటే అంత మంచిదని తెలిపారు. ప్రొఫెసర్ శాంతాసిన్హా మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల నుంచి వస్తున్న మేధావి వర్గంతో ప్రభుత్వం ఇబ్బందిపడుతోందని, అందుకే ఆ వర్గం లేకుండా యుజిసి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. యుజిసి చట్టాలు చేయదని, కానీ ఇలా మార్గదర్శకాలు విశ్వవిద్యాలయాలపై రుద్దడం ఏమిటని ప్రశ్నించారు.

ప్రొఫెసర్ డి.నర్సింహా రెడ్డి మాట్లాడుతూ యుజిసి ముసాయిదా మార్గదర్శకాలు ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేలా ఉన్నాయన్నారు. నూతన విద్యా విధానంతో దేశం ఏమైంతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ తిరుపతిరావు మాట్లాడుతూ యుజిసి మార్గదర్శకాలతో ఇక నుంచి విశ్వవిద్యాలయాలు పునరవాస కేంద్రాలుగా మారుతాయని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ రమామేల్కొటే మాట్లాడుతూ యుజిసి మార్గదర్శకాలతో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందన్నారు. ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ను దెబ్బతిశారన్నారు. ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల విసిల నియామకానికి అర్హతలను తొలగించడం ద్వారా భవిష్యత్‌లో డిగ్రీ విద్యార్హ త ఉన్న వారు కూడా విసిలు అయ్యే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కె.లక్ష్మి నారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో వ్యాపార రంగానికి చెందిన వారు విసిలుగా వస్తే, ప్రభుత్వ విద్య కూడా వ్యాపారంగా మారుతుందన్నారు. టీచర్లు నిధుల సేకరణకర్తలుగా మారే అవకాశాలు ఉంటాయిన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ యుజిసి అనేది ఒక ఆర్థిక సంస్థ అని, అలాంటి సంస్థ ప్రతి ఆరు నెలలకోసారి ఏదో ఒక కొత్త విధానాలను ప్రవేశపెడుతోందని ఆరోపించారు.

**ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు..**

**అగోరాలు విసిలు కావొచ్చు.: ఆకునూరిమురళి**

యుజిసి మార్గదర్శకాలను అమలు చేస్తే భవిష్యత్‌లో రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, అగోరాలు కూడా విసిలుగా మారే ప్రమాదం ఉన్నదని తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ ఆరోపించారు. కేంద్రం యుజిసి ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలపై దాడి చేస్తోందని మండిపడ్డారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సిబిఐ, ఇడి, ఎన్నికల కమిషన్ సంస్థల తరహాలోనే యుజిసిని కూడా కేంద్రం తన రాజకీయాలకు వాడుకుంటుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న విసిల నియామక అధికారాన్ని యుజిసి ద్వారా కేంద్రం తన పరిధిలోనికి తెచ్చుకుంటుందని మండిపడ్డారు. ఈ సదస్సులో తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, చారగొండ వెంకటేష్, జ్యోత్స్నరెడ్డి హాజరయ్యారు.

## ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షల నియామక పత్రాలు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు 2022–2023 మధ్య అనేక లక్షల నియామక పత్రాలు జారీ చేశాయని గురువారం రాజ్యసభకు తెలియజేశారు. వివిధ పోస్టులకు జరిగిన నియామకాల వివరాలను సంబంధిత మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలు లేదా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర వాటితో పాటు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ వంటి సంబంధిత నియామక సంస్థలు నిర్వహిస్తాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. '2022–2023 సంవత్సరంలో 18 నెలల్లో లక్షల ఉద్యోగాలు ఇవ్వబడ్డాయ' అని ప్రభుత్వాన్ని అడుగగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 22, 2022న రోజ్‌గార్ మేళాను ప్రారంభించారని సింగ్ చెప్పారు. 'వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలోని 4550 నగరాల్లో కేంద్ర స్థాయిలో ఇప్పటివరకు పద్నాలుగు రోజ్‌గార్ మేళాలు జరిగాయి. 2022, 2023లో పాల్గొన్న మంత్రిత్వ శాఖలు, విభాగాలు మొదలైన వాటి ద్వారా అనేక లక్షల నియామక పత్రాలు జారీ చేయబడ్డాయి అని కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి సింగ్ తెలిపారు. 2022 నుండి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో ఖాళీలు ఎందుకు పెరిగాయి అని అడిగిన ప్రశ్నకు, ప్రభుత్వంలో ఖాళీలు ఉన్న పోస్టులను భర్తీ చేయడం నిరంతర ప్రక్రియ అని ఆయన తెలిపారు. రోజ్‌గార్ మేళాల ద్వారా, అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలలో నియామకాలు మిషన్ మోడ్‌లో జరిగాయని మంత్రి తెలిపారు.

## ట్రంప్ గుబులు

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం జిల్లా నుంచే ఎక్కువ మంది ఉండడం గమనార్హం. తానా మొదలు అనేక సంఘాలను స్థాపించి దాని నాయకత్వ బాధ్యతల్లోనూ ఖమ్మంజిల్లా వారు ఉన్నారు. కానీ రెండవ సారి ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికాలో ఉన్నపిల్లల తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపారు. అమెరికా నుంచి బలవంతంగా పంపిన వారిలో ఒక్క ఖమ్మం జిల్లాకు చెందిన 14 మంది ఉండటం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లిన విద్యార్థులు పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తే తప్ప అక్కడ జీవించే పరిస్థితి లేదు. అమెరికా పంపేందుకు ఇక్కడ బ్యాంకుల ద్వారా రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు అప్పు చేసి ఇంకా కొంత మంది ఆస్తులు తాకట్టు పెట్టి విదేశాలకు పంపించారు. చదువు పూర్తయిన తర్వాత కూడా ఓపిటి( ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) పూర్తి చేసి ఏదో ఒక కంపెనీలో పార్ట్‌టైం చేస్తూ కొంతలో కొంత మిగుల్చుకుని తల్లిదండ్రులకు పంపేవారు. ఇక్కడి తల్లిదండ్రులు వారి పిల్లల ఖర్చుకు చేసిన అప్పులకు జమ చేస్తూ ఉండేవారు. చదువు కోసం వెళ్లిన వారు కూడా ఏదో ఒక పార్ట్‌టైం జాబ్ చేస్తూ తల్లిదండ్రులకు భారం కాకుండా చూసుకునే వారు. కానీ ఇప్పుడు విద్యార్థులు పార్ట్‌టైం ఉద్యోగాలు చేయడానికి వీలు లేదని ట్రంప్ నిబంధనలు పెట్టడంతో ఇక్కడి నుంచి నెలకు రూ. 60వేల నుంచి రూ. 80వేలు పంపించాల్సి వస్తుంది. ఎందుకంటే అమెరికాలో కనీస జీవనానికి రూ. 700 నుంచి రూ. 800 డాలర్లు అవసరం అవుతాయని అంచనా. అట్లాంటా, ఓహాయో, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, న్యూయార్క్, చికాగో, డల్లాస్‌లో తెలుగు వారు ఎక్కువగా ఉన్నారు. కేవలం పార్ట్‌టైం ఉద్యోగాలు చేయనివ్వకుండా నిషేధించడం ఇక్కడి తల్లిదండ్రులకు పెను భారంగా మారింది. ఇది ఒక సమస్య అయితే ఓపిటి పూర్తయిన తర్వాత ఏ ఉద్యోగం దొరక్క అమెరికాలో ఏదో ఒక పని చేసుకుంటూ జీవించే వారిపైన ట్రంప్ ప్రభుత్వం కక్ష కట్టింది. వెతుకులాడి మరి పట్టుకుని పంపిస్తున్నారని ఇక్కడి వారు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అక్కడ ఒత్తిడిలో ఉన్న యువత ఫోన్లు ఎత్తకపోతే కన్నీరు మున్నీరుగా కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. ఏమి జరుగుతుందోనన్న ఆందోళన తమ వారిని ఎక్కడైనా బంధించారోనన్న భయం తీవ్ర మానసిక ఇబ్బందికి గురి చేస్తుంది. ఒకవేళ కేవలం చదువుకే పరిమితం చేద్దామంటే రెండేళ్ల పాటు ఆర్థిక భారాన్ని మోసే పరిస్థితి లేక సతమతమవుతున్నారు.

చాలా మంది తల్లిదండ్రులు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అక్కడ ఉండవద్దు వచ్చేయండి అంటూ బతిమిలాడుతుండగా ఓసారి తిరిగి వస్తే ఇక మళ్లీ వెళ్లడం కుదరదు అని చదువు కోసం వెళ్లి అక్కడ పార్ట్‌టైం చేస్తున్న వారు సమాధానం ఇస్తున్నారు. ఒకనొక దశలో ఒక్క ఖమ్మం నగరానికే నెలకు వంద కోట్ల విదేశీ కరెన్సీ ఖాతాల్లో జమ అయ్యాయన్న అంచనా ఉంది. విదేశాలకు వెళ్లిన వారి పరిస్థితి చూసి మధ్యతరగతి, దిగువ మధ్యతరగతికి చెందిన వారు సైతం తమ పిల్లలను పంపించి ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు.

ఇదిలా ఉండగా ఏడాది గడిచిన తర్వాత నుంచి బ్యాంకులు రుణ చెల్లింపులకు సంబంధించి ఒత్తిడి తీసుకువస్తున్నాయి. రూ. 25 లక్షల రుణం తీసుకుని తమ కుమారున్ని అమెరికా పంపించిన తండ్రి కుమారుడికి పార్ట్‌టైం ఉద్యోగం చేసే అవకాశం దొరక్క అతనికి నెలకు రూ. 60 వేల నుంచి రూ. 80 వేలు పంపించడంతో పాటు రూ.49వేల బ్యాంకు ఈఎంఐ కట్టేందుకు ఇబ్బందిపడి ఉన్న కొద్దిపాటి ఆస్తిని తెగనమ్మేందుకు సిద్దపడ్డాడు. ఖమ్మం నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం పురోగమించేందుకు విదేశాలలో స్థిరపడిన వారి పెట్టుబడేనన్నది అందరికి తెలిసిన సత్యమే. ఇప్పుడు ఆర్థిక లావాదేవీలు , క్రయ విక్రయాలు దాదాపుగా నిలిచిపోయాయి. ఇంత ఖర్చు పెట్టిన తర్వాత తమ పిల్లల భవిష్యత్తు ఏమిటన్న మానసిక వేదన తల్లిదండ్రులకు కంటిపై కునుకు లేకుండా చేస్తుంది. ట్రంప్ పేల్చిన ఈ బాంబుకు ఎన్ని కుటుంబాలు వీధినపడతాయో, ఎందరి భవిష్యత్తు చిధ్రమవుతుందో వేచి చూడాలి.

## సింగరేణి మనుగడ

(మొదటి పేజీ తరువాయి)

సోలార్, విండ్ పవర్, ఐరన్ ఓర్, లిథీనియం బ్యాటరీల తయారీ వ్యాపారాల వైపు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టి సారించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కొత్తమైన్స్ రాక పోగా, ఉన్నవాటిని ప్రైవేటీకరణ చేస్తున్నారని, కేంద్ర ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గుబ్లాకులను సింగరేణికే ఇవ్వాల రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం గట్టిగా నిలబడటం లేదన్నారు. సంస్థ మనుగడ కోసం ఎంతో కాలంగా శ్రమించిన కార్మికులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపించకుండా ఔట్సోర్సింగ్ వైపు గొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు నిక్కచ్చిగా ఉన్నాయని, సింగరేణిలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా రాజకీయ జోక్యం మితిమీరి పెరిగిపోయిందని విమర్శించారు. సింగరేణి సంస్థ డైరెక్టర్లు లేకుండా నడుస్తోందని, వందేళ్ల చరిత్రలో ఇలాంటి దుస్థితి ఎన్నడూ లేదని, దీంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో పడిపోతున్నాయని, మరో ప్రక్క ఉత్పత్తిపై ప్రభావం పడుతోందన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడాది కావస్తున్నాగుర్తింపు సంఘంతో చైర్మన్ స్థాయి సమావేశం జరగలేదని, ఎన్నికల కోడ్ సాకుతో కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సొంతింటి పథకానికి 200 గజాల స్థలం కేటాయించి వడ్డీలేని బ్యాంకు రుణాన్ని అందిస్తే కార్మికులు ఇంటిని నిర్మించుకుంటారని చెప్పారు. అనంతరం సింగరేని కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం(ఏఐటియూసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాటాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా హై పవర్ వేతనాలు ఇస్తుంటే సింగరేణిలో మాత్రం అరకొర వేతనాలతో సరిపెడుతున్నారని, కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ప్రకారం బెల్టు యాజమాన్యం ప్రభుత్వ సూచనల మేరకే నడుచుకోవడం, యాజమాన్యం గుర్తింపు కార్మికసంఘాన్ని పట్టించుకోక పోవడం శోచనీయమని, అలాంటప్పుడు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం దేనికని ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికుల హక్కుల కోసం, సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కేంద్ర కమిటీ నాయకులు, వివిధ బ్రాంచీల కార్యదర్శులు కే రాజ్ కుమార్, మిర్యాల రంగయ్య, కే సారయ్య, వై రావు, మద్ది ఎల్లయ్య, ముస్క సమ్మయ్య , ఎం. వెంకటస్వామి,వంగా వెంకట్, బాజీసైదా,వై రాంగోపాల్, కిషన్ రావు, వీరస్వామి, అక్బర్‌అలీ, వి.మల్లికార్జునరావు, రాజారత్నయ్య,రమణ మూర్తి,నజీర్‌అహ్మద్,పోశం రవీందర్,మల్లేష్,సుధాకర్,కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com